శ్రీకల్కి పురాణం

పురిఘళ్ళ శ్రీఫణి సీతారామన్

శ్రీకల్కి పురాణము

గ్రంథకర్త

పురిఘళ్ళ శ్రీఫణి సీతారామన్

ఓం శ్రీరామ

నాహం కర్తా

హర: కర్తా

అంకితం

శ్రీ సీతారామచంద్రుల పాదపద్మములకు

శ్రీసీతాస్తుతి

అగుపించని మాయయట
అవనికరుదెంచిన అనురాగ వల్లియట
అణువణువున సుగుణాల మల్లియట
అగుపించిన తల్లి మాయమ్మ సీతయట ॥

నడచిన నిను నడిపించెద నా అరిచేతులపై
కుడిచిన నిను తినిపించెద మధురాన్నముల్
తలచిన కరుణామృత వీక్షణ దర్శనమిమ్ము
ధరణిజ మదిదాచుకొందు నిను పదిలముగా ॥

విషయసూచిక

ప్రథమాంశము

1. కలి వివరణము 17

2. కల్కి జన్మోపనయనము 20

3. కల్కి వరలాభము 22

4. హర వరప్రదానము 24

5. పద్మా స్వయంవరము 26

6. శుక పద్మ సంవాదము 28

7. హరిభక్తి వివరణము 29

ద్వితీయాంశము

1. కల్కి ఆగమన వర్ణనము 35

2. పద్మా కల్కి సాక్షాత్ సంవాదము 37

3. నృపస్థవము 38

4. అనంత మాయాదర్శనము 40

5. అనంత మాయా నిరశనము 42

6. బుద్ధ నిగ్రహ కీటక పురాగమనము 45

7. బౌద్ధ యుద్ధము 47

తృతీయాంశము

1. మ్లేచ్ఛ నిధనము 53

2. కుతోధరీ వధానంతర ముని దర్శనము 55

3. సూర్యవంశ వర్ణనమందు రామచరితము 57

4. చంద్రవంశ కీర్తనము 60

5. కృతయుగాగమనము 62

6. కల్కిసేనా సంగ్రామము 63

7. కోక వికోకుల వధ 65

8. శశిధ్వజ, కల్కిసేనా సంగ్రామము 67

9. ధర్మ, కల్కి, కృతయుగాపహరణము 69

10. కల్కి, రమా వివాహము 70

11. నృపగణ శశిధ్వజ సంవాదము; జాతిస్మర కథనము 72

12. భక్త, భక్తి మాహాత్మ్యము 74

13. శశిధ్వజునిచే చక్రమరణాఖ్యానము 76

14. విషకన్యా మోక్షకృత ధర్మవృత్తి కథనము 78

15. మాయాస్థవము 79

16. విష్ణుయశ మోక్షము; రామదర్శనము 81

17. రుక్మిణీ వ్రతము 83

18. కల్కి వర్ణనము 85

19. కల్కి నిర్ణయము 86

20. గంగాస్థవము 88

21. సంక్షేప కల్కి పురాణము 89

ముందుమాట

కల్కి ఎవరు? కలియుగం ఎంతవరకూ వుంటుంది? కలియుగ లక్షణములు ఏమిటి? కల్కి ఎప్పుడు వస్తాడు? ఇవి చాలామంది హృదయాలలో కదలాడే ప్రశ్నలు. కలియుగంలో నివసిస్తున్న మనకు కలియుగ లక్షణాలు చెప్పనవసరం లేదు. కానీ ఈమధ్య శంభల నగరాన్ని చూచేమనీ, కలిపుట్టుక అయిపోయిందనీ, సత్యయుగం ఆవిర్భవించినదనీ, ఇలా కోకోల్లలుగా వినిపిస్తున్నాయి. ఇటువంటి నేపథ్యంలో కల్కి చరిత్ర తెలుసుకోవటం ఎంతయినా ఆవశ్యకం. నిజానికి మనమింకా కలియుగం ప్రథమపాదంలోనే వున్నాము. వ్యాసుడు మహాభారతాన్ని చెరుకుతో పోల్చి అధ్యాయాలకు "పర్వములు" అని పేరుపెట్టాడు. మరి చెరుకును తిని, రసాన్ని ఆస్వాదించి పిప్పిని విడిచిపెడతాం కదా? మునులు, పండితులు ఆ మహానుభావుడిని ప్రశ్నించారు ఇందులో విడిచిపెట్టవలసినది ఏది అని? ఆయన నింపాదిగా ఈ మహద్గ్రంథంలో భగవద్గీత, విష్ణు, శివ సహస్రనామావళి, మనుజులు ఆచరించవలసిన ధర్మాలు వంటి రసాన్ని స్వీకరించి కథను వదిలిపెట్టండి అని శెలవిచ్చాడు. ప్రతీ పురాణంలోనూ కథను ఆనుకొని ఎన్నో భక్తిరస ఆఖ్యానాలు, స్తోత్రాలు, నిగూఢ మంత్ర రహస్యాలు వుంటాయి. వాటిని తప్పక స్వీకరించాలి. ఈ కల్కిపురాణం కూడా అట్లే!

వ్యాసుడంతటి మహనీయుడు "నేను కలియుగంలో ఎందుకు పుట్టలేదు?" అని బాధపడ్డాడు. ఎందుకంటే కృత, త్రేతా,ద్వాపరాలలో ఎంతో కష్టతరమయిన సాధనలు, యజ్ఞ యాగాదుల ద్వారా తప్ప పొందలేని భగవత్కృప కేవల నామస్మరణ ద్వారా లభిస్తుంది. అందువలన కలియుగంలో జన్మించిన మనమందరం ఎంతో అదృష్టవంతులం. మనమందరం నిరంతరం ఏదో ఒక భగవన్నామాన్ని పట్టుకొని స్మరిస్తూ ఆ పరమాత్మని చేరుకొందాము.

ఈ గ్రంధానికి సహాయపడిన మహానుభావుల్ని ఇక్కడ ఒక్కసారి తలచుకోవాలి. ఈ గ్రంధానికి ముఖచిత్రం ప్రసాదించిన మహానుభావుడు, నా ప్రియమిత్రుడు శ్రీ నీలేష్‌జత్వా. ఆయన సహాయానికి ఎంతో ఋణపడి ఉంటాను. ఆయనకు సాంజలిబంధకముగ పాదాభివందనం చేస్తున్నాను. నన్ను ఎల్లప్పుడూ తన పవిత్ర ఆశీస్సులతో దీవించే మా పిట్స్‌బర్గ్ పుర పురోహితులు, మాన్యులు శ్రీ ధర్మతేజ స్వామి. ఆయన పాదములకు సాంజలిబంధకముగ నమస్కరించుచున్నాను. నా పుస్తకాలకు ఎల్లప్పుడూ సహాయపడే ధన్యజీవి శ్రీచరణ్‌తేజ గారు. ఆ మహానుభావుడికి నమస్కృతులర్పించుచున్నాను. ఎల్లప్పుడూ నా వెన్నుతట్టి నన్ను ప్రోత్సహించే నా శ్రీమతి ఉమ. ఆమె ప్రోత్సాహానికి నేను ఎల్లప్పుడూ ఋణపడి ఉంటాను. నాకు ఈ గ్రంధరచనకు తోడ్పడిన ఇతర గ్రంధములు శ్రీ ఎస్.ఎన్.ఖండేల్‌వాల్, శ్రీమతి డా॥ పుష్పగుప్త గార్లు రచించిన హిందీ అనువాదములు. వీరిరువురికీ సహితము నేను శిరసు వంచి పాదాభివందనం కావించుచున్నాను.

వ్రాసేది, వ్రాయించేది, వ్రాయబడేది సర్వం శ్రీసీతారామచంద్రులు మాత్రమే!

ఈ గ్రంథంలో తప్పులన్నీ నావి. ఒప్పులన్నీ పరమేశ్వరునివి.

రామన్.

ప్రధమాంశము

ఒకటవ అధ్యాయము

(కలి వివరణము)

ప్రాత:స్మరామి గణనాథమనాథ బంధుం
సిందూరపూర పరిశోభిత గండయుగ్మమ్
ఉద్దండవిఘ్న పరిఖండన చండదండమ్
అఖిలాండ సురనాయక బృందవంద్యమ్ ॥

అమ్మలగన్నయమ్మ, ముగురమ్మల మూలపుటమ్మ, చాల పెద్దమ్మ
సురారులమ్మ కరుపాఱడి పుచ్చినయమ్మ తన్ను లోనమ్మిన వేల్పుటమ్మల
మనంబుల యుండెడియమ్మ, దుర్గ మాయమ్మ
కృపాబ్ధి ఇచ్చుత మహత్వ, కవిత్వ, పటుత్వ సంపదల్ ॥

ఇంద్రాది సమస్త దేవతానీకము, మునిజనము, సర్వలోక పాలకులు, జీవులు, శ్రేష్ఠులు, తమతమ కార్యసిద్ధికై ఎవరిని నిరంతరము భక్తిపూర్వకముగ ఉపాసించుచుందురో, ఎవరు విఘ్ననాశకుడు, అనంతుడు, అచ్యుతుడు, జన్మరహితుడు, సర్వజ్ఞుడు, సర్వులకు ఆశ్రయభూతుడు, వివిధ వైదిక, తంత్రశాస్త్రముల ద్వారా ప్రతిపాదింపబడిన మంత్రముల ద్వారా పూజలు గైకొనునో, ఆ పరబ్రహ్మ, పరమాత్మకు ప్రగాఢ భక్తితత్పరతతో నమస్కరించుచున్నాను. నారాయణునకు, నరునకు, సరస్వతీదేవికి, వేదవ్యాసునకు నమస్కరించి నేను ఈ పురాణమందు ప్రవేశించుచున్నాను. సత్యయుగాది వివిధ యుగములందు అవతారముదాల్చు విభుడు, సర్వ జీవ, జంతు, వృక్ష జాలములకు ఆదిబీజము, ధర్మ ప్రవర్తకులకు కొంగుబంగారము, మహాభుజుడై ముష్టి యందు అగ్నివలె ప్రజ్వరిల్లుచున్న కరవాలము ధరించి, నిరంతరము అశ్వారూఢుడై "కల్కి" నామమున ధర్మ సంస్థాపన మొనరించు విష్ణు భగవానుడు, పరమాత్ముడు సర్వులను రక్షించుగాక! కాలము అనాది. ఆ కాలగమనమందు అనేక మన్వంతరములు, వాని యందు అనేక మహాయుగములు, ప్రతి మహాయుగమందు చతుర్యుగములు, ఆ యుగములందు అనేక విధములయిన సృష్టి జరుగుచుండెను. అందలి ఒకానొక పుణ్యసమయమున శౌనకాది ఎనభైఎనిమిది వేలమంది ఋషులు నైమిశారణ్యమందు సత్రయాగ మాచరించుచుండిరి. వారి వద్దకు వేదవ్యాసుని శిష్యరత్నము, పురాణేతిహాసముల జ్ఞాత అయిన సూతుడేతెంచెను. ఆ మహాత్ముని రాకను గమనించిన శౌనకాది ఋషులు ఆయనకు సాదరముగ ఎదురేగి, సాంజలిబంధకముగ నమస్కరించి, ఆహ్వానించి, సుఖాశీనుని కావించి, అర్ఘ్య పాద్యాదులు సమర్పించి, ఆయన సేదతీరిన పిమ్మట వినమ్రులై ఆయనను ఇట్లు ప్రశ్నించిరి "ఓ! సర్వ ధర్మపరాయణా! త్రికాలజ్ఞాతా! పురాణజ్ఞా! రోమహర్షణపుత్రా! సూతా! దయచేసి మాకు భగవత్కథలను వినిపింపవలసినది. అంతేకాదు "కలి" ఎవరు? ఈతని జననమెట్లు జరిగినది? ఈతడు ఏవిధముగ పృథివికి స్వామియై నిత్య ధర్మనాశన మొనర్చెను? స్వామీ! ఈ విషయ విశేషములన్నియు దయచేసి సంపూర్ణముగ వివరింపవలసినది."

మహర్షిగణము ఈవిధముగ ప్రశ్నించిన మీదట రోమహర్షణపుత్రుడు ఉగ్రశ్రవశుడు (సూతుడు)

అమితానందభరితుడై విష్ణు భగవానుని స్మరించి ఇట్లనియె "పూర్వకాలమున చతుర్ముఖ బ్రహ్మదేవుడు ఈ అత్యద్భుత పురాణమును నారదునికి వినిపించెను. తదుపరి నారదుడు మహాతేజస్వీ, నారాయణాంశ సంభూతుడయిన మా గురుదేవులు వ్యాసునికి ఈ పురాణమును ఉపదేశించిరి. వ్యాసుడు అద్దానిని తన పుత్రుడయిన బ్రహ్మరాతునకు (శుకుడు) తెలిపెను. శుకుడు ఒకానొక సమయమున సభామధ్యమున అభిమన్యుని పుత్రుడయిన పరీక్షితునకు భాగవత ధర్మములు ఉపదేశించెను. ఆ ఉపదేశములన్నియు పూర్ణమవకుండగనే పరీక్షితుడు ఒక సప్తాహానంతరము శృంగి శాపమున తక్షక విషాగ్ని జ్వాలలందు భస్మీభూతుడయ్యెను. అందువలన బ్రహ్మరాతుడు ఈ దివ్య పురాణమును పరీక్షితునకు వినిపింప లేకుండెను. కానీ ఆ సభ యందు ఆసీనులై యున్న మార్కండేయాది మహర్షులు తిరిగి శుకుని చేరి తిరిగి ఈ పురాణమును గూర్చి ప్రశ్నించిరి. ఆ సమయమున ఆ మహర్షులతో పాటు శుకుని ముఖారవిందము నుండి భవిష్యత్ నందు జరుగు ఈ మహాద్భుత పురాణమును నేను సహితము ఆలకించితిని. నేను ఆ ఆఖ్యానమంతయు మీకు వినిపించెదను. ఓ! మహానుభావులారా! దయచేసి ఏకాగ్రతతో వినవలసినది." శ్రీకృష్ణ భగవానుడు తన అవతార పరిసమాప్తి గావించి వైకుంఠమునకు చనిన పిదప కలి ఉత్పత్తి జరిగినది. ప్రళయానంతరము చతుర్ముఖ బ్రహ్మదేవుడు సృష్టి ఆరంభమునకు పూనుకొనెను. ఆయన పృష్ఠభాగమునుండి పరమ భయంకరము, మలినము, అయిన పాపము ఉత్పన్నమయ్యెను. అయ్యది "అధర్ముడు" అను నామమున ప్రసిద్ధమయ్యెను. ఈ అధర్ముని వంశవర్ణనము, శ్రవణము లేక స్మరణచే సంసారమందలి పాపముల నుండి జనులు ముక్తులగుదురు. (శ్లోకార్ధము – అధర్మ వంశవర్ణనముచే అందలి దోషములు తెలిసి జనులు అవి కావింపకుండ జాగ్రత్త పడెదరని భావము). ఈ అధర్ముడు అత్యంత సౌందర్యరాశి, పిల్లికళ్ళు కలిగిన "మిధ్య" అను కన్యను వివాహమాడెను. వీరిరువురికీ అమిత తేజస్వీ, అత్యంత క్రోధుడు అయిన "దంభుడు" అను పుత్రుడు, "మాయ" అను పుత్రిక ఉత్పన్నమయిరి. ఈ దంభ, మాయల సోదర, సోదరీ అధర్మ కలయికచే "లోభుడు" అను పుత్రుడు, "నికృతి" అను పుత్రిక ఉత్పన్నమయిరి. వీరి అధర్మ కలయికచే "క్రోధుడు" అను పుత్రుడు, "హింస" అను పుత్రిక జన్మించిరి. ఈ క్రోధ, హింసల అధర్మ కలయికచే తైలమిశ్రిత కాలాంజన సదృశుడు, కరాళముఖుడు, కాలసర్పము వంటి మెలితిరిగిన నాలుక కలవాడు, దుర్గంధభూయిష్ఠ శరీరుడు, అయిన "కలి" అను పుత్రుడు, "దురుక్తి" అను పుత్రిక ఉత్పన్నమయిరి. ఈ కలి తన జననేంద్రియమును తన ఎడమచేతితో చుట్టి జన్మించెను. ఈ కలికి తన సోదరి యందు "భయుడు" అను పుత్రుడు, "మృత్యువు" అను పుత్రిక కలిగిరి. భయునికి మృత్యువు యందు "నిరయుడు" అను పుత్రుడు, "యాతన" అను స్త్రీ జన్మించిరి. వీరిరువురికీ వేలాది ధర్మనిందకులయిన సంతతి కలిగిరి. ఈ సంతతి ఆది (మానసిక వ్యధ), వ్యాధి (శారీరక రోగము), జర (ముసలితనము), గ్లాని, దు:ఖము, శోకము, భయము, మొదలగు వారి సహాయముచే యశస్సు, స్వాధ్యాయము, దానధర్మములు, ధర్మశాస్త్రముల వినాశన మొనరించిరి. ఈ కలి అనుచరులందరూ ఒక సంఘమై జనులందరినీ అల్పాయువులు, కాముకులను కావించి మృత్యు సమ్ముఖమున పడవైచిరి.

ఈ కలియుగమందు జనులు అహంకారపూరితులై, దురాచారులై, తల్లిదండ్రుల పట్ల దయాహీనులై, హింసాప్రవృత్తి కలవారగుదురు. బ్రాహ్మణులు వేదహీనులు, శోకగ్రస్తులై, శూద్రసేవా తత్పరులైరి. వేద, వేదాంగ, పురాణములను, ఇతిహాసములను, అత్యంత కుతర్కముతో వల్లించుచూ, వేదమునూ ధర్మమునూ విక్రయించుచూ చివరకు సంస్కారహీనులై మద్య మాంసములను సహితము విక్రయించు భ్రష్టులగుదురు. జనులు నిరంతరము పరదారాగమనము నందు ఆసక్తియుతులై, క్రూరులై, శిశ్నోదర పరాయణులై (తుచ్ఛ కామము, ఉదర పోషణమే పరమార్ధమను దుశ్శీలురు) వర్ణసంకరము కావించెదరు. అంతేకాక జనులు మురగుజ్జులై పరిపూర్ణ పాపపరాయణులై, శఠులై (పైకి ఒక మాట, లోపల వేరొక తలంపు గల జనులు), మఠవాసులై, కేవలము పదహారేండ్ల ప్రాయమే పూర్ణాయువు అగును. జనులు నీచ ప్రసంగులై కేవలము భార్యవైపు బంధువులనే తమ బంధువర్గముగ తలంచెదరు. నీచ సాంగత్యమును కోరుకొందురు.

బ్రాహ్మణులు కేశ, వేషములందు ఆసక్తులై, వివాదములందు ఉత్సుకులై, కలహములచే క్షుబ్ధులై, ఎల్లప్పుడూ దాన పరిగ్రహణమునకు ఇష్టపడెదరు. సన్యాసులు గృహస్థులవలె ఇంటియందు నివసించుచూ, వివేకరహితులై, గురునిందా తత్పరులై అధర్మమును ప్రచారమొనరించి సజ్జనులకు దు:ఖము కలిగించెదరు. ఈ మిధ్యా సన్యాసులు నీచులై, పరధనాసక్తులై, ఎల్లప్పుడూ ఇతరులనుండి బహుమతులు గైకొనుటకు ఇష్టపడెదరు. వివాహములు కేవలము స్త్రీ పురుషుల యందలి ఆసక్తి చేతనే కలుగును. నీచ, దుష్ట సాంగత్యము మిక్కుటమగును. ఎక్కువగా ప్రలపించువారు పండితులనబడుదురు. ధర్మప్రచారము కేవలము యశ:ప్రాప్తి (కీర్తి ఖండూతి), ధనప్రాప్తి కోసమే చేయబడును.

ప్రతిదానము (ఒక వస్తువునకు ప్రతిగా వేరొక వస్తువు నిచ్చుట) అనునది దానశీలత అనబడును. న్యాయాధికారులు అపరాధ దండనమందు అసమర్థులగుదురు. జనులు ఏ పనిచేయుటకు శక్తిలేని దుర్బలులై, సోమరులై యుందురు. ధనవంతులే సాధుపురుషులనీ, దూరదేశమందలి జలములే తీర్ధమనీ, కేవలము యజ్ఞోపవీత ధారణమే బ్రాహ్మణత్వమునకు, దండధారణే సన్యాసిత్వమునకు చిహ్నములగును. భూమికి శక్తి నశించి కేవలము అల్ప సస్యములనే ఉత్పన్నమొనర్చును. నదులు ఎండి నదీతీరముననే నీరు గొనుటకు క్రిందికి (లోనికి) దిగవలసి వచ్చును. స్త్రీలు తమ పతుల యందు విముఖులై వేశ్యాలాపములందు అభిరుచి కలిగియుందురు. బ్రాహ్మణులు పరధనమందు ఆసక్తియుతులై, ఛండాలుర ఇండ్లయందు యజ్ఞములు ఒనరించుటకు ఇష్టపడెదరు. స్త్రీలు వైధవ్యమును ఇష్టపడక స్వేచ్ఛావిహారిణులు అగుదురు. మేఘములు కేవలము అల్పవృష్టి కురిపించును. భూమి అల్పముగ సస్యముల నిచ్చును. రాజులు ప్రజాభక్షకులై కేవలము లోకులను పీడించుచూ జీవించెదరు. జనులు తమ భుజములపై తమ సామాగ్రినుంచుకొని, చేత పుత్ర, పుత్రికాదుల ధరించి దుర్లభమైన అడవులను, పర్వతములను ఆశ్రయించెదరు. ఈ విధముగ కలియుగ ప్రధమపాదమందు జనులు మాంసము, కందమూలాదులే భుజించి, ప్రాణరక్షణ కావించుకొని శ్రీకృష్ణ నిందకులగుదురు (శ్రీకృష్ణ భగవానుని నిందించెదరు). రెండవ పాదమందు జనులు కనీసము శ్రీకృష్ణ నామములను సహితము స్మరింపరు. మూడవ పాదమందు సంపూర్ణ వర్ణసంకరము కావించెదరు. నాల్గవ పాదమందు కృష్ణుడు కావించిన మహత్కార్యములన్నింటినీ సంపూర్ణముగ మరచి సర్వులు ఏకవర్ణులగుదురు.

ఈవిధముగ పృధివీజనులు భ్రష్టులగుటచే స్వాధ్యాయము, స్వాహా, స్వధా, వషట్కారములు, వేదపాఠము, ఓంకారము, సంపూర్ణముగ లుప్తమగుటచే దేవతలు, పితృదేవతలు, పరిణామ స్వరూప భోజనము (హవ్య, కవ్యములు) లేక శుష్కితులై, అందరూ కలసి బ్రహ్మదేవుని వద్దకరిగిరి. వారందరూ దు:ఖాతుర మనస్విని అయిన భూమాతను ముందునుంచుకొని వేదపఠనము ప్రతిధ్వనించుచున్న బ్రహ్మలోకమున కేగిరి. ఆ బ్రహ్మలోకము యజ్ఞధూపముచే పరివేష్ఠింపబడి, శ్రేష్ఠ మునులచే సేవింపబడుచూ స్వర్ణవేది మధ్యన ఉపస్థితమయినది. యజ్ఞమండపము యజ్ఞ స్థంభములచే పరివేష్ఠింపబడి మధ్యన యజ్ఞవేదులందు అగ్ని ప్రజ్వరిల్లుచున్నది. ఫల, పుష్ప, భారముచే క్రిందికి వంగిన వివిధ జాతుల వృక్షములచే వనములన్నియు శోభిల్లుచున్నవి. స్వచ్ఛజలములు నిండిన సరోవరములు సారసాది అనేక జలపక్షులకు ఆలవాలమయినవి. ఈ హంస, సారస, కారండవాది పక్షుల కిలకిలలు, లతా సమూహముల పుష్పసౌరభము, జలములందలి శీతలమును కలగలపిన మంద మలయమారుతము, బ్రహ్మలోకమున కరుదెంచిన దేవతా ప్రముఖులు అందరికీ ప్రణామము, ఆహ్వానము, నమస్కారము, మధుర వార్తాలాపములు పలుకుచున్నటులయుండెను. దీనదు:ఖితులైన దేవతలు బ్రహ్మదేవుని ఆజ్ఞను బడసి తమ దు:ఖములను నివేదించుకొనుటకు బ్రహ్మ సదనమున ప్రవేశించిరి. అచట సనక సనందనాది మహర్షులచే పూజింపబడుచున్న పాదపద్మములు కలవాడు, పద్మాసీనుడు, త్రిభువనములకు పిత, స్వామి అయిన చతుర్ముఖ బ్రహ్మదేవుని కాంచి ఆయనకు సాంజలిబంధకముగ నమస్కృతులర్పించిరి.

(శ్రీకల్కి పురాణమందు ప్రధమాంశ యందలి కలి వివరణము అను ఒకటవ అధ్యాయము సమాప్తము)

రెండవ అధ్యాయము

(కల్కి జన్మోపనయనము)

దేవతలందరూ బ్రహ్మదేవుని ఆజ్ఞానుసారము ఆయన ఎదుట కూర్చొని, కలి వలన తాము పొందుచున్న బాధలన్నింటినీ ఆయనకు వివరించిరి. వ్యాకులురైన దేవతల పలుకులు విని విరించి "మనము విష్ణుభగవానుని ఆరాధించి మీ మనోకామనా సిద్ధిని ఒనరించెదము" అని పలికెను. అంత కమలాసనస్థితుడయిన బ్రహ్మ కదలి, దేవతలందరినీ తీసికొని కమలనయనుడు, వైకుంఠవాసి అయిన నారాయణుని వద్దకేగెను. విష్ణుభగవానుడు వారందరినీ ఆశ్వాశించి, కలి బాధా సర్పదష్టులైన వారి ఆక్రందన ఆలకించి ఇట్లు పలికెను "దేవతలారా! భయము, నిరాశ వలదు. నేను మీ కష్టములు తొలగించుటకు శంభల నగరమున విష్ణుయశుడు, సుమతి అను పుణ్యదంపతికి జన్మించెదను. నేను మిగిలిన నా ముచ్వురు సోదరులతో కలసి కలిసంహార మొనర్చెదను. దేవతలు అందరూ మీమీ తేజస్సులతో అచటనే జన్మింపవలసినది. నా ప్రాణప్రియ అయిన లక్ష్మీదేవి సింహళ దేశమున బృహద్రధుడు, కౌముది అను రాజదంపతికి "పద్మ" అను పేరున జన్మించును. నేను కలి సంహారానంతరము "మరువు", "దేవాపి" అను ఇరువురు రాజులను ఈ భూమండలమునకు రాజులుగ స్థాపించి, తిరిగి సత్యయుగమును (కృతయుగము) స్థాపించెదను. అంత పూర్వము వలెనే ధర్మమును స్థాపించి, కలి నాశానంతరము తిరిగి వైకుంఠధామము ప్రవేశించెదను." ఈ పలుకులు విని హృదయానందము నొంది దేవతానీకము, బ్రహ్మదేవుడు, మధుసూదనుడు, పుండరీకాక్షుడు అయిన విష్ణు భగవానునికి నమస్కృతులర్పించి తమతమ స్థానములకు చనిరి.

అంత విష్ణువు తన మాయాబలమున శంభల నగరమున కేతెంచి గ్రహ, నక్షత్ర రాశులు ఉచ్చస్థానమునందున్న సమయమున విష్ణుయశుని శుక్రము నుండి సుమతి గర్భము ప్రవేశించి భ్రూణ రూపము నొందెను. జగత్పతి అయిన విష్ణుభగవానుడు మానవ గర్భవాసము చేయుచుండెనని తెలిసిన నదులు, సముద్రములు, పర్వతములు, స్థావర జంగమాది పృధివీ స్వరూపములు, దేవతలు, మహర్షిగణము అత్యంత హర్షోత్పన్నులయిరి. సంపూర్ణముగ ప్రాణిగణములు తమతమ ఆనందమును వివిధములుగ వ్యక్తమొనర్చినవి. పితృగణములు ఆనందతాండవ మొనరించిరి. దేవతాగణములు విష్ణు భగవానుని యశోగానము ఆలపించిరి. గంధర్వులు వాద్యములు మ్రోగించగా, అప్సరోభామలు నృత్యమొనరించిరి. నెమ్మదిగా సుమతీదేవికి నెలలు నిండి వైశాఖశుక్ల ద్వాదశి నాడు మధుసూదనుడు, విష్ణు భగవానుడు భూమిపై అవతరించెను. ఆ దివ్యబాలుని గాంచి ఆతని మాతాపితరులు అత్యంత ప్రసన్నులయిరి. భగవతి మహాషష్ఠీదేవి పురుడుపోసెను. అంబికాదేవి గర్భనాళమును కోసెను. భాగీరధి తన జలములచే స్వామికి స్నానమొనరించెను. సావిత్రీదేవి తన గాత్రముతో జోలపాడెను. వసుమతి (భూమి) సుధాధారలు వర్షించెను. అష్ట దేవమాతలు (భాహ్మీ, చండీ, మాహేశ్వరీ, వారాహీ, వైష్ణవి, కౌమారి, చాముండ, చర్చిక) మంగళ వచనములు పలికిరి.

ఆ సమయమున ఒక చిత్రము జరిగినది. అప్పుడే జన్మించిన విష్ణుభగవానుడు చతుర్భుజుడై యుండెను. అంత విరించి వాయుదేవుని పిలచి "వెంఠనే ప్రసూతి గృహమునకేగి మానవ దుర్లభమయిన చతుర్భుజములను ఉపసంహరింపమని విష్ణుదేవునకు విన్నపము ఒనర్పుము" అని పలికెను. వాయుదేవుడు సుఖద, సుగంధిత, శీతల వాయురూపమున ఏగి విష్ణువునకు ఆ విన్నపము తెలిపెను. వెంఠనే విష్ణువు తన చతుర్భుజములను ఉపసంహరించి ద్విభుజుడయ్యెను. మాతాపితరులు ఈ దృశ్యము గాంచి ఆశ్చర్యచకితులైరి. కానీ వారిరువురు విష్ణుమాయ యందు మునిగి సర్వము మరచిరి. సుమతీదేవి సకల విశ్వమునకు స్వామి, జిష్ణుడు (ఎల్లప్పుడూ విజయము నొందువాడు) అయిన విష్ణు భగవానుని

పుత్రునిగ బడసి పూర్ణకామయై, బ్రాహ్మణులకు వంద గోవులు దానమిచ్చెను. పవిత్ర మనస్కుడయిన విష్ణుయశుడు ఋగ్, యజుస్, సామ వేదములందు అగ్రగణ్యులయిన బ్రాహ్మణోత్తములను ఆ బాలుని నామకరణమునకు ఆహ్వానించెను. అంత చిరంజీవులయిన వ్యాస, పరశురామ, కృప, అశ్వత్థామలు భిక్షురూపము ధరించి అచటికి ఏతెంచిరి. సమర్థులు, సూర్యసదృశ తేజస్వులయిన ఆ నలుగురినీ కాంచి విష్ణుయశుడు సాదరముగ ఆహ్వానించి, పూజించెను. తదుపరి ఆ నలుగురు చిరంజీవులు సుఖాశీనులై విష్ణుయశుని ఒడిలో పరుండిన, మానవ శిశురూపమునున్న విష్ణుభగవానుని కాంచిరి. అటుపిమ్మట విష్ణుయశుడు జాతకర్మలు ఆచరించి సర్వుల సమక్షమున ఆ బాలునికి "కల్కి" అను ప్రసిద్ధనామము నుంచెను. అంత బుద్ధిమంతులయిన ఆ నలుగురు చిరంజీవులు విష్ణువే పాప వినాశనమునకు ఈ కల్కి రూపమున అవతరించెనని, ఆయనకు నమస్కృతులొనర్చి తమతమ స్థానముల కరిగిరి.

నెమ్మదిగ కాలము గడచుచున్నది. కల్కి శుక్లపక్ష చంద్రుని వలె దినదిన ప్రవర్ధమానుడగుచుండెను. కల్కికి ముగ్గురు సోదరులు కలరు. వారు కల్కి కంటె పెద్ద వయస్కులు. "కవి, ప్రాజ్ఞుడు, మరియు సుమంత్రుడు" అని వారి నామధేయములు. వారు మువ్వురూ సహితము తమ జననీ జనకులకు ఆనందమును కలుగజేయుచూ, గురు, బ్రాహ్మణ పూజనమొనర్చు మహనీయులు. ఈ కల్కి గోత్రము నందే ఆయన కంటె ముందుగా ఆయన అంశచే "గార్గ్య, భర్గ్య, విశాలుడు" మొదలగు సత్పురుషులు సహితము ఉదయించిరి. విశాఖయూప మహారాజుచే సంరక్షితము, దు:ఖరహితమయిన ఆ రాజ్యమందు జనులందరూ కల్కిని కాంచి ఆనందపరవశులగుచుండిరి.

ఈ విధముగ కాలము గడచుచుండగా కల్కి బాల్యావస్థ చేరెను. ఒకనాడు విష్ణుయశుడు ధీరుడు, సర్వగుణ సంపన్నుడు, కమలనేత్రుడయిన కల్కిని విద్యావంతు నొనర్పవలెనని తలచి, ఆతని పిలచి ఇట్లనియె "పుత్రా! నీకు శ్రేష్ఠమయిన ఉపనయన సంస్కారమొనర్చి గాయత్రీమంత్రమును ఉపదేశించెదను. తదుపరి నీవు వేదవేదాంగములు అభ్యసించుటకు అర్హుడవగుదువు." అంత కల్కి "తండ్రీ! వేదమనగా ఏమి? సావిత్రి ఎవరు? ఏ రకమయిన సూత్ర సంస్కరణచే బ్రాహ్మణుడు తెలియబడును? ఈ విషయ విశేషములు దయచేసి నాకు తెలుపవలసినది" అని ప్రశ్నించెను. అంత విష్ణుయశుడు "పుత్రా! విష్ణుభగవానుని పలుకులే వేదము. వేదమాతయే సావిత్రి. మూడు పేటలతో, మూడు ముడులతో వర్ధిల్లు జంధ్యమును ధరించుటచే మానవుడు బ్రాహ్మణునిగ తెలియనగును. దశ యజ్ఞములు (బ్రహ్మ యజ్ఞము, దేవ యజ్ఞము, పితృయజ్ఞము, భూత యజ్ఞము, మనుష్య యజ్ఞము, స్నానము, సంధ్యోపాసన, జపము, హోమము, దానము) నిత్యము కావించుటచే బ్రాహ్మణుడు "బ్రహ్మవాది" అగును. ఈ బ్రహ్మవాదులే త్రిలోకములందు వేదములకు రక్షకులు. ఈ బ్రహ్మవాదులు వైదిక, తాంత్రిక కర్మకాండలగు యజ్ఞము, అధ్యయనము, దానము, తపము, స్వాధ్యాయము, సంయమము మొదలయిన క్రియలు భక్తిపూర్వకముగ ఆచరించి విష్ణుభగవానుని ప్రసన్నుని కావింతురు. అందువలన ఒకానొక శుభ ముహూర్తమున బంధు, మిత్ర, బాంధవుల సమక్షమున నీకు ఉపనయన సంస్కారము కావించెదను" అని పలికెను.

కల్కి "బ్రాహ్మణులు ఏఏ విధానములచే విష్ణువును ఆరాధించెదరు?" అని ప్రశ్నించెను. విష్ణుయశుడు "బ్రాహ్మణుడు తన పత్ని గర్భవతి అయిన పిదప గర్భదానాది సంస్కారములు మొదలుకొని త్రిసంధ్యల యందు గాయత్రీజపము, సావిత్రీ పూజనము, తపస్సు, సత్యము, ధీరత్వము మొదలగు గుణములతో వేదములందలి విష్ణుపూజా పద్ధతిని నేర్చుకొని ఆయన పూజన మొనర్చుచూ సర్వదా ఆనందమగ్నుడై సంసారమును రక్షించును." కల్కి "తండ్రీ! సంపూర్ణ జగత్తును ఉద్ధరించువారు, సాధువర్తనులైనవారికి మోదమొనర్చువారు, త్రైలోక్య మనోరథములను పూర్ణమొనరించువారు, అటువంటి బ్రాహ్మణోత్తములు ఇపుడు ఎక్కడ యుండిరి?" విష్ణుయశుడు "పుత్రా! ధర్మఘాతకుడు, దురాత్ముడు అయిన కలి యొక్క అత్యాచారములచే పీడింపబడి ధర్మాత్ములైన బ్రాహ్మణులు దూరమున కేగిరి. మిగిలిన బ్రాహ్మణజాతి అంతయు ధర్మహీనులు,

క్రియావిహీనులు, శిశ్నోదర పరాయణులైరి. ఈ కలియుగమందు బ్రాహ్మణజాతి అంతయు పాపాచారులై, దురాత్ములై, తేజోహీనులై, తమనుతాము రక్షించుకొనుటకు అశక్యులై శూద్ర సేవకులగుదురు." తన తండ్రి పలుకులను వినిన కల్కి మనస్సునందు ధర్మనాశకమయిన కలి కులమును వినాశన మొనర్పవలెనన్న బీజము పడెను. తదుపరి ఒక శుభ ముహూర్తమున కల్కికి ఉపనయన సంస్కారములు జరిగెను. కల్కి గురుకులమునకేగు సమయము ఆసన్నమయ్యెను.

(శ్రీకల్కి పురాణమందు ప్రథమాంశ యందలి కల్కి జన్మోపనయనము అను రెండవ అధ్యాయము సమాప్తము)

మూడవ అధ్యాయము

(కల్కి వరలాభము)

ఆ సమయమున పరశురాముడేతెంచి ఆ బాలునికి నేను ఆచార్యుడనగుదునని పలికి కల్కిని తన ఆశ్రమమునకు గొనిపోయి ఇట్లు పలికెను "కుమారా! నేను భృగువంశ తిలకుడయిన జమదగ్ని మహర్షి పుత్రుడను. వేదవేదాంగ రహస్యములను కరతలామొనర్చుకొనిన జ్ఞానిని. సర్వ సమర్ధుడను. ధనుర్విద్యా ప్రవీణుడను. ఇరువదిఒక్కమార్లు భూమండలమంతయు సంచరించి క్షత్రియ నాశనమొనర్చిన యోధుడను. ఈ మహేంద్ర పర్వతమునకు తపము ఆచరించుటకు ఏతెంచితిని. ఇకనుండి నీవు నన్ను గురువుగా తలచి వేదవేదాంగములను, అస్త్రశస్త్రవిద్యలను, నావద్దనే యుండి కూలంకషముగ నేర్చుకొనుము." అమృత తుల్యములయిన ఆ పలుకులు విని కల్కి ప్రసన్నుడై, పులకిత శరీరుడై, ప్రథమత: ఆయన పాదములకు నమస్కరించి వేదాధ్యయన ప్రవృతుడయ్యెను. కొంతకాలమునకు కల్కి ఆ పరశురాముని నుండి వేదవేదాంగములు, అరువదినాలుగు కళలు, ధనుర్వేదము, సాంగోపాంగముగ నేర్చుకొని చేతులు జోడించి ఇట్లనియె "స్వామీ! మీ దయచే మీ వద్దనే యుండి నేను సర్వవిద్యలు నేర్చి, అష్టసిద్ధులు పొందితిని. దయచేసి గురుదక్షిణగా ఏమి సమర్పింపవలెనో తెలుపవలసినది". అంత పరశురాముడు "స్వామీ! నీవు సర్వులకు ఆశ్రయుడవయిన నారాయణ భగవానుడవు. కలిని నష్టమొనరించుటకు దేవతలచే ప్రార్థింపబడి ఈ భువిని అవతరించితివి. నీవు నా నుండి విద్య, శంకరుని వద్ద నుండి శస్త్రములు, జ్ఞానమయమయిన చిలుకను పొంది, సింహళ దేశమున అవతరించిన "పద్మ" అను మహాలక్ష్మిని మనువాడెదవు. తదుపరి దిగ్విజయమొనర్చి ధర్మవిహీనులు, కలిప్రియులైన రాజులను, బౌద్ధులను నిర్మూలించి మరువు, దేవాపిలను రాజులుగ స్థాపించెదవు. నీవు కావించు ఈ ధర్మ పరిరక్షణయే నా గురుదక్షిణ. ఎందుకనగా అటుపిదప తిరిగి యజ్ఞ, దాన, తపో కర్మములన్నియు మొదలగును" అని పలికెను.

కల్కి పరశురాముని నుండి ఈ పలుకులు విని, ఆయనకు ప్రణామములిడి, అచటినుండి బిల్వోదకేశమున కేగి శంకర భగవానుని ప్రసన్నుని కావించెను. అంత కల్కి ఎదుట సర్వమంగళకారి, శాంతుడు, క్షిప్రప్రసాదుడు అయిన పరమేశ్వరుడు ప్రత్యక్షమయ్యెను. ఆయనను చూచి కల్కి ఇట్లు స్తుతించెను "ఆద్యదేవా! నీవు సనాతనుడవు. స్వామీ! నీవు పంచముఖుడవు, త్రినేత్రుడవు, మరియు విశ్వనాథుడవు. ఈ చరాచర జగత్తునంతటికీ ఆధారభూతుడవీవే! వాసుకీ కంఠభూషణా, ఆనందమయా, కాముని దగ్ధమొనరించినది నీవే! జటాజూటధరా! గంగను నీ జటాజూటము నందు బంధించితివి. చంద్రశేఖరా! నీకు ప్రణామములర్పించుచున్నాను. ఎవరు భూత భేతాళుర సహితుడైన స్మశానవాసియో, ఖడ్గ, శూలములు ధరించిన భయంకర భుజుడో, ఎవరు పొగలు విరజిమ్ముచున్న క్రోధాగ్నిచే ప్రళయ సమయమున ఈ జగత్తునంతటినీ నష్టమొనరించునో, అటువంటి ప్రభునికి నమస్కారములు అర్పించుచున్నాను. ఎవరు తన్మాత్ర సహిత పంచభూతముల నుండి కాలము, కర్మము, స్వాభావికమయిన జీవజాలమును సృష్టించి, తదుపరి ప్రళయ సమయమున

ఆ సర్వమును నాశనమొనరించి, తిరిగి నిర్మించునో, ఆ మహాపురుషునికి నేను ప్రణామములు అర్పించుచున్నాను. ఎవరు బ్రహ్మ రూపమున ఈ చరాచర జగత్తును సృష్టించి, సత్వ, రజస్, తమో గుణములతో ఆ జగత్తును పాలించునో, ఆ మహేశ్వరునికి నమస్కరించుచున్నాను. ఎవరి ఆజ్ఞచే వాయువు వీచునో, అగ్ని జ్వలించునో, సూర్యుడు తపింపజేయునో, చంద్రుడు అంతరిక్షమున తారా పరివృతుడై పరిభ్రమించుచుండునో ఆ పరమేశ్వరుని శరణుజొచ్చుచున్నాను. ఎవరి బలముచే పృధివి ధరించుచున్నదో, ఇంద్రుడు వర్షము కురిపించుచున్నాడో, కాలము గణించుచున్నదో, మేరుపర్వతము సర్వలోకముల మధ్య యుండి భరించుచున్నదో, సర్వవ్యాపకుడయిన ఆ ఈశ్వరునికి నమస్కృతులు అర్పించుచున్నాను."

కల్కి యొక్క స్థుతిని వినిన సర్వశాశకుడు, మహానియంత అయిన పరమేశ్వరుడు పార్వతీ సహితుడై, సుచిస్మితుడై, తొలుత కల్కి యొక్క సర్వావయవములు తన చేతితో నిమిరి, అత్యంత ప్రసన్నుడై ఇట్లనియె "ఓ! ప్రియతమా! నీ అభీష్ఠ వరమును కోరుకొనుము. నీ ద్వారా కావింపబడిన స్థోత్రముచే నేనత్యంత ప్రసన్నుడనైతిని. ఈ స్థోత్రమును పఠించిన మానవుల ఇహపర కామనలన్నియు పూర్ణమగును. ఈ స్థోత్రమును చదివినా, వినినా, విద్యార్ధులకు విద్య, ధర్మార్ధులకు ధర్మము, ఏ కామనార్ధము కావించెదరో, ఆ కామన పూర్ణమగును. మానవులు నిన్ను సర్వ శస్త్రాస్త్ర నిష్ణాతునిగ, వేదవేదాంగ పారంగతునిగ, సర్వ ప్రాణుల విజేతగా తెలియుదురు. నీకు "గారుడము" అను అశ్వమును ప్రసాదించుచున్నాను. ఇయ్యది నీ ఇచ్ఛానుసారము ఏ రూపమునైననూ ధరించగలిగినది, మరియు సర్వ కామనాపూర్ణ సమర్ధత కలిగినది. అంతేకాదు. రత్నముల పిడి కలిగి సమస్త పృధివీ భారమును ఛేదింపగల మెరయుచున్న కరవాలమును కటాక్షించుచున్నాను. వీటితో సహితముగ "సర్వజ్ఞుడు" అను బ్రహ్మజ్ఞాని అయిన శుకమును సహితము నీ చెంత యుంచుచున్నాను." ఈ విధముగ కల్కికి అనేక వరములొసంగి, ఆదిదంపతి పార్వతీ పరమేశ్వరులు అదృశ్యులయిరి. కల్కి మహాకాళీ, కృత్తివాసులకు అనేక వందనములిడి, కరవాలము ధరించి, గారుడము నధిరోహించి, శుక సహితుడై శంభల నగరము చేరెను.

అచట తన సోదరులను, మాతాపితరులను కలసి, వారికి వందన మాచరించి, పరశురాముని ద్వారా తెలుపబడిన భవిష్యత్ వృత్తాంతమును ఎరింగించెను. తదుపరి పార్వతీ పరమేశ్వర దర్శనము, వారిచే తనకీయబడిన వరముల గూర్చి తెలిపి, వారందరినీ ఆనందభరితుల గావించెను. గార్గ్య, భర్గ్య, విశాలాదులు ఎంతో ఆనందము నొందిరి. ఈ విషయము సర్వులనోటా బడి, వారందరూ వార్తాలాపము లాడుచుండుటచే ఈ విషయములన్నియు మహారాజయిన "విశాఖయూపుని" చెవిన పడినవి. విశాఖయూప మహీపతి మాహిష్మతీ నగరమును రాజధానిగ చేసికొని తన రాజ్యమును పాలించుచుండెను. తన రాజ్యమందు కలి వినాశకుడు సాక్షాత్ విష్ణుభగవానుడు అవతరించెనని తెలిసి పవిత్ర మనస్కుడయిన ఆ భూజాని మరింత ధర్మనిష్ఠుడయ్యెను. రాజ్యప్రజలందలి చాతుర్వర్ణములవారూ యజ్ఞ, దాన, తప, నియమపరులయిరి. ఈ ధార్మిక ప్రవర్తన, కార్యములను కాంచి, కలి వారసులైన లోభము, మిధ్య మొదలగునవి అత్యంత దు:ఖార్తులై ఆ రాజ్యమును విడిచి వెళ్ళినవి.

అంత విశాఖయూపుడు ధనుర్ధారియై, చేత కరవాలము ధరించి, కవచధారియై, విజయము నొసంగు అశ్వము నధిరోహించి, తన నగరమును వీడి, కల్కి ధర్శనార్ధమై శంభల నగరము ప్రవేశించెను. ఆ సమయమున కల్కి కవి, ప్రాజ్ఞ, సుమంత్రులను సోదరులు, గార్గ్య, భర్గ్య, విశాలాది బంధువర్గము, అనేకమంది ఋషులచే పరివేష్ఠింపబడి, తారలచే చుట్టుముట్టబడిన తారాపతి వలె, దేవతానీక సహితుడై ఉచ్ఛైశ్రవము నధిరోహించిన దేవరాజు ఇంద్రుని వలె భాసించుచుండెను. అటువంటి కల్కిని దర్శింపగనే విశాఖయూపుడు హర్ష, పులకిత శరీరుడై, క్షణములో విష్ణుపూజా తత్పరుడయ్యెను. ఒకనాడు కల్కి విశ్రామ సమయమున విశాఖయూపునకు చాతుర్వర్ణాశ్రమ ధర్మములు ఈ విధముగ సంక్షేపముగ తెలిపెను "రాజా! నీ అంశరూపులయిన ధర్మాత్ములు కలి పాపముచే భ్రష్ఠులయి, ఇపుడు నేను జన్మించుటచే ధర్మమార్గమునకు ఏతెంచెదరు. నీవు రాజసూయ, అశ్వమేధ యాగములు ఆచరించుటకు సమకట్టి, నా ఉపాసన కావింపుము. రాజా! సర్వలోకములు, సనాతన ధర్మము, కాలము, స్వభావము, కర్మ, సంస్కారములు, అన్నియు నా అనచరవర్గమే!!!

నేను కలిని నిర్జించి, సూర్య, చంద్ర వంశములందు ఉత్పన్నమయిన "మరువు" మరియు "దేవాపి" అనువారలను మహీపతులు కావించి, తిరిగి కృతయుగమును సంస్థాపనమొనర్చి, పున: వైకుంఠమున కేగుదును." అంత రాజు కల్కికి, అచట గల ఋషులకు తదితరులకు నమస్కరించి, కల్కి భగవానుని వైష్ణవ ధర్మముల గూర్చి తెలుపమని అర్థించెను. అంత కలి కులనాశనమునకై అవతరించిన కల్కి భగవానుడు తనవారందరినీ ఆనందపరచుచూ మృదుమధురముగ పలుకుట ప్రారంభించెను.

(శ్రీకల్కి పురాణమందు ప్రథమాంశ యందలి కల్కి వరలాభము అను మూడవ అధ్యాయము సమాప్తము)

నాల్గవ అధ్యాయము

(హర వరప్రదానము)

కల్కి "కాలచక్రమందు అనంతకోటి మహాయుగములు గడచుచునేయున్నవి. సమయానుసారము ప్రళయము సంభవించినపుడు ఈ చరాచర జగత్తు అంతయు నశించి చతుర్ముఖ బ్రహ్మదేవుడు సహితము లయమగును. అపుడు సర్వము నాలో విలీనమగును. నేను ఆదికి సహితము ఆద్యుడను. నేనువినా వేరొకటి లేదు. నేను సర్వము నాలో విలీనమయిన పిదప నిద్రించి, ఆ నిద్రనుండి మెలకువ వచ్చిన మీదట తిరిగి రమించుటకు ఉత్సుకుడనగుదును. ఆ సమయమున నా నుండి విరాట్పురుషుడు ఉత్పన్నమగును. ఆ విరాట్పురుషుడు లెక్కలేనన్ని శిరములు, బాహూదర వక్త్రనేత్రములు కలవాడు. ఆ విరాట్పురుషుని శరీరము నుండి వేదకర్త అయిన చతుర్ముఖ బ్రహ్మ ఉత్పన్నమగును. వేదము నా వాణి. నా ఆజ్ఞచే విరించి నా అంశలయిన జీవాత్మ మరియు మాయను ఉపయోగించి, నా అంశలే అయిన కాలము, ప్రకృతుల సంయోగముచే సృష్టిరచన ఆరంభించును. తొలుత ప్రజాపతులు, తదుపరి దేవతలు, మునులు, మానవులు ఉత్పన్నమయిరి. మాయ సత్వ, రజస్, తమోగుణములను త్రిగుణాత్మకము. ఈ మాయయే అనేక రూపములయిన ఉపాధులను (జీవ, వృక్ష, జంతుజాలము), సర్వలోకములను, నామరూపాత్మక చరాచర జగత్తును ఉత్పన్నమొనర్చుచున్నది. నా అంశ అయిన మాయచే నిర్మితమయిన ఈ చరాచర జగత్తు అంతయు ప్రళయకాలమున తిరిగి నాయందే విలీనమగుచున్నది. అందువలన రాజా! కనిపించుచున్న, కనిపించకున్న ఈ చరాచర జగత్తు అంతయు నా శరీరమే! నా స్వరూపమే! ఈ జగత్తునందు యజ్ఞము, అధ్యయనము, సత్కర్మలు, ఇవన్నియు నన్నే తెలుపుచున్నవి. వేదము, దేవతలు, మానవులు, వేరువేరు నామరూపములు కలిగినప్పటికీ వీరందరూ నా స్వరూపమే! వేదము త్రిలోకములను, అందలి ప్రాణులను రక్షించును. ఈ వేదము బ్రాహ్మణుల ద్వారా ప్రకాశితము, ప్రసారితము కావింపబడును. (ఎవరు ఈ వేదమును నమ్మి, తద్విధానముగ జీవించుచూ వేదప్రచారము గావించెదరో వారే బ్రాహ్మణులు అని పిలువతగుదురు). అందువలన నేను శుద్ధ సత్వగుణమును ఆశ్రయించి వారికి నమస్కరించుచున్నాను. వారు నన్ను సర్వులకు ఆశ్రయభూతునిగ తెలిసి సర్వదా నన్నే కొలుచుచున్నారు."

అంత విశాఖయూపుడు ఇట్లు ప్రశ్నించెను "స్వామీ! "బ్రాహ్మణో ముఖమాసీత్" అనునది వేద వాక్యము కదా! అనగా బ్రాహ్మణులు మీ ముఖము నుండి ఉద్భవించితిరి అని తెలిపితిరి కదా! ఈ బ్రాహ్మణుల లక్షణములేమి? మిమ్ములను పూజించుచున్న వీరి "భక్తి" అనగా ఏమి?" కల్కి "వేదము నన్ను ఈశ్వరుడు, అవ్యక్తుడు, ప్రత్యక్షజ్ఞానయుక్తుడు, శ్రేష్ఠుడు,

అని పేర్కొనినది. వేదమునందు విభిన్న ధర్మములు తెలుపబడినవి. అవన్నియు బ్రాహ్మణుల ద్వారా ప్రచారము కావింపబడును. అనేక ఫలములను ప్రాప్తించునది అయిన నాయందలి నిష్ఠయే "భక్తి" అనబడును. అ భక్తిచే ప్రసన్నుడనైన నేను భిన్న యుగములందు విభిన్న అవతారములు దాల్చుచున్నాను. సౌభాగ్యవతి అయిన బ్రాహ్మణ స్త్రీచే పేనబడిన సూత్రమును మూడు పేటలుగ చేసి, అద్దానియందు మూడు ముడులు వేసిన ఎడల అద్దానిని యజ్ఞోపవీత మందురు. ఈ సూత్రమును వేదవేదాంగ పారంగతులు ఎడమ భుజము నుండి కంఠము నందు ధరింపవలెను. యజుర్వేదీయులు ఈ యజ్ఞోపవీతపు నిడివిని కంఠము నుండి నాభి మధ్య భాగము వరకు యుంచవలెను. సామవేదీయులు ఈ యజ్ఞోపవీతమును నాభి వరకు ధరింపవలెను. ఈ యజ్ఞోపవీతము బల, తేజోదాయకము. అంతేకాదు. బ్రాహ్మణుడు మృత్తిక, భస్మము, చందనము మొదలగు వానితో తిలకధారణ యొనర్పవలెను. నుదిటియందు త్రివళీయుక్తముగ (మూడు రేఖలుగ) తిలకధారణ చేయుట యజ్ఞము నందలి భాగము. ఈ త్రివళీయుక్తమయిన నుదిటిరేఖలు శివ లేక విష్ణు నివాసస్థానమును తెలియజేయుటచే అవి పాపమును నాశమొనర్చును.

అందువలన బ్రాహ్మణుని చేతియందు స్వర్గము, వాణి యందు వేదము, శరీరమందు తీర్ధములు, మరియు ధర్మము నందు అనురక్తి, నాడుల యందు త్రిగుణాత్మక ప్రకృతి యుండును. (బ్రాహ్మణులు కావించు యజ్ఞము యజ్ఞకర్తకు స్వర్గమును ప్రాప్తింపజేయును. అందువలన బ్రాహ్మణుని చేతియందు స్వర్గము కలదు). బ్రాహ్మణుని కంఠమందు సావిత్రి (వేదమాత), హృదయమందు బ్రహ్మ, వక్షస్థలమందు ధర్మము, పృష్ఠ భాగమందు అధర్మము యుండును. రాజా! బ్రాహ్మణుడు పృథివి యందలి దేవత, భూసురుడు పూజనీయుడు, స్థుతుల ద్వారా వందనీయుడు, చాతుర్వర్ణ వ్యవస్థ నిరాటంకముగ ఆచరింపబడుటకు మార్గము చూపు ధర్మ ప్రవర్తకుడు. జ్ఞానవృద్ధులు, తపోవృద్ధులయినవారు బాలురయిననూ నాకు అత్యంత ప్రియులు. వారి వచనములను రక్షించుటకు నేను అవతారము స్వీకరించెదను." సర్వపాప వినాశకరము, కలి కల్మషములను దూరమొనర్చు బ్రాహ్మణ మహాభాగ్య వర్ణనము వినుటచే సర్వుల భయము దూరమయినది. కల్కి పలుకులకు సంతసించి, ఆయనకు ప్రణామములర్పించి వైష్ణవాగ్రణి అయిన విశాఖయూపుడు తన పురమునకు చనెను.

రాజు వెడలిన పిదప సంధ్యా సమయమున కల్కి విశ్రాంతి తీసికొనుచుండగా శివ ప్రసాదితమయిన శుకము కల్కి వద్దకు ఏతెంచి, ఆయనను స్థుతించి, ఎదురుగ కూర్చొనెను. అంత కల్కి ఇంచుక మందహాసము విరజిమ్ముచూ "శుకరాజమా! నీకు స్వాగతము. నీవీమధ్య కావించిన యాత్రలేమి? ఏఏ దేశముల కేగితివి? ఆయా ప్రాంతముల విశేషములు ఏమి?" అని ప్రశ్నించెను. అంత చిలుక "స్వామీ! విషయ విశేషములు అనేకములుయున్నవి. కానీ అత్యంత విశేషము, విస్మితము, మీకు హృదయోల్లాసము కావించు సంఘటన గూర్చి ప్రస్తావించెదను. సముద్ర మధ్యమున "సింహళము" అను అతిసుందర ద్వీపమున్నది. దానిని "బృహద్రధుడు" అను రాజు పరిపాలించుచుండెను. ఆ రాజతనయ యొక్క చరితము ప్రసిద్ధము, అద్భుతము, కర్ణపేయము, అమృతతుల్యము. అద్దానిని నీకు వినిపించెదను. సావధానుడవై వినవలసినది.

సింహళ ద్వీపమున కౌముదీ గర్భసంజాత అయిన ఈ దివ్యకన్యకా చరితము పాపములను ప్రక్షాళించును. సింహళ ద్వీపము నందు స్వచ్ఛ జలములతో కూడిన అనేక సరోవరములు కలవు. ఆ సుందర సరస్సులను చుట్టి అనేక వనములు, ఉపవనములు, కలవు. ఆ వనములు పెద్ద పెద్ద మానులుగల మఱ్ఱి, రావి, వేప, అశోక, టేకు, సాల, వృక్షములచే నిండియున్నవి. అంతేకాక అనేక అరటి, బొబ్బాసి, ఆమ్ల, ఖర్జూర, పనస, మామిడి, సీతాఫలము వంటి ఫల వృక్షములు సహితము కోకొల్లలుగ యున్నవి. వీటిని అల్లుకొని మల్లె, జాజి వంటి లతలు, పొగడ, బంతి, మందార, కుంద, కనకాంబరం, నాగచంపా, చంద్రమల్లిక వంటి సుగంధభరిత గంధము గుబాళించు పుష్పవాటికలు కలవు. ఈ సరస్సులందు హంస, కారండవ, బక, శుకములు నిరంతరము కిలకిల ధ్వనులు చేయుచుండును. ఈ పుష్పవాటికలందు

నెమళ్ళు పురివిప్పి ఆడుచుండును. ఆ ద్వీపమందు కారుమతీ నగరము కలదు. ఆ నగరము గీతగీసి కట్టబడినట్లుండు భవనపంక్తులు, విశాలమయిన రహదారులు, రత్న స్ఫటిక ఖచిత సువర్ణ ప్రాకారములు కలిగిన దివ్య సౌధములు, అంబరమునంటు హర్మ్యములు, నిత్య నిరంతర దివ్యభూషణ భూషిత కోమలాంగులు, శ్రేష్ఠ వస్త్రధారణ కావించిన పురుషసింహములచే నిండియుండెను. ఈవిధముగ సుభిక్షము, సురక్షితమయిన సామ్రాజ్యమును మహాబలి, అమిత పరాక్రముడు అయిన బృహద్రధుడు పరిపాలించుచుండెను. ఆయనకు యశశ్వినీ, ధన్య అయిన "పద్మ" అను పుత్రిక కలదు. పద్మ ఈ జగత్తునందు దుర్లభమయిన అద్వితీయ సౌందర్యరాశి. కామదేవుని మనస్సును సహితము మోహింపజేయగల అపరంజిబొమ్మ. సచ్చరిత్ర. పార్వతీదేవి తన చెలుల సహితయై ఎట్లు పరమేశ్వరుని ప్రార్థించినదో, అట్లే పద్మ అత్యంత భక్తితత్పరయై ముక్కంటి యందలి భక్తిచే ఆ మహాదేవుని జప ధ్యానములందు లీనమయినది.

విష్ణుపత్ని, సాక్షాత్ లక్ష్మీదేవి భువి యందు సాక్షాత్ పద్మగా అవతరించెనని తెలిసిన పినాకపాణి పార్వతీ సహితుడై ఆమె ఎదుట ప్రత్యక్షమయ్యెను. పేదల పాలిటి పెన్నిధి వలె తన ఎదుట సాక్షాత్కరించిన ఆది దంపతి పార్వతీ పరమేశ్వరులను గాంచి పద్మ సిగ్గుతో తలవంచుకొనెను. అంత శివుడు "ఓ! సౌభాగ్యశాలినీ! నీకు విష్ణువు పతి కాగలడు. ఆయన అత్యంత ప్రసన్నుడై నిన్ను వరించును. ఈ పృధివి యందు వేరెవరూ నీకు తగిన వరులు కారు. ఈ జగత్తునందు దేవాసుర, నాగ, మానవ, గంధర్వ, చారణాది ఏ పురుషులైననూ నిన్ను కామభావనతో వీక్షించిన ఎడల, వారందరూ తక్షణము స్త్రీలుగా మారెదరు. కానీ ఈ శాపము నిన్ను వరించు విష్ణుభగవానునికి వర్తించదు. ఇక నీవు తపస్సు చాలించి గృహమున కేగవలసినది. ఓ! కమలా! విష్ణుపత్నీ! నీవు ఇక కలతచెందక నిర్మలమనస్కవై యుండవలసినది" అని పలికి శివుడు శివాని సహితుడై అంతర్ధానుడయ్యెను. పద్మ సహితము ఆనందముతో హృదయాంతరంగము ఉప్పొంగ, ప్రసన్నమనస్కయై పార్వతీ పరమేశ్వరులకు నమస్కృతులిడి తన నగరమున కేగెను.

(శ్రీకల్కి పురాణమందు ప్రధమాంశమందలి హర వరప్రదానము అను నాల్గవ అధ్యాయము సమాప్తము)

ఐదవ అధ్యాయము

(పద్మా స్వయంవరము)

ఈ సంఘటన జరిగిన పిదప నెమ్మదిగ కాలము గడచి పద్మ బాల్యావస్థ దాటి యవ్వనావస్థ చేరుకొనెను. తన ప్రియపుత్రికను గాంచి బృహద్రధుడు పాపశంకచే చింతితుడయ్యెను. ఎందుకనగా యోగ్యమయిన వరుడు దొరికి వివాహమగుటకు ముందే పుత్రిక రజస్వల అయినఎడల ఆ కాలమందు అయ్యది పాపముగ పరిగణింపబడెడిది. బృహద్రధుడు తన ధర్మపత్ని అయిన కౌముదితో "ఓ! శుభగా! పద్మకు తగిన ఉత్తమకులజుడు, సచ్చారిత్రుడు అయిన రాకుమారుని గూర్చి మనము వెదుకవలెను" అని పలికెను. అంత రాణి కౌముది తన భర్తకు శివ వరప్రసాదము, విష్ణువు పద్మకు భర్తయగునని తెలిపిన విధము జ్ఞప్తికి తెచ్చెను. అంత రాజు "సర్వజీవ అంతర్యామి అయిన విష్ణువు ఎట్లు ఈ చిగురుబోడిని వివాహమాడును? సాక్షాత్ విష్ణుభగవానుని అల్లునిగ పొందు భాగ్యము నాకు కలదా? మునికన్య అయిన వేదవతి, క్షీరసాగర మధనమున సముద్రమధ్యము నుండి ఆవిర్భవించిన లక్ష్మీదేవి వంటి మన సుపుత్రి పద్మ విష్ణుభగవానుని ఎట్లు చేపట్టకలదు?" ఈ విధముగ తర్కించి, చివరకు స్వయంవరమే ఈ సమస్యకు పరిష్కారమని నిశ్చయించెను. ఇంతలో రాణి కౌముది తిరిగి శివ వరమును గుర్తుచేసెను. రాజు "ప్రియా! కానీ నేను నా రిక్త హస్తములతో

కర్తవ్య విమూఢుని కాలేను కదా! ఈ తన్వంగి జన్మమందు విష్ణువును పతిగా పొందు భాగ్యమున్న ఎడల స్వయముగ విష్ణువే ఈ స్వయంవరమునందు పాల్గొని ఈ శుభాంగిని స్వీకరింప వచ్చును."

ఈ విధముగ పలికి బృహద్రధుడు గుణ, రూప, సదాచార, ఆయు: విద్యా, ధన సంపన్నులగు రాజులందరికీ స్వయంవర ఆహ్వానమును పంపించెను. పద్మ యొక్క గుణ, రూప, శీలములు తెలిసినవారై, అత్యంత ఆనందయుక్తులై తమ సేనా, ధన, రత్న, చతురంగబల సమేతులై, అశ్వ, రధారూఢులై శ్వేత ఛత్రముల నీడన వింజామరలు వీచబడుచుండగా, అస్త్రశస్త్రముల చమక్కులు దివి పర్యంతము వెలుగుచుండగా ఇంద్రసహిత దేవతానీకము వలె లోకమందలి రాజకుమారులందరూ ఏతెంచిరి. కల్కి మహాప్రభో! వారిలో కొందరి నామములు మీకు తెల్పెదను – రుచిరాశ్వ, సుకర్మ, మదిరాక్ష, దృఢాశుగ్, కృష్ణసార, పారద, జీమూత, క్రూరమర్దన, కాశ, కుశాంబు, వసుమాన, కంక, క్రధన, సంజయ, గురుమిత్ర, ప్రమాధీ, విజృంభ, సృంజయ, అక్షమాదులందరూ మహాబలురు, మరియు వీరులు. ఆ రాజపుత్రులందరూ రంగురంగుల మాలాలంకృతులై నృత్య, గీత, వాద్యాదుల మధ్య స్వయంవర సభాప్రాంగణము ప్రవేశించి తమకు ఒసంగబడిన ఆసనములను అలంకరించిరి. అనేక భోగ సమాన్వితులు, కామదేవుని వంటి సుందరులు, పద్మసుందరీ ముఖ దర్శనమునకై ఆశగా ఎదురుచూచుచున్న కనులుగల ఆ రాజసుతులందరినీ కాంచి బృహద్రధుడు అత్యద్భుత రూపసంపన్న, గౌరవర్ణ, చంద్రముఖి, దివ్యగుణసంపన్న, సుందర ముత్యాల హారములు, మణిరత్నఖచిత సువర్ణభూషిత, కళ్యాణకారి అయిన తన సుపుత్రి పద్మను ఆ సభామండపమందు ప్రవేశపెట్టెను.

శుకము కల్కితో పద్మ యొక్క సౌందర్యము వర్ణించుచూ "ప్రభూ! ఈ పద్మ సౌందర్యమును ఏవిధముగ వర్ణించను? ఈమె మహా మోహకారిణి అయిన మాయ, కాముని పత్ని అయిన రతిని సహితము తలదన్ను సౌందర్యరాశి. నేను స్వర్గ, మర్త్య, పాతాళములను త్రిలోకముల యందునూ యధేచ్ఛగా సంచరింపగలను. నేను ఎక్కడా ఇటువంటి సర్వాంగసుందరినీ, మనోహరమూర్తిని, చిత్తహారిణిని చూచియుండలేదు. హస్తముల యందు దండధారులైన వేత్రహస్తులు నలుప్రక్కలా నడచుచుండగా, సురక్షితయై చెలుల సహితయై పద్మ సభామండపమున ప్రవేశించెను. ఆ తేజస్విని, కలకంఠి, ఎర్రని పట్టుచీర కట్టి త్రిలోకసుందరి వలె భాసిల్లుచుండెను. ఆ మదమత్త గజరాజగమన, త్రిభువన సుందరి, కుసుమకోమలి, తన క్రీగంటి చూపులతో అశేష ఐశ్వర్యములు ప్రసాదింపగల తన్వంగి, ముగ్ధమనోహరాంగి అయిన పద్మను కాంచి కామముచే కర్తవ్య విమూఢులై, రధాశ్వ గజారూఢులై ఏతెంచిన రాజనీకమంతయు వస్త్ర శస్త్రాస్త్రముల నన్నింటినీ మరచి, విడచి, నేలపై పడిరి. పద్మముఖీ దర్శనానంతరము కామపీడితులైన ఆ రాజపుత్రులందరూ శివ శాపమున (వరమున) సుందరమయిన స్త్రీలవలె మారి తన పుంస్త్వమును మరచి స్త్రీ సహజ హావభావములొనర్చుచూ పద్మాదేవి చెలికత్తెలై ఆమె వెంట నడచిరి.

పద్మా స్వయంవర వివాహ మహోత్సవమును వీక్షించుటకు అత్యంత ఉత్సుకతతో యున్న నేను ఈ హటాత్పరిణామమునకు ఆశ్చర్యము నొంది తదుపరి జరిగిన విషయములను అవలోకించుటకు రాజభవనము చెంతనున్న ఒక వృక్షపు కొమ్మపై వ్రాలి నిరీక్షించుచుంటిని. స్వయంవర శుభఘడియ దాటుటచే పద్మ అత్యంత దు:ఖవిచలిత మనస్కయై, పరమేశ్వరుని హృదయమందు శరణునొందుచూ విలపింపసాగెను. స్త్రీ స్వరూపములు పొందిన రాజులు సహితము పద్మను దగ్గరగా చూచుచూ, ఆమె శోకగ్రస్తయై యుండుటచే, తాము సహితము తమ ఆభరణములు విసిరిగొట్టి, విష్ణు నామస్మరణము ఒనర్ప మొదలిడిరి.

(శ్రీకల్కి పురాణమందు ప్రధమాంశ యందలి పద్మా స్వయంవరమను ఐదవ అధ్యాయము సమాప్తము)

ఆరవ అధ్యాయము

(శుక పద్మ సంవాదము)

జరిగిన విషయములచే దిగ్భ్రాంతి చెంది, విష్ణువునే మదిలో పతిగా స్మరించుచూ చెలికత్తెలు చుట్టూ కూర్చొనియుండగా తన నెచ్చెలి అయిన విమలతో పద్మ ఇట్లనియె "ఓ! విమలా! విరించి నా నుదుట ఏ రాత వ్రాసెనోకదా! నా దర్శన మాత్రమున పురుషులు స్త్రీలగుచున్నారు. పాపకర్మిణి, మందభాగ్యనైన నేను కావించిన శివపూజ బంజరభూమి యందు నాటబడిన బీజము వలె వృధా అయినది. లక్ష్మీపతి అయిన విష్ణుభగవానుడు ఈ జగత్తునంతటికీ ప్రభువు. ఆ జగత్పతి నన్ను ఏల వరించును? ఒకవేళ శివ వచనము అసత్యమై విష్ణువు నన్ను గ్రహింపని ఎడల నేను విష్ణుచింతన కావించుచూ అగ్నిప్రవేశ మొనర్చెదను. ఆసహాయ మానుషస్త్రీనైన నేనెక్కడ? విష్ణు భగవానుడెక్కడ? నేను శివునిచే వంచితురాలినై, బ్రహ్మచే దండింపబడితిని. విష్ణువుచే త్యజింపబడిన దుర్భాగ్యురాలినైన నేను తప్ప వేరొకరు జీవింపనోపరు." ఈ విధముగ అత్యంత దు:ఖితురాలై రోదించుచున్న పద్మ పలుకులు విని తిరిగి నేను మీ వద్దకు ఏతెంచితినని శుకము కల్కికి తెలిపినది.

అంత కల్కి ఆశ్చర్యాన్వితుడై "ఓ! శుకమా! నీవు నా ప్రియబాంధవుడవు. పద్మ నాకు అత్యంత ప్రియమైనది. నా పూర్వపుణ్యముచే నా భాగ్యదేవతయై నా కొరకై ఉత్పన్న మొనర్పబడినది. ఆమెయే నా పత్ని. నేనే ఆమె పతిని. నీవు మధ్యవర్తివై మా ఇరువురికీ సయోధ్య కల్పింపవలసినది. శుకమా! నీవు సర్వజ్ఞుడవు. కార్యసాధన యందు సమర్థుడవు. కార్యాచరణమందు విధివిధానముల జ్ఞాతవు, అమృత వచనుడవు, మరియు దేశకాలములు ఎరిగిన ప్రాజ్ఞుడవు. నీవు వెంటనే ప్రయాణమొనరించి సింహళ ద్వీపమునకేగి నా మనోరథ అయిన పద్మకు నా గూర్చి తెలిపి, నా గుణ, రూప పరాక్రమములు ప్రశంశించి, నా యందు ప్రేమ ఉత్పన్నమగునట్లు చేసి తిరిగివచ్చి, నాకు ఆ శుభవిశేషములు తెలిపి నన్ను స్వస్థుని కావింపుము" అని వేడుకొనెను. కల్కి పలుకులు వినిన శుకము అత్యంత ముదము నొంది, కల్కికి వందనము ఒనర్చి, ప్రసన్నమనస్కుయై అత్యంత వేగమున సింహళ ద్వీపము చేరి, పక్వమునకు వచ్చిన నేరేడుపండ్లు తిని, అమృతమయములైన శుద్ధ జలములు త్రాగి రాజభవనము ప్రవేశించెను. అచటగల ఒక నాగకేసర వృక్షముపై సుఖాశీనయై పద్మతో మానవభాషలో ఇట్లు సంభాషించెను.

"ఓ! చంచలనేత్రీ! గుణ, రూప, యవ్వన సంపన్నా! సుందర నితంబినీ! నీవు లక్ష్మీసదృశరూపవు. ఓ! లలనా! నీవు పద్మముఖివై, కమలదళ నేత్రివై, కరకమలములతో కూడి పద్మ సుగంధమును వెదజల్లుచున్న నీవు రెండవ లక్ష్మీ రూపమున వెలుగొందుచున్నావు." చిలుక యొక్క అత్యంత ఆశ్చర్యజనితమైన పలుకులు విని కమలమాలాధారిణి అయిన ఆ దేవి హృదయమందు ఆనందభరితయై, సుచిస్మితయై, ఆ చిలుకతో ఇట్లనియె "ఓ! శుకమా! నీవెవరవు? ఎచటినుండి ఏతెంచితివి? శుకరూపము ధరించిన నీవు దేవ దానవులందు ఎవరవు? దయాతత్పరనైన నా వద్దకు ఏల ఏతెంచితివి?" శుకము "ఓ! శుభాంగీ! నేను సర్వజ్ఞ నామధేయుడను. సర్వ శాస్త్రార్థములను సమగ్రముగ ఎరిగినవాడను. నేను స్వేచ్ఛానుసారము ఎక్కడికయిననూ వెళ్ళగల సమర్థుడను. అనేక దేవ, గంధర్వ, రాజసభలయందు పూజలందుకున్నవాడను. నేను ఆకాశగమనము చేయుచూ, హృదయమందలి దు:ఖ భారముచే భోగములను త్యజించిన మనస్విని అయిన నిన్ను చూచి, పలుకరించుటకు ఇచట కేతెంచితిని. సుందరవదనారవింద అయిన నీవు చిరునగవు వీడి, సుఖీజనులతో వార్తాలాపములు మాని, ఆభూషణములను విడచి, హృదయమందు దు:ఖ భారముచే సతమతమగుచున్నావు. నీ దు:ఖమునకు కారణమును కలకంఠివైన నీ నుండి వినుటకు ఇచ్ఛగించుచున్నాను. ఓ! ఇగురుబోడీ! శిరీషపుష్ప సుకుమారత్వము,

చంద్రుని ప్రభ నీ ముందు దిగదుడుపే! విద్వాంసులు తెలుపు అమృతత్వము, బ్రహ్మప్రాప్తి సహితము నీ ముందు ఎందుకూ కొరగావు. నీ కరాంబుజముల గాఢ పరిష్వంగముచే బంధింపబడి, నీ సుందర దరహాస అధరామృతము గ్రోలు అదృష్టవంతునకు తపో, దాన, జపములన్నియు వృధా! సుందరమయిన తిలకము, మెలితిరిగిన ముంగురులు, కంపించుచున్న కుండలములు, చంచలమయిన నేత్రములు కలిగిన నీ రమణీయ ముఖారవిందము వీక్షించు మనుజునకు పునర్జన్మ యుండదు. ఓ! బృహద్రథపుత్రీ! నీవు ధూళిసరిత హిరణ్యప్రతిమ వలె తోపుచున్నావు. రోగము లేకున్ననూ మానసిక దు:ఖముచే తపించుచున్న క్షీణశరీరము గల ఓ! సుందరీ! నీ మానసిక వ్యధకు కారణము నాకు తెలుపవలసినది" అని పలికెను.

పద్మ "ఓ! శుకమా! ఉత్తమ కులమందు జన్మించుట, ధన, సౌందర్యములు కలిగియుండుట వలన ఏమి లాభము? భాగ్యానుకూలత లేని వారికి (అభాగ్యులకు) అవన్నియు వ్యర్థమే! నా చరితము లోకప్రసిద్ధము. నీకు తెలియని ఎడల నీకు తెల్పెదను. వినుము. నేను చిన్ననాటి నుండి యవ్వనావస్థ వరకు విశేష శివపూజ కావించితిని. అంత పేదల పాలిటి పెన్నిధి వలె భవానీ సహిత భవుడు నా ఎదుట ప్రత్యక్షమై నన్ను వరము కోరుకొనమనెను. లజ్జా భారముచే అధోముఖినైన నన్ను కాంచి కపర్ది "నారాయణ భగవానుడు నీకు పతి అగును. దేవ, దానవ, గంధర్వ, మానవ ఏ జాతులందైననూ విష్ణువు తక్క ఏ పురుషుడు కామవాంఛతో నిన్ను వీక్షించిననూ ఆతడు స్త్రీ అగును. ఈ విధముగ పలికి నాకు సరిఅయిన విష్ణుపూజా విధానమును తెలిపెను. ధర్మజ్ఞుడయిన నా తండ్రి యవ్వనావస్థ చేరిన నన్ను చూచి, నాకు స్వయంవరము ప్రకటించెను. అద్దానికై అరుదెంచిన రాజులందరూ రూపయవ్వన సంపన్నులు, దృఢ సంకల్పులు, వివిధ భూషణ భూషితులు. వారందరూ నన్నుచూచి కామావేశము నొంది క్రిందపడిరి. శివ వర ప్రభావముచే వారందరూ పరమ సుందర స్త్రీ రూపమునొంది, మనసునందు లజ్జా, భయములంకురించి, ఏమి చేయుటకూ పాలుబోక, చేయునది సహితము లేక వారందరూ నా చెలులైరి."

(శ్రీకల్కి పురాణమందు ప్రథమాంశ యందలి శుక పద్మా సంవాదమను ఆరవ అధ్యాయము సమాప్తము)

ఏడవ అధ్యాయము

(హరిభక్తి వివరణము)

శుకము "ఓ! కళ్యాణీ! నీవు ధన్యవు. ఎందుకనగా నీకు సాక్షాత్ శంకర శిష్యత్వము లభించినది. అంబికానాథుడు నీకు లక్ష్మీపతి పూజావిధానమును తెల్పెనని వచించితివి కదా! పరమానంద కారకము, భుక్తి ముక్తి దాయకము, వీనులవిందయిన, పరమేశ్వరుడు నీకు తెలిపిన విష్ణుపూజా విధిని నాకు తెలుపవలసినది" అని పలికెను. పద్మ హృదయానందోల్లాసియై "ప్రాణమిత్రమా! శంకరుడు ఉపదేశించిన విష్ణుపూజా విధిని నీకు తప్పక తెల్పెదను. అత్యంత పుణ్యప్రదమయిన ఈ పూజావిధి శ్రద్ధగా పాటించిన, వినిన, చెప్పిన ఎడల గురు, గో, బ్రాహ్మణ హత్యా పాతకములు సహితము నశించును. అందువలన సావధానుడవై వినుము. ప్రాత:కాలముననే లేచి, కాలకృత్యములు తీర్చుకొని, స్నానాదికములొనర్చి, ఆచమనము కావించి తూర్పు దిక్కునకు తిరిగి సుఖాశీనుడు కావలెను. మనస్సును నియంత్రించి, ఏకాగ్రము ఒనర్చి, అంగన్యాస, కరన్యాసములు కావించి భూతశుద్ధి యొనర్పవలెను. మనస్సునందు విష్ణుభగవానుని ధ్యానించి, ఆయన రూపమును తన హృదయ సింహాసనమందు స్థాపింపవలెను. విభిన్న దేవతలను భిన్న భిన్న మంత్రములతో తన శరీరమందలి వివిధ అవయవములందు న్యాసము ఒనర్పవలెను. తదుపరి అర్ఘ్య, పాద్య, ఆచమన, స్నాన, వస్త్ర

మొదలగు షోడశోపచారములు సమర్పించి, పాదములు మొదలుకొని శిరము వరకు సర్వావయవసహితుడు, శుచిస్మితముఖుడు, దివ్యరూపుడు, భక్తాభీష్ఠ ఫలప్రదాయకుడు అయిన విష్ణుభగవానుని **"ఓం నమో నారాయణాయ స్వాహా"** అను మంత్రముతో హృదయ కమలమందు స్థాపించి ధ్యానము ఒనర్పవలెను.

యోగి హృధ్యానగమ్యుడు, శుభలక్షణ లక్షితుడు ఝంకారమొనర్చుచున్న భక్త భ్రమరములతో కూడిన తులసీమాల ధరించినవాడు, గులాబీలవంటి గోళ్ళు కలిగిన కరకమలములు కలవాడు, అయిన విష్ణుదేవుని చరణకమలములను నేను ఆశ్రయించుచున్నాను. మణుల సమూహములతో గ్రుచ్చబడి, రాజహంసల వంటి ధ్వనిచేయు నూపురములు ధరించినవాడు, తామరతూండ్ల వంటి పాదములు కలవాడు, పీతాంబరధారి, శత్రుభయంకరమయిన ధ్వజము కలవాడు, త్రివళీయుతమయిన అంగదములు ధరించినవాడు అయిన హరిని నేను స్మరించుచున్నాను. తన వాహనమయిన గరుడుని మెడచుట్టూ నీలమణి ప్రకాశించుచున్నది. అద్దానిమధ్య అరుణవర్ణ వజ్రము వలె గరుడుని కొనదేలిన ముక్కు తేజరిల్లుచున్నది. అటువంటి గరుడునిపై ఆశీనుడయియున్న నారాయణప్రభువు తొడలు, పిక్కలు విద్యుత్కాంతి కలిగిన పీతాంబరముచే కప్పబడి నేత్రానందకరమయినవి. విష్ణువును వహించుచూ ఎగురుచున్న గరుడుని పక్షముల నుండి సామగానము వెలువడి ఆయన యశస్సును కీర్తించుచున్నది. అటువంటి పద్మనాభుని మోకాళ్ళను స్మరించుచున్నాను.

శమన (యమ), ధాత (బ్రహ్మ), మకరధ్వజ (మన్మధుడు) లకు ఆధారభూతము, సర్వప్రాణులకు బీజరూపము, ప్రకృతి రూపమయిన పీతాంబరము చుట్టబడిన శ్రీనాధుని నడుమును నేను ధ్యానించుచున్నాను. ఎవని ఉదరము త్రివళీయుతమయి శోభిల్లుచున్నదో, ఎవని నాభిప్రదేశము చతుర్ముఖ బ్రహ్మ యొక్క జన్మస్థానమో, ఎవరి ఉదరకోశమందు నాడీ రూపమునున్న నదులన్నియు సముద్రములుగ కెరటములతో ఎగిరి పడుచున్నవో, ఎవరి ఉదరము ఈ సమస్త బ్రహ్మాండముల కాధారభూతమో అటువంటి విష్ణుభగవానుని నేను నిరంతరము స్మరించుచున్నాను. ఎవని హృదయదేశము క్షీరసాగర కన్యక, సాగరతనయ అయిన లక్ష్మీదేవి యొక్క కుచ కుంకుమచే విరాజిల్లుచున్నదో, ఎవని వక్షస్థలము కౌస్తుభమణి మరియు అనేక దివ్యహారములతో, శ్రీవత్స చిహ్నముతో శోభిల్లుచున్నదో, ఎవని హృదయమందు హరిచందన పుష్పమాల వ్రేలాడుచున్నదో అట్టి నారాయణుని పరమ మనోహర వక్షస్థలికి నేను వందనములిడుచున్నాను. సుందర వలయాంగదాది భూషణములతో అలంకరింపబడినవి; దైత్య, పాప, వినాశన మొనర్చునవి; కౌమోదకి అను దివ్యమయిన గద, సుదర్శనమను మహాద్భుత చక్రమును ధరించునవి, అత్యంత సుందరములు, సుదృఢములు అయిన గుండ్రని ఆ మహాత్ముని భుజములను నేను ధ్యానించుచున్నాను. ఏనుగు తొండములవలె బలముగ ఆజానుబాహువులై నీలివర్ణ ఛాయతో మెరయుచూ, ఎర్రని గోళ్ళతో శంఖ, పద్మములను కరకమలములందు ధరించి కమలాసన స్థిత అయిన కమలాదేవి హృత్కమల పద్మమును ప్రసన్నము గావించు శ్రీవిష్ణుభగవానుని రెండు బాహువులకు నమస్కరించుచున్నాను.

ముక్తినొసగు మంత్రముల ఫలస్వరూపమనెడు పుష్పగుచ్ఛము, త్రివళీయుతమై, కమలనాళమువంటి నిర్మలమయిన శ్రీవిష్ణుభగవానుని కంఠమును నేను నిరంతరము స్మరించుచున్నాను. రక్తవర్ణసదృశ ఎర్రని పెదవుల మందహాసముచే వికసించునది, కోమలమయిన వచనములను వెలిబుచ్చునది, అనుక్షణము సుధాప్రపూర్ణ వీక్షణములను ప్రసరించునది, పవిత్రచరిత్రుల మనస్సును రంజింపజేయునది అయిన శ్రీహరినారాయణుని ముఖకమలమును నేను ఎల్లప్పుడూ స్మరించుచున్నాను. వేని దర్శనముచే యముని గృహ గంధమును ఆఘ్రాణింప పనియుండదో, ఎవని కనుసన్నలలో జగత్తు యొక్క సృష్టి స్థిత్యంతములు కావింపబడునో, వేని దర్శనముచే కామదేవుని మహోత్సవము జరుగునో, వేని దర్శనముచే లక్ష్మీదేవి హృదయము వికసితమగునో, శ్రీహరి ముఖమందలి అట్టి భృకుటిని నేను చింతించుచున్నాను. ఆకాశమునందలి సర్వదిశలను మరియు శ్రీహరి గండస్థలములందు వెలుగులు విరజిమ్ముచున్న మకర కుండలములు వ్రేలాడునవి, వంకరలు తిరుగుచున్న ముంగురులచే తమ అగ్రభాగములు ముద్దిడబడుచున్నవి, మణిరత్న

సువర్ణఖచిత కిరీటము యొక్క చివరలచే స్పర్శింపబడునవి అయిన శ్రీవిష్ణుభగవానుని శ్రవణేంద్రియములను నేను స్మరించుచున్నాను. సుందర తిలకముచే పత్రరచన చేయబడినది, బ్రహ్మ యొక్క అద్వితీయ నివాసము, మణిరత్నఖచిత కిరీటకాంతులచే నిరంతరము మెరయునది అయిన లక్ష్మీపతి యొక్క దృఢ భృకుటిని నేను నిరంతరము ధ్యానించుచున్నాను.

లక్ష్మీదేవి హృదయమును శాంతమొనర్చునది, ఉంగరములు తిరిగి కదులుచు ఎగురుచున్నది, భక్తులచే అనేక విధములయిన పుష్పములచే ముడివేయబడినది, మేఘసదృశ సుందరమయిన వాసుదేవుని కేశసంపదను నేను హృదయమందు ధ్యానించుచున్నాను. వర్షాకాలమేఘసదృశ శరీర కాంతియుతుడు, సూర్యుని తేజము కలిగి చంద్రకాంతిని పోలు చల్లదనము ఒలికించు ద్యుతియుతుడు, సుందరమయిన కనుబొమలు, ఇంద్రధనస్సు వంటి నాసిక, కమలదళ నేత్రుడు, విద్యుత్ వంటి కాంతి గల పీతాంబరధరుడు, అయిన అపూర్వ విష్ణుభగవానుని నేను ఆశ్రయించుచున్నాను. మహాప్రభూ! నేను దీనుడను, వేదవిహిత సేవారహితుడను. పాపములచే, కష్టములచే నా శరీరము నిండియున్నది. అరిషడ్వర్గములు (కామ, క్రోధ, మోహ, లోభ, మద, మాత్సర్యములు) చే మానసిక పీడలచే పీడింపబడుచున్న నన్ను ఓ! వాసుదేవా! నీ కృపాకటాక్ష వీక్షణములచే రక్షింపుము."

విష్ణుభగవానుని ఎవరు ఈ పదహారు శ్లోకరూప పుష్పములచే పూజనయొనర్చి, స్తుతించి, ధ్యానించి, నమస్కరించి అనుష్ఠాన మొనర్చెదరో వారు సుఖమునొంది, ముక్తులై బ్రహ్మప్రాప్తి నొందెదరు. శివభగవానునిచే ఉపదిష్టము, మరియు పద్మావతిచే తెలుపబడిన ఈ విష్ణుపూజ విషయక పవిత్రప్రకరణము ధన, యశ, ఆయు, స్వర్గ ప్రదాయకము మరియు పరమ కళ్యాణకారకము. అంతేకాక పాపములను ధ్వంసమొనర్చి, ఇహపర లోకములందు ధర్మార్థ కామమోక్షములను చతుర్విధ పురుషార్థములను ఒసంగునది.

(శ్రీకల్కి పురాణమందు ప్రథమాంశ యందలి హరిభక్త వివరణము అను ఏడవ అధ్యాయము సమాప్తము)

ద్వితీయాంశము

ఒకటవ అధ్యాయము

(కల్కి ఆగమన వర్ణనము)

సూతుడు "సజ్జనులచే సన్మానింపబడునది, కల్కి యొక్క దూత అయిన శుకము పద్మ యొక్క పలుకులను చెవులారా శ్రవణమొనరించి, సఖులచే పరివేష్ఠింపబడిన పద్మతో ఇట్లనియె "ఓ! పద్మా! నీవు తెలిపిన అద్భుత కర్మములొనరించు విష్ణుభగవానుని అంగ ప్రత్యంగ పూజానుష్ఠానము నేనాచరించుటయేకాక త్రిలోకముల యందు ప్రచారమొనరించెదను." పద్మ "శుకమా! పాదాది కేశ పర్యంతము విష్ణుభగవానుని రూపమును నే తెలిపిన విధముగ ధ్యానమొనరించి, అటుపిదప ఆధ్యాత్మిక గురు మూలమంత్రమయిన **"ఓం నమో నారాయణాయ స్వాహా"** ను జపమొనర్పుము. అనంతరము సాష్టాంగ దండ ప్రణామాములర్పించి విష్ణు ప్రసాదమును అచట గల సర్వులకు ప్రసాదింపవలసినది. తదుపరి మనసునందున్న దుష్భావనలకు తిలాంజలి నొసంగి (దుర్భావనలను సంపూర్ణముగ విడచి), విష్ణు కీర్తనలాలపించి, సర్వత్ర స్థితిగతుడయినది విష్ణువే అని తెలిసికొని ఆయననే అన్నింటా దర్శించుచూ ఆ మహాత్ముని తిరిగి హృదయమందు స్థాపింపవలెను. అంత ప్రసాదమును తన శిరమునకు తాకించి పిదప భుజింపవలెను. ఇదియే విష్ణుపూజా విధానము. ఈ విష్ణుసేవ సకామముగ ఆచరించిన కార్యసిద్ధి; నిష్కామముగ ఆచరించిన మోక్షము సంభవించును. అంతేకాక ఇయ్యది దేవ, గంధర్వ, మనుష్యాదులకు సహితము శ్రవణానందము, హృదయమందు సంతృప్తి కలుగజేయును."

అంత శుకము "ఓ! సాధ్వీ! నావంటి నీచజన్మ గల పక్షికి సహితము నీవు సంసారము నుండి ముక్తికలిగించు విష్ణుభక్తిని విశదీకరించితివి. ఇదంతయు నీ కృపాకటాక్షమే! కానీ మణి, రత్న, స్వర్ణఖచిత విభూషితవు, దుర్లభ సౌందర్యరాశివయిన నీవు సజీవమయిన అపరంజిబొమ్మవలె నాకు కానబడుచుంటివి. గుణ, శీల, సౌందర్యములందు నీకు తుల్యమయిన కన్యను నేను ముల్లోకముల యందు కానలేదు. అంతేకాదు విష్ణువు వినా నీకు తుల్యమయిన వరుడు ఈ భూమండలమందు లేరు! లేరు! కానీ ఈ సంద్రమునకు అవతల సుందరుడు, గుణవంతుడు, సాక్షాత్ ఈశ్వర సమాన దివ్యపురుషుడు, సర్వులను ఆశ్చర్యచకితుల కావించు ఒక మహనీయుని నేను కాంచితిని. ఆ మహానుభావుని శరీరము బ్రహ్మ నిర్మితము అని నేను అనుకోను. ఆతని దివ్యశరీరము ధ్యానయోగముచే నిర్మింపబడి వాసుదేవుని తలపించుచున్నది. నీవు విష్ణుపూజ యందు తెలిపిన అపరిమిత తేజస్వి అయిన విష్ణువు గుణరూపములన్నియు ఆ మహనీయుని యందున్నవి" అని పలికెను.

పద్మ "ఓ! శుకమా! ఏమిచిత్రము! మాకెవరికీ తెలియని ఈ అమితతేజస్వి అయిన పురుషుడు ఎక్కడినుండి పుట్టుకువచ్చెను? ఆతని ద్వారా కావింపబడిన ఘనకార్యములేమి? నాకు విస్తారముగ తెలుపవలసినది. తొలుత నీవు వృక్షము నుండి క్రిందికి దిగి నా వద్దకు రావలసినది. ఇన్ని సద్విషయములు తెలిపిన నిన్ను నేను సవిధివిధానముగ పూజింపదలచితిని. నా ఆతిధ్యము స్వీకరించి నా ద్వారా ఈయబడు బీజ, ఫలములను ఆరగింపవలసినది. మణి మాణిక్యములను తలదన్ను నీ ఎర్రని ముక్కును నేను రత్నములచే తాపింపజేయుదును. స్వర్ణజటిత సూర్యకాంత మణులచే చేయబడిన హారమును నీ మెడలో అలంకరించెదను. నీ రెక్కలను సుందర, స్వచ్ఛమయిన మణులతో నింపి, కాషాయమలది, నీ రూపమును నేత్రానందకరముగ మలచెదను. నీ తోకయందు ఉరుముల ధ్వని కావించునవి, పాదములకు మువ్వలధ్వని కావించు మంజీరములను తొడిగెదను. నీ సమయానుకూలమయిన మధుర వచనములచే నా మానసిక వ్యధ దూరమయినది. నీకేమి కావలియునో నిరభ్యంతరముగ నాకు తెలుపవలసినది. నేను తక్షణమే నా చెలులతో కలిసి దానిని నెరవేర్చెదను."

అంత బ్రహ్మజ్ఞాని శుకము నెమ్మదిగ చెట్టుదిగి, ఆ రాకుమారిని సమీపించి, ప్రసన్నమనస్విౕయై ఇట్లు పలుకుట

ఆరంభించెను "చతుర్ముఖ బ్రహ్మదేవుని ప్రార్ధన మీదట దయాళువైన లక్ష్మీపతి విష్ణుభగవానుడు ధర్మ సంస్థాపనార్థమై శంభల నగరమున విష్ణుయశుని గృహమందు అవతరించెను. ఆయనకు మరి ముగ్గురు సోదరులు కలరు. ఉపనయనాది సంస్కారానంతరము ఆయన పరశురాముని వద్ద వేదవిద్య, ధనుర్వేదము, గాంధర్వవేదము అరువదినాలుగు కళలు అభ్యసించి, అటుపై శివుని మెప్పించి ఒక దివ్య వాహనమును (గారుడము), భయంకర ఖడ్గమును, కవచమును, నన్ను (శుకము) వరదానముగ గ్రహించి, తిరిగి శంభల నగరము ప్రవేశించెను. విశాఖయూప మహారాజు ప్రార్ధన మీదట పరమ బుద్ధిమంతుడయిన కల్కి ఆయనకు, అచట ఉపస్థితులయిన ఇతరులందరికీ విశేష ధర్మోపదేశము కావించెను." పద్మ ఈ ఆఖ్యానమునంతయు విని అత్యంత ప్రసన్నయై ఆ శుకమును స్వర్ణ రత్నములచే అలంకరించి చేతులు జోడించి ఇట్లనియె "మిత్రమా! నా కథనము ఇంతకుముందే నీకు అవగతము. ఇక ఇపుడు చెప్పునదేమున్నది? స్త్రీ సహజముగనే భయగ్రస్థ. ఆయనకు నా ప్రణాములర్పింపుము. ఆయన రానిఎడల పరమేశ్వరుడు నాకు ఒసగిన వరము శాపము అగునని నొక్కిచెప్పుము." అంత శుకము రాకుమారికి వీడ్కోలు పలికి, రివ్వున ఆకాశమునకు ఎగిరి కల్కిచే శాశింపబడుచున్న శంభల నగరమునకు ఏగెను.

శుకము యొక్క ఆగమనము గూర్చి వినిన కల్కి సంతసిల్లి, నెమ్మదిగ ఆ శుకమును తన ఒడిచేర్చి, ఆ శుకము సువర్ణ రత్నాభరణములచే అలంకృతమగుట గమనించి, పరమ పవిత్రమయిన ఆ శుకమును పూజించి, అర్ఘ్యపాద్యములచే సంతుష్టునొనరించి, ఆ శుకమును తన ముఖమునకావించి ప్రసన్నుడై "శుకమా! ఈతరి నీవు ఏ దేశములు కాంచితివి? అందలి అపూర్వ విషయవిశేషములేమి? ఈ మణి మాణిక్య సువర్ణ రత్నరాశులతో నిన్నెవరు అలంకరించిరి? నీవు వెడలినదాదిగ నేను నీ గూర్చియే ఆలోచించుచుంటిని. నిన్ను చూడని క్షణము నాకు ఒక యుగముగ తోచినది." కల్కి పలుకులు విని శుకము మనసున ఆనందపరవశయై శిరము వంచి తొలుత పద్మాదేవి యొక్క ఆచూకీ, తరువాత ఆమె ద్వారా పంపబడిన నమస్సుమాంజలులు అర్పించి, తదుపరి ఆమెతో తాను చేసిన సంభాషణము, ఆమె ద్వారా తాను పొందిన సత్కారము, చివరకు ఆమె సందేశమును సహితము యధాతధముగా తెలిపెను.

శుకము పలికిన పలుకులు వినిన కల్కి ప్రసన్నుడై, హృదయమందు పద్మాదేవి రూపము ముప్పిరిగొన వెంటనే శుకమును గొని శివ ప్రసాదితమయిన గారుడము నధిరోహించి శీఘ్రముగ సింహళదేశమున కేగెను. సముద్రమున కావలయున్న సింహళ దేశము అనేక వర్ణాశ్రమజనులతో నిండి స్వర్ణ, రత్న సమృద్ధమై, అంబరచుంబిత హర్మ్యములతో ప్రకాశించుచుండెను. అచటి గృహములు, హర్మ్య, ప్రాసాదములపై తోరణములు, పతాకములు రెపరెపలాడుచుండెను. అంతేకాక అనేక శత్రుదుర్భేద్య దుర్గములు, నగరద్వారములతో పరివేష్ఠింపబడిన ఆ సుందర కారుమతీ నగరము అనేక సభామండపములు, దుకాణములు, హర్మ్యములు, ఉద్యానవనములు, స్వచ్ఛజల సరోవరములతో నిండియుండెను. ఆ నగర స్త్రీలందరూ కమలనయనలు, సుగంధ పుష్పాలంకృతలై యుండిరి. కల్కి ఆ నగరమధ్యమున ఝంకార మొనర్చుచున్న భ్రమరములకు ఆలవాలమయిన విరిసిన కమలములు కలది, స్వేచ్ఛగా తిరుగుచున్న రాయంచలకు ఆశ్రయమయినది, సారస, హంస, కారండవాది జలపక్షుల కలకలచే తరంగయుతమయిన ఒక దివ్య సరోవరమును కాంచెను. ఆ సరోవరము కదంబ, దేవకాంచన, శాల, తాడి, మామిడి, కేసర, వెలగ, అశ్వత్థ, ఖర్జుర, నేరేడు, అర్జున (గానుగ), జాజికాయ, పనస, కమలాఫలములు, వక్క, కొబ్బరి మొదలగు అనేక పుష్ప, ఫల వృక్షములతో పరివేష్ఠితమయినది. కల్కి ఆ సరోవర, వన సౌందర్యమును ఆస్వాదించుచూ, తన అశ్వమునుండి క్రిందికి దిగి శుకముతో "తొలుత మనము ఈ స్వచ్ఛ జలములు సేవించి, స్నాన మాచరించెదము" అని పలికెను. అంత శుకము "స్వామీ! మీ అనుమతి అయిన ఎడల నేను తొలుత పద్మ యొక్క నివాసమున కేగి మన యాత్రావిశేషములను ఆమెకు ఎరింగించెదను" అని పలికెను.

(శ్రీకల్కి పురాణమందు ద్వితీయాంశ యందలి కల్కి ఆగమన వర్ణనమను ఒకటవ అధ్యాయము సమాప్తము)

రెండవ అధ్యాయము

(పద్మా కల్కి సాక్షాత్సంవాదము)

కల్కి శుకసహితుడై ఆ ఉద్యానమునందలి సరోవరమార్గము ననుసరించి సరోవరము చేరెను. ఆ సరోవరము స్వచ్ఛ జలములతో నిండి, కుడ్యములన్నియు పగడములు తాపింపబడి, మెట్లు స్పటిక నిర్మితములై యున్నవి. ఝుంకార మొనర్చుచున్న తుమ్మెదలచే మధువు గ్రోలబడుచున్న అరవిరిసిన కమలములు ఆ సరోవర జలతరంగ తాకిడికి నెమ్మదిగ అటునిటు కదలాడుచున్నవి. కదంబవృక్ష పత్రములపై పడుచున్న సూర్యకాంతిని ఓపలేక తుమ్మెదలు నీడకు పరుగులిడుచున్నవి. అచట గల రంగురంగుల ఆసనముపై కూర్చొని కల్కి ప్రసన్నుడై శుకమును పద్మ వద్దకంపెను. శుకము రాజమందిరము చేరి తిరిగి నాగకేసర వృక్షము అధిరోహించి ఆచటి నుండి చెలికత్తెలచే పరివేష్ఠింపబడిన పద్మాదేవిని కాంచెను. ఆ సమయమున శోకముచే నిశ్వాసము అత్యంత ఉష్ణము నొందుటచే తత్ఫలితముగ ఆ పద్మముఖి ముఖపద్మము కమిలియుండెను. తాపహరణమునకై రేవానదీ శీతల జలములందు ఆ తన్వంగి స్నానమాచరించినది. పుష్ప పత్రములు, పుష్ప పరాగముచే సుగంధితమొనర్పబడిన శీతల జలములు వీవబడుచున్ననూ ఆమె హృదయమందు మండుచున్న బడబాగ్ని ఇంచుక శమింపకుండెను. ఇటువంటి ఇందుముఖిని కాంచి శుకము ఆమెను శుభ వచనములచే ప్రసన్నము కావించెను.

శుకమును చూడగనే ఆ చిగురుబోడి సంభ్రమముతో "రమ్ము, రమ్ము" అని ఆహ్వానించెను. శుకము "ఓ! మంగళకారిణీ! నీకు శుభము కలుగుగాక!" అని పలికెను. పద్మ "ప్రియమిత్రమా! నీవు వెడలిన పిదప నేను అత్యంత వ్యాకులచిత్తనైతిని. నాకు శాంతి కరువైనది. నా వంటి భాగ్యహీనకు శాంతి, సౌఖ్యము దక్కునా?" అని దీనముగ ప్రశ్నించెను. శుకము "ఓ! శివసేవికా! నీకు దుర్లభమగునది లేదు. నీకు అత్యానందము కలిగించు విషయమును ఎరింగించెదను. నేను నీకెరింగించిన పురుషోత్తముడు కల్కి ఇచటి కేతెంచి సరోవర తీరమున వేచియుండెను. నేను ఆయన ఆజ్ఞచే నీ కడకు ఏతెంచితిని" అని పలికెను. అంత పద్మ అమందానందభరితయై శుకము యొక్క ముఖమును, కన్నులను ముద్దాడి విమల, మాలినీ, లీల, కమల, కామకందళ, విలాసినీ, చారుమతీ, కుముద, అను తన అష్ట చెలియలతో జలక్రీడలాడు నెపమున సరోవర తీరమునకు బయలుదేరెను. ఆ సమయమున ఆ చెలువ శ్రీకృష్ణ సందర్శనమునకేగిన భీష్మక పుత్రిక రుక్మిణీదేవి వలె భాసిల్లెను. మార్గమందలి పురుషులు రాకుమారి ఆగమనమును గ్రహించి తాము స్త్రీల వలె మార్పుచెందెదమని భయభీతులై నలుదిక్కులకు పరుగులెత్తిరి. రాచ పరివారమంతయు సరోవరము చేరి, జలక్రీడలాడి, నెమ్మదిగ కల్కి కొరకై వెదుకనారంభించిరి. ఆ సమయమున భ్రమరములు పుష్పమధువుచే మత్తెక్కి పద్మములను వీడి పద్మముఖి అయిన పద్మను వేరొక పద్మమని భ్రమపడి ఆమెను చుట్టుమట్టినవి. పద్మాదేవి సరోవరము నుండి బయల్వెడలి, చీనిచీనాంబరములు, బహుమూల్య ఆభరణములు ధరించి శుకము యొక్క పలుకులను పదేపదే స్మరించుచూ కామసంతప్తయై కల్కిని వెదకుచూ కదంబవనము ప్రవేశించెను.

అచట సరోవరపు తీరమున శుక సహితుడై ద్వితీయ భాస్కరుని వలె శోభిల్లుచున్న కల్కిని పద్మ కాంచెను. ఆ సమయమున ఆ మహానుభావుడు నీలిమేఘశ్యాముడు, లక్ష్మీపతి, పీతాంబరధారి, సర్వులకు స్వామి, సుందర కమలనేత్రుడు, ఆజానుబాహుడు, విశాలవక్షుడు, అద్దానిపై ప్రకాశించుచున్న కౌస్తుభమణిధారి, ప్రయాణ బడలికచే కన్నులు మూసుకొని యుండెను. పద్మ యొక్క ఆగమనమును కాంచిన శుకము ఆయనను మేల్కొలుపుటకు యత్నించెను, కానీ పద్మ ఆ శుకమును వారించెను. ఎందుకనగా శివుని వర ప్రభావము వలన ఎందరో దృఢ శరీరులు తనను చూచి స్త్రీ రూపము

నొందిన కారణమున పద్మ హృదయమందు భయగ్రస్థ అయ్యెను. ఇంతలో జడచేతనములకు ఆత్మస్వరూపి, సమస్త సంసారమునకు ప్రభువు అయిన కల్కిరూప నారాయణుడు మెలకువనొంది పద్మ యొక్క అభిప్రాయమును గ్రహించి ఆమెవంక విష్ణువు లక్ష్మీదేవిని వీక్షించునటుల ప్రేమగా, సాదరముగ, సాభిప్రాయముగ వీక్షించెను. ఆయన అద్భుత రూపమును గాంచి పద్మాదేవి చేష్ఠితములుడిగి, యథోచిత సత్కారములు చేయుట మరచి స్థాణువయ్యెను.

సుఖీజనముచే పరివేష్ఠింపబడినది, సిగ్గుచే శిరమును వంచుకొనినది, మహా మాయామోహిని అయిన పద్మను కాంచి అత్యంత కామపీడితుడై కల్కి ఇట్లనియె "కళ్యాణీ! నీకు స్వాగతము. నేటి మన ఇరువురి కలయిక నాకు అత్యంత భాగ్యదాయకము, మరియు కుశల ప్రదాయకము. పూర్ణిమాసుధాకరబింబ సదృశమయిన నీ ముఖ సందర్శనము వలన నా ఆశలు పూర్ణమై, పాపములు నివృతమై, సుఖదాయకమగును. ఈ జగత్తునందు సృష్ట్యాది కర్మలు కావించు నాకు పుణ్యకర్మలు, లేక ఆభిచారిక హోమములచే కూడా కలుగని శాంతి కేవలము నీ చంచలచక్షుసౌందర్య రసామృతమనెడు కామరూప సర్పఘాతముచే కలుగుచున్నది. నీ గుండ్రని భుజములు, పొడవయిన చేతులు, సుందరమయిన గోళ్ళు, నాలో చెలరేగిన కామభావన అను మదగజమును నిగ్రహించు మావటి చేతియందలి అంకుశము వలె శాంతపరచుగాక! వస్త్రముచే కప్పబడినవి, ఉవ్వెత్తున పైకి ఉబికినవి, నా వక్షస్థలముచే చిరుగాయమొనర్పబడునవి, కామదేవుని కొరడాలవంటి నీ గోళాకారమునున్న స్థనద్వయము నా మనోరధములను పూర్ణమొనరించుగాక! యజ్ఞవేది మధ్యభాగము వంటి నీ సన్నని నడుము, త్రివళీయుతమయిన నీ ఉదరము, నీ ప్రియునికి కామసంసేవనా సోపానములు. కామదేవుని దుర్గమువంటి నీ నులిమెత్తని రోమావళి నాకు ప్రియమొనరించుగాక! సన్నని పట్టు వస్త్రముచే ఆచ్ఛాదింపబడి నదీతటము వలె శోభిల్లుచున్న నీ గుండ్రని నితంబము కేవలము నా సంభోగ సుఖము కోసమే! ఓ! పరిపూర్ణ వికసిత శరీరము గల సుందరీ! పద్మముల వంటి నీ పాదములు, చిగురుటాకుల వంటి నీ అంగుళులు, రాజహంసల వలె నాదమొనర్చుచున్న నీ నూపురములు, కామ సర్పదష్ఠ అయిన నా హృదయమును శాంతమొనర్చు గాక!"

(శ్రీకల్కి పురాణమందు ద్వితీయాంశ యందలి పద్మా కల్కి సంవాదమను రెండవ అధ్యాయము సమాప్తము)

మూడవ అధ్యాయము

(నృప స్థవము)

కలి వంశ వినాశకుడయిన కల్కి యొక్క అమృతమయ వాక్కులు వినిన పద్మాదేవి ఉద్విగ్నమనస్కయై, అధోముఖియై, అంజలి ఘటించి ధీరోదాత్తుడయిన కల్కితో ఇట్లనియె "ఓ! ధర్మకవచా! సంసారమునకు స్వామీ! లక్ష్మీపతీ! పవిత్రాత్మా! నేను మిమ్ము తెలిసికొంటిని. దయచేసి మీరు నాయందు ప్రసన్నులై నన్ను రక్షింపవలసినది. నేను మిమ్ము శరణుజొచ్చుచున్నాను. కేవలము కఠినతరమయిన జప, ధ్యాన, తపో, వ్రతాదులచే మాత్రమే ప్రసన్నులయ్యెడి మీరు నా ఎడల ప్రసన్నులై నాకు దర్శనమొసంగిరి. స్వామీ! నేను ధన్యురాలిని. మీ అనుజ్ఞ అయినఎడల నేను మీ పాదసంస్పర్శ కావించి, మీ శుభాగమన విశేషమును నా తండ్రికి తెలియజేయుటకు నేను రాజభవనమున కేగెదను." ఈవిధముగ పలికి రూపసౌందర్యనిధి అయన పద్మ రాజాంత:పురమున కేగి, సేవకుల ద్వారా కల్కి ఆగమన వార్తను తన తండ్రికి తెలియజేసెను. ఈ విషయము వినిన బృహద్రధుడు బ్రహ్మానందభరితుడు అయ్యెను. వెంటనే కారుమతీ నగరమంతటినీ స్వర్ణ తోరణ, పతాకములతో అలంకరింపజేసి తన పురోహితులను, యోగ్యులయిన బ్రాహ్మణులను, మిత్రులను, సంబంధులను, రాజపరివారమును వెంటబెట్టుకొని, పుజాసామాగ్రిని గైకొని, నృత్య, గీతములాలపించు వైతాళికులచే

పరివేష్ఠితుడై కల్కిని ఆహ్వానించుటకేగెను. ఆయన వారందరితో కలసి సరోవర తీరమునకేగి రత్నజటిత పీఠముపై ఆశీనుడైయున్న విష్ణుయశపుత్రుడు, సమస్త జగత్తుకు ఏకమాత్ర ఆశ్రయుడు, సర్వులకు ప్రభువు, అయిన కల్కి భగవానుని దర్శించెను.

ఆ సమయమున అనేక స్వర్ణభూషణములు ఆ భగవానుని శరీరముపై మేఘములందలి మెరుపుతీగలవలె మెరయుచున్నవి. అంత బృహద్రథుడు “ఓ! పరంధామా! జ్ఞానము చేతకూడా అప్రాప్యమగు మీరు మావద్దకేతెంచి దర్శనమిచ్చుట మాంధాత పుత్రుడయిన యవనాశ్వునకు యదునాథుడు దర్శనమిచ్చినటులున్నది” అని పలికి ఆయనను మేళతాళములతో తమ రాజగృహమునకు గొనిపోయి, కొన్ని దినములు ఆయన విశ్రమించిన పిదప, ఒక శుభముహూర్తమున తన పుత్రిక, లక్ష్మీస్వరూప అయిన పద్మను కల్కి భగవానునికిచ్చి వివాహమొనరించెను. కమలాసనుని ఆదేశానుసారము బృహద్రథ మహారాజు కమలదళాయుత, పద్మినీజాతి స్త్రీ అయిన పద్మను కమలనేత్రుడు, కమలనాధుడు అయిన కల్కిస్వరూప విష్ణువునకు విధివిధానముగ ప్రదానము కావించెను. ప్రియపత్నిని ప్రాప్తించి, అనేక సత్కారముల నొందుచూ ఆనందపరవశుడై కల్కి కొన్నినాళ్ళు సింహళద్వీపమందే యుండెను. ఆసమయమున పద్మాస్వయంవర సమయమందు స్త్రీరూపము నొందిన రాజులందరూ ఆయన దర్శనార్థమేతెంచిరి. వారందరూ ఆ మహాత్ముని సందర్శించి, ఆయన చరణములను సంస్పరించి, ఆయన ఆజ్ఞచే రేవానది యందు స్నానమాచరించిరి. తక్షణమే వారందరూ తమ పూర్వపు పురుషరూపములు పొందిరి. పద్మాదేవి గౌరవర్ణ మరియు నీలివస్త్రధారిణి. కల్కి నీలమేఘశ్యాముడు మరియు పీతాంబరధారి. వారిరువురు వేరువేరుగా కానబడిననూ ఆంతర్యమునందు వారిరువురూ ఒక్కటే! కల్కి యొక్క పరమాద్భుత ప్రభావమును కాంచిన భూపతులందరూ ఆయనను శరణుజొచ్చి, ఆయనకు ప్రణామములొనర్చి, పరమభక్తితో ఆయనను స్థుతించుట ఆరంభించిరి.

“ప్రభూ! మహామాయచే ఈ సృష్టిస్థిత్యంతములు కావించు నీకు జయమగుగాక! త్రిలోకములు ప్రళయమందు జలమగ్నమయినపుడు మనువును, లోకములను రక్షించుటకు నీవు మత్స్యావతారమును ధరించితివి. దితి పుత్రుడయిన హిరణ్యాక్షుడు ఇంద్రుని వధించి, పృధివిని హరించుటకు యత్నించినపుడు నీవు వరాహావతారమును స్వీకరించి, సంకల్ప మాత్రమున వారిని ఉద్ధరించి హిరణ్యాక్షుని సంహరించితివి. దేవదానవుల ద్వారా మంధర పర్వతముచే సముద్రమథనము కావింపబడినపుడు నీవు కూర్మరూపము ధరించి ఆ పర్వతమును నిలిపితివి. హిరణ్యకశిపుడు బ్రహ్మదేవుని నుండి అసాధ్యమయిన వరములు పొంది అస్త్రశస్త్రములచే, దివారాత్రములందు, త్రిలోకములందలి దేవ, గంధర్వ, నాగ, కిన్నెర, మానవాదులు ఎవరివలననూ మృత్యువు నొందని వితర్క పరిస్థితియందు నీవు నేర్పుగా నరశింహ అవతారము స్వీకరించి వానిని నీ నఖములతో చీల్చి సంహరించితివి. త్రిలోకవిజేత అయిన బలి వృద్ధి పొందినపుడు నీవు బ్రహ్మచారి అయిన వామనునిగ ఆయన వద్దనుండి మూడడుగుల నేల అడిగి గ్రహించి, తదుపరి నీ విశాల కాయముచే బలిని రసాతలమునకు త్రొక్కి, నీ అంతులేని దయచే ఆతనికి ద్వారపాలకుడవయితివి. అపరిమిత బలము, పరాక్రమములచే గర్వాంధులై సన్మార్గమునుల్లంఘించిన కార్తవీర్యాది హేహయవంశ రాజులను, ఇతర భూపతులను సంహరించుటకు నీవు పరశురామావతారము స్వీకరించి, పృధివి అంతటనూ పరిభ్రమించి ఇరువదిఒక్క మార్లు క్షత్రియ సంహారము కావించి పుడమిని క్షత్రియవిహీన మొనర్చితివి. పులస్త్య వంశభూషణుడయిన విశ్రవసువునకు లోకకంటకుడయిన రావణుడు జన్మించి త్రిలోకములకు కష్టమొనరించెను. అంత నీవు సూర్యవంశ సంజాతుడవై దశరథునికి పుత్రునిగ జన్మించి, సీతాపహరణ నెపమున రావణుని ఎదిరించి, వానరములచే సముద్రమునకు సేతువు నిర్మించి దశకంఠుని ఆతని అనుచర సహితముగ పరిమార్చితివి. ద్వాపరమందు దానవ, దైత్య వినాశనమునకై, త్రిలోకములందు దు:ఖ నివారణకై యాదవ వంశమందు వసుదేవ తనయులుగ, దేవతలు సహితము పూజించు చరణయుగళి గల శ్రీకృష్ణ,

బలరాములుగ ఆవిర్భవించితివి. వేద ప్రతిపాదితమయిన, వైదిక ధర్మానుష్ఠానములందు తెలుపబడిన ధర్మములను వ్యతిరేకించుచూ, సంసారమును త్యజించి ధ్యానమార్గమును అనుసరింపమని నీవు బుద్ధావతారమందు ప్రభోదించితివి. ఇపుడు కలి వంశజులు, పాఖండులైన బౌద్ధులు, మ్లేచ్ఛాదులను నాశమొనర్చి, తిరిగి వైదికధర్మమును రక్షించి, ప్రతిష్ఠించుటకు నీవు కల్కిగా అవతరించితివి. పురుషులమయిన మమ్ము స్త్రీరూప నరకము నుండి రక్షించిన మీ కృపను మేము ఎట్లు, ఎంత, ఏవిధముగ ప్రశంశింపగలము? స్వామీ! బ్రహ్మాదులకు సహితము జ్ఞాతముకాని నీ మాయ ఎక్కడ? నిరంతర విషయభోగ లాలసులము, స్త్రీరూప మృగతృష్ణలను వెంబడించు మానవులమయిన మేమెక్కడ? ఓ! కృపాసింధూ! నీ కృపాకటాక్ష వీక్షణములచే మమ్ము స్వస్థులచేయ ప్రార్ధన." ఈ విధముగ రాజులందరూ విష్ణు భగవానుని దశావతారములను స్థుతించిరి.

(శ్రీకల్కి పురాణమందు ద్వితీయాంశ యందలి నృపస్థవము అను మూడవ అధ్యాయము సమాప్తము)

నాల్గవ అధ్యాయము

(అనంతమాయా దర్శనము)

సూతుడు "భక్తులయిన నృపతులచే కర్ణపేయముగ కావింపబడిన దశావతార కీర్తనమును వినిన పరమాత్ముడు వారికి చాతుర్వర్ణాశ్రమ ధర్మములను, సంసారమునందు ఆసక్తులు, విరక్తులు అయిన మనుజులకు వేదములందు తెలుపబడిన ఆదేశములను వివరించెను. అంత ఆ నృపతులు పవిత్రహృదయులై తమ పూర్వగతిని (స్త్రీ స్వరూపములను) ఒక్కమారు స్మరించి తద్విషయమై ఇట్లు ప్రశ్నించిరి "స్వామీ! మనుజులు స్త్రీలుగా, పురుషులుగ ఏ కారణమున జన్మింతురు? పరిణామక్రమమున అంకురించు బాల్యము, యవ్వనము, వృద్ధాప్యము మొదలగు అవస్థలు, సుఖదు:ఖములు ఏ కారణముచే, ఎవరినుండి, ఎట్లు ప్రాప్తించును? దయచేసి మాకు మా అజ్ఞాతకర్మల జ్ఞానము గూర్చి సహితము తెలుపవలసినది." ఆ మహీపతుల వచనములను వినిన కల్కి "అనంతుడు" అను మునిని స్మరించెను. తక్షణము శ్రేష్ఠుడు, పుణ్యాత్ముడు, నియమనిష్ఠాగరిష్ఠుడు అయిన అనంతముని కల్కి దర్శనమే తనకు మోక్షప్రాప్తి అనితలచి, అచటికేతెంచి, కల్కి భగవానునకు వందనములిడి "స్వామీ! నా కర్తవ్యమును తెలుపవలసినది" అని ప్రార్థించెను. అంత కల్కి "మునివర్యా! నా ద్వారా కావింపబడు సమస్త సృష్టి మీరు చూచి తెలిసికొనిరి. కర్మ కావింపక ఎవరునూ ఫలములు భోగింపలేరు" ఈవిధముగ నర్మగర్భముగ పలికి కల్కి వెడలుటకు ఉద్యక్తుడయ్యెను. అంత రాజులందరూ "స్వామీ! మీరిరువురూ ఏదో సంకేతానుసారము భాషించుకుంటిరి. మీ వార్తాలాపముల ఆంతర్యమేమి? మాకు తెలుపవలసినది" అని పలికిరి. అంత మధుసూదనుడు " ఆ విషయవిశేషములను ఈ శాంతిప్రియుడయిన ముని ద్వారా తెలుసుకొనవలసినది." అంత రాజులందరూ అనంతమునికి వందనములిడి తిరిగి అదేవిధముగ ప్రశ్నించిరి.

అంత ముని చెప్పదొడంగెను "పూర్వము "పురిక" అను నగరమందు వేదవేదాంగ పారంగతుడు, ధర్మనిష్ఠుడు, ప్రసిద్ధుడు, పరహితార్ధ తత్పరుడు అయిన "విద్రుముడు" అను మహర్షి యుండెడువాడు. ఆయన ధర్మపత్ని "సోమ" పతిధర్మపరాయణ. ఆ పుణ్యదంపతి నా తల్లిదండ్రులు. వారిరువురకు చాలాకాలము సంతానము కలుగక వృద్ధాప్యము నందు నేను జన్మించితిని. విధి వక్రించి జన్మత: నేను నపుంసకుడను. మాతాపితరులకు దు:ఖదాయకుడను, జగత్తునందు నిందింపబడు రూపముగల నన్ను చూచి నా తండ్రి భయ, దు:ఖ, శోకతప్తుడై వనములకేగి ధార్మిక విధివిధానములు, ధూప, దీప, సుగంధ, లేపనాదులతో ఈశ్వరార్చన కావించెను. శివుని "కళ్యాణకరా! నీవు భూతప్రేతములకు సహితము

స్వామివి. జటాజూటధరా! నీ జటాజూటమందు విరుచుకుపడిన గంగను సునాయాసముగ బంధించితివి. విపులానంద వితరణదక్షా! శంకరా! నీకు ప్రణామములు." ఈవిధముగ ఎన్నో స్తుతులతో శంకరునికి ప్రణామములొనర్చెను. ఈ స్తుతులకు సంతసిల్లిన వృషభవాహనుడు, మంగళకరుడు, పరమేశ్వరుడు కరుణతో "వరము కోరుకొనుము" అని పలికెను. అంత నా తండ్రి నాకు పుంస్త్వము ప్రసాదింపమని కోరెను. పార్వతీపరమేశ్వరులు ఇరువురు అద్దానికి ఆమోదించి నాక పుంస్త్వము ప్రసాదించిరి.

నా తండ్రి తిరిగి గృహమునకేతెంచి పూర్ణముగ పురుషుడనైన నన్ను గాంచి ఎంతో సంతోషించెను. అటుపిదప వారిరువురు వృద్ధులగుటచే నాకు పన్నెండవఏట యజ్ఞరాతుడు అను పండితుని పుత్రికతో వివాహ మొనరించిరి. నా పత్ని సౌందర్యవతి, పతిసేవా పరాయణి అగుటచే నేను గృహస్థాశ్రమమందు ప్రవేశించి పత్నీవశుడనై సంపూర్ణముగ సంసారమునందు మునిగితిని. కొంతకాలమునకు వృద్ధులయిన నా మాతాపితరులు మరణించిరి. సంబంధులు, బ్రాహ్మణుల సహకారముతో నేను వారి పారలౌకిక క్రియలను నిర్వర్తించితిని. కానీ పరమ పూజ్యులయిన వారి వియోగము నా హృదయమును శోక సంతప్తము కావించుటచే నేను విష్ణుపూజ యందు విలీనుడయితిని. నాచే కావింపబడుచున్న పూజాదికములచే సంతుష్టుడై విష్ణుభగవానుడు నాకు స్వప్నమందు సాక్షాత్కరించి "ఈ సంసారమందలి స్నేహ మోహాదులన్నియు మాయయే! తల్లి, తండ్రి, బంధుత్వములు అను బంధములు మనసునందు వ్యాకులత కల్పించి, నా మాయచే శోక, దు:ఖ, భయ, ఉద్వేగ, జర, మృత్యువులను ప్రసాదించుచున్నది." ఈవిధముగ పలుకుచున్న విష్ణు భగవానునితో నేను ఉత్తరప్రత్యుత్తరములు జరుపదలచితిని. కానీ ఆ పరాత్పరుడు అంతర్థానుడయ్యెను. నా కల చెదిరి, నాకు మెలకువ వచ్చెను. ఓ! మహీపతులారా! నేను విస్మయుడనైతిని. తదుపరి నేను పత్నీసహితుడనై పురికాపురిని విడచి పురుషోత్తమపురము (పూరీ జగన్నాథము) అను శ్రీవిష్ణుధామము చేరి ఒక ఆశ్రమమును నిర్మించుకొని, అచటనే యుండి విష్ణుసేవా తత్పరుడనైతిని.

ఈవిధముగ అక్కడ నివసించుచూ, శ్రీవిష్ణుగీతము లాలపించుచూ, విష్ణుకీర్తనలకు నర్తన మొనర్చుచూ, శ్రీవిష్ణు జపమొనర్చుచూ, నామస్మరణము కావించుచూ, కాలము వెళ్ళబుచ్చ సాగితిని. ఈ విధముగ పన్నెండేండ్లు గడచినవి. ఒకనాడు నాకు ఒక చిత్రమయిన కోరిక కలిగినది. నాకు విష్ణుమాయా సందర్శనము చేయవలెనని కోరిక కలిగినది. ఒకనాటి ద్వాదశీ పుణ్యతిథినాడు పారణ చేయుటకై సంబంధులతో కలసి నేను సముద్ర స్నానమున కేగితిని. ఉత్తుంగ తరంగములతో కదలాడుచున్న సముద్రమునందు ప్రవేశింపగనే ఒక బలమయిన కెరటము నన్ను లోనికి లాగినది. ప్రవాహపు వేగముచే నేను బయటకు వచ్చుటకు అసమర్థుడనైతిని. అనేకమార్లు మునుగుచూ, తేలుచూ, శరీరము వశముతప్పి, స్పృహకోల్పోయి, దక్షిణ సముద్ర తీరమున విసిరివేయబడితిని. సాయం సంధ్యోపాసన కేతెంచిన వృద్ధశర్మ అను శ్రేష్ఠ బ్రాహ్మణుడు నన్నుచూచి, దయతలచి నన్న తన గృహమునకు తీసికొనివెళ్ళెను. పత్నీ, పుత్ర, ధనయుతుడయిన ఆ ధర్మాత్ముడు నన్ను తన సొంత పుత్రునివలె సాకి నన్ను రోగ నివృతుని కావించెను. నేను నా స్వస్థలమును, సర్వమును మరచియుండుటచే ఆ వృద్ధశర్మ దంపతినే మాతాపితరులుగ భావించి అచటనే నివసింప సాగితిని. ఆ బ్రాహ్మణుడు నన్ను అనేక విధములుగ పరీక్ష యొనరించి, నన్ను వైదిక క్రియకలాపములందు నిష్ణాతునిగ తెలిసికొని, వినమ్రుడనయిన నాకు తన పుత్రికనిచ్చి వివాహమొనరించెను. తప్తకాంచన సదృశ శరీరము, సౌందర్యము, సదాచారము, శుభ గుణశీలములు గల చారుమతిని భార్యగా పొంది నేను ఆనందపరవశుడనైతిని. తదుపరి తిరిగి సంసార సముద్రమందు మునిగి వివిధ విషయ సుఖభోగములందు నిమగ్నుడనై యున్న నాకు అయిదుగురు పుత్రులు కలిగిరి. వారి నామములు జయ, విజయ, కమల, విమల, మరియు బుధులనువారు.

ఈ విధముగ ధనసంపత్తి, బంధుమిత్రులు, పుత్రులు, ఇత్యాదులచే నేను నా సన్నిహితజనుల మధ్య దేవరాజయిన

ఇంద్రుని వలె పూజింపబడితిని. ఇంతలో నా ప్రథమ పుత్రుడు వివాహ యోగ్యుడయ్యెను. వేదజ్ఞుడు, ప్రసన్నుడు అయిన ధర్మసారుడను బ్రాహ్మణశ్రేష్ఠుడు తన పుత్రికను జయునకిచ్చుటకు అంగరంగ వైభవముగ ఏతెంచెను. నేనునూ అత్యంత ఆనందితుడనై, నా పుత్రుని అభ్యుదయ నిమిత్తము పితృదేవ, ఋషితర్పణము లర్పించుటకు తిరిగి సముద్రతీరమున కేగితిని. ఆ సమయమున తిరిగి సముద్రపుటలలచే లోనికి లాగబడి, స్పృహ కోల్పోయి అంతకుముందు ద్వాదశీ పారణము చేయుచున్న తీరమున స్పృహనొంది నా మిత్రులందరినీ కాంచితిని. అంత అనంతమునికి ఏమి చేయుటకు పాలుబోక "నేనెవరిని? నేను ద్వాదశ పారణ కావించుచున్నానా? లేక నా పుత్రుని వివాహార్థము దేవ, పితృఋణాది తర్పణ లిచ్చుచున్నానా?" అని సందిగ్ధమున పడెను. ఆతని మిత్రులు "అనంతా! నీవు విష్ణుభక్తుడవు. నీ వ్యాకులతకు కారణమేమి? నీవు పృథివీ లేక జలములందు ఏదేని విపరీతమును కాంచితివా? ఒకవేళ అది నిజమయిన నీ భ్రాంతిని విడచి వ్రతపారణ మొనర్పవలసినది" అని పలికిరి. నేను వారికి నేను ఏదియును కని, వినలేదని సర్దిచెప్పితిని. విషయ భోగాసక్తుడను, విష్ణుమాయావిలాస వీక్షణాతత్పరుడను, మూర్ఖుడనైన నేను ఆ మాయా ప్రభావముచే వివేకశూన్యుడనయి, వ్యాకులచిత్తుడనైతిని. ప్రేమ, మోహములకు సంపూర్ణముగ వశీభూతుడనైన నాకు శాంతి కరువైనది. విష్ణుమాయచే నాకు కలిగిన విస్మృతి నాకు తప్ప వేరొకరికి తెలియదు. ఈ విధముగ చారుమతి అను భార్య, సంపద, పుత్రులు, పుత్ర వివాహము, అందలి ఆసక్తి, దానిచే కలిగిన దు:ఖము – ఇవన్నియు విష్ణుమాయచే కావింపబడి స్వప్నమను భ్రాంతిగా తోచినవి. అనగా ఈ సంసారమందలి వివిధ వస్తువులు, భావనలు, సుఖదు:ఖములు, బంధువులు సర్వము భగవంతుని మాయయే!! అందువలననే ఉపనిషత్తులందు **"బ్రహ్మసత్యం, జగన్మిథ్య"** అని ప్రతిపాదింప బడినది.

వివశుడనై జడుడు, మూర్ఖునివలె నిలుచునియున్న నన్నుచూచి నా పత్ని "అకస్మాత్తుగా ఈయనకు ఏమైనది?" అని అరచుచూ రోదింపసాగినది. నేను నా పత్నిని చూచి, వేరొక పత్నీపుత్రులను తలచి, ఉద్విగ్న మనస్కుడనై యుండగా నాకు ఉపదేశమొనర్చుటకు వివేకయుక్తుడు, సర్వజ్ఞుడు, ధర్మజ్ఞాత అయిన ఒక పరమహంస ఏతెంచెను. సూర్యతేజస్వీ, అత్యంత శాంతిస్వరూపుడు, పరమ పవిత్రుడు, సంసార దు:ఖతాపనాశకుడు, అయిన ఆ పరమహంసను నా బంధుమిత్రులందరూ పూజించి నా స్వస్థత గూర్చి ప్రశ్నించిరి.

(శ్రీకల్కి పురాణమందు ద్వితీయాంశ యందలి అనంత మాయాదర్శనము అను నాల్గవ అధ్యాయము సమాప్తము)

ఐదవ అధ్యాయము

(అనంత మాయా నిరశనము)

అంత పరమహంస నా (అనంతుని) వంక సాభిప్రాయముగ చూచి "నీ పత్ని చారుమతి, బుధాది నీ పుత్రులు, నీ ఆస్తి, ఐశ్వర్యము, గృహము, పంటపొలములు, ఎట్లున్నవి? నేడు నీ పుత్రుని వివాహము కదా! వారినీ, నీ గృహాది ఐశ్వర్యములను విడచి ఇక్కడ ఏమి చేయుచుంటివి? ఎల్లప్పుడూ నీవు ధర్మపరులయిన వ్యక్తుల సహితుడవై యుండుచూ నీ పుత్రుని వివాహనిమిత్తమై నన్ను సహితము ఆహ్వానించి నీవు సముద్ర తీరమున కేగితివి. అపుడు నీ వయస్సు డెబ్బదిఏండ్లు. ఇపుడు కేవలము మూడు పదుల వయసు వానివలె గోచరించుచున్నావు. ఇది ఎట్లు సాధ్యము? ఇక్కడ గల నీ పత్నీ, మిత్రులు ఇంతకుమందు కానరాలేదు. అక్కడి నుండి ఇచటకు నీవు ఏవిధముగ కొనిరాబడితివి? నీవు అనంతుడవేనా? లేక వేరా? నేనునూ అదే భిక్షుకుడనా? లేక వేరొకరినా? నీవు కర్తవ్యనిష్ఠుడయిన గృహస్థుడవు. నేను

బిక్షాటనముచే జీవనము నిర్వహించు బిక్షుకుడను. మన సంవాదము ఒక బాలునికి, ఉన్మత్తునకు మధ్య జరుగు సంభాషణ వలె యున్నది. నా ఉద్దేశ్యము వినుము. సర్వము విష్ణుమాయయే! త్రిలోకములు ఈ పరమాద్భుత విష్ణుమాయచే ఆకర్షింపబడి, అద్దానికి ఆధీనములై యుండును. ఈ మాయ జ్ఞానముచే తెలియబడును, కానీ కేవలము అద్వైతము చేత మాత్రమే ప్రాప్యము. అనగా జ్ఞానదృష్ట్యా ఈ సర్వము మాయ అని తెలిసినప్పటికీ, సర్వము నందు వెలుగుచున్న జ్యోతి ఒక్కటేయని జీవునికి దర్శనమైనప్పుడు మాత్రమే ఈ మాయ వీడును.

ఈవిధముగ నాతో పలికి, మరిన్ని విస్మయాత్మక విషయములెన్నో తెలిపి అచట యున్న మార్కండేయ మహర్షితో ఇట్లు సంభాషించెను "ఓ! మార్కండేయా! మహాభాగా! నీకు భవిష్యత్ గూర్చి తెలిపెదను. ఇయ్యది మిక్కిలి ఆశ్చర్యదాయకము. ప్రళయకాలమందు పరమపురుషుడు పరాత్పరుని ఉదరమునందు గల జలములందు ఈ మాయ ఉపవిష్ఠమై యుండును. ఈ మాయ వేశ్య విటులను ఆకర్షించు రీతిని సర్వులను ఆకర్షించును. ఇయ్యది నీచే సహితము చూడబడినది; అనుభవింపబడినది; మరియు తెలియబడినది. ఈ మాయ అంధకారబంధురమై అందరినీ కష్టనష్టములందు మునుగునట్లు ఒనరించినప్పటికీ ఇయ్యది అవినాశి. ఈ సంసారము వివిధములుగ, విభిన్న స్థితులయందు స్థాపింపబడుటకు కారణము, ఆధారము ఈ మాయయే! ప్రళయకాలమందు త్రిలోకములు పరబ్రహ్మమందు లీనమై, జగత్తు అంతయు ఉపాధిరహితమై, అంధకారబంధురమై ఒప్పారును. తదుపరి పరబ్రహ్మము సృష్టిరచన కావించుటకు సంసిద్ధుడై పంచభూతములుగ ప్రకటమగును. అపుడు పరబ్రహ్మము ప్రకృతి, పురుషుడుగా భావింపబడుదురు. వారిరువురు కాలము సహాయముతో మహత్తత్వమును ఉత్పన్నమొనర్చెదరు. అటుపిదప ప్రారబ్ధకర్మ, మరియు కాలము సహాయమున మహత్తత్వము నుండి అహంకారము ఉత్పన్నమగును. గుణత్రయము ఈ అహంకారము నుండి బ్రహ్మ, విష్ణు, రుద్రులను ఉత్పన్నమొనర్చి, వారి నుండి జగత్తు ఉత్పన్నమగును. ఈ త్రిగుణయుక్త అహంకారము నుండి పంచతన్మాత్రలు, వాని నుండి పంచ మహాభూతములు ఉత్పన్నమగును. అందువలన సృష్టి ప్రకృతి, పురుషుల సంయోగము వలననే కలుగును. తదుపరి దేవ, దానవ, మానవ, మొదలగు సర్వ ప్రాణిజాతులు, జననమరణ చక్రమందు భ్రమించు సమస్త జీవులు ఈ బ్రహ్మాండరూప భాండమందు ఉత్పన్నమగును.

పరమాత్మ యొక్క మాయచే మోహితుడయిన జీవుడు కేవలము సంసారము యందు మాత్రమే ఆసక్తుడగుటవలన వ్యాకులచిత్తుడై తన కళ్యాణకారక విషయము గూర్చి ఇంచుక తెలియడు. ఈ మాయ అత్యంత బలశాలి. ఎంత ఆశ్చర్యమనిన బ్రహ్మాది దేవతలు సహితము దీనిని దాటజాలరు. ముక్కుతాడు కట్టబడిన పశువు, తాళ్ళతో కాళ్ళు కట్టబడిన పక్షి ఎట్లు స్వేచ్ఛగా మసలజాలవో, అట్లే మాయామోహితులైన జనులు ఈ మాయను దాటజాలరు. ప్రవృత్తి లేక సంస్కారములనెడు మొసళ్ళతో నిండినది, అత్యంత వేగముగ ప్రవహించు గుణములతో కూడిన ఈ మాయారూప నదిని దాటుటకు యత్నించు మానవుల జన్మమే జన్మము. వారు మాత్రమే ఈ సంసారము యొక్క వాస్తవికను ఎరిగినవారు." ఈ విధముగ పలికి అనంతముని మౌనము వహించెను.

అనంతముని పరమహంస యొక్క పలుకులను వివరించిన మీదట రాజులందరూ "మునివర్యా! తదుపరి ఏమి జరిగినది? అద్దానిని సహితము తెలుపవలసినది" అని పలికిరి. అనంతముని తపము ద్వారా మోహవినాశనము, ఇంద్రియ దమనము గూర్చి ఇట్లు వివరించెను "తదుపరి నేను వనమునకేగి తపమొనరించితిని. అయిననూ నాకు ఇంద్రియ నిగ్రహము, మనోవశము కాకుండెను. ఎందుకనగా నేను తపమాచరించుచున్ననూ నా మనసు పత్నీ, పుత్ర, ధన, గృహ విషయములందే తిరుగాడుచున్నది. వారి స్మరణ మాత్రముననే ధారణా, ధ్యానములను నష్టమొనర్చు దు:ఖ, శోక, భయాదులు నన్నావరించి నాకత్యంత క్లేశమును కలిగించెడివి. అంత నేను ధృఢనిశ్చయుడనై "ఇంద్రియములను

హత్య గావించినకానీ మనోవశము కానేరదు” అని నిశ్చయించి, వానిని నిగ్రహించుటకు ఆయత్తుడనైన నా వద్దకు ఇంద్రియాధిష్ఠ దేవతలేతెంచి ఇట్లు పలికిరి “ఓ! అనంతా! దిక్కులు, వాయువు, సూర్య, వరుణ, అశ్వినీ దేవతలు, అగ్ని, ఇంద్ర, విష్ణు, మిత్ర, బ్రహ్మ మరియు యమాది ఇంద్రియాధిష్ఠ దేవతలందరూ నీ శరీరమందే ప్రకాశించుచుండిరి. నీ నఖాగ్రముచే వారిని నాశనమొందింపలేవు. నీ మనోవశమునకు నీవెంచుకున్న మార్గము సరికాదు, శ్రేయస్కరము అంతకంటే కాదు. ఒకవేళ ఇంకనూ నీవు అదే ప్రయత్నమొనరించిన ఎడల, నీ శరీరము ఛిన్నాభిన్నమై, నీ అంగసంధులు విడి నీవు మరణించెదవు. వనమునందు నివసించు వికలాంగులు, అంధులు, బధిరులు మనసు సహితము ఎల్లప్పుడూ విషయభోగములందే మగ్నమగుట మేము గమనించుచునే యున్నాము. ఆత్మరూపి అయిన గృహస్థునకు బుద్ధి భార్య, మనసు సేవకుడు. ఈ పద్ధతి తెలిసి అనుష్ఠించిన వానికి మేము సేవకులము.

కర్మాధీన జీవులయొక్క బంధ, మోక్షములకు కారణము మనస్సే!!! పరబ్రహ్మ యొక్క మాయచే విషయభోగాసక్తమయిన మనస్సు జీవుని సంసారచక్రమందు త్రిప్పుచునే యుండును. అందువలన మనసును వశమొనర్చుకొనుటకు “విష్ణుభక్తి”ని ఆశ్రయింపుము. ఈ భక్తి అత్యంత సుఖదాయకము. ఇయ్యది కర్మలను భస్మమొనరించి, జ్ఞానమునిచ్చి, మోక్షమును ప్రసాదించును. విష్ణుభక్తి ద్వైతాద్వైతములను ప్రసాదించి, ఆనందమును వర్షించును. ఓ! మహామతీ! విష్ణుభక్తిచే జీవకోశాది లింగ, సూక్ష్మ శరీరములు నాశనమగును. (అనగా మానవుడు సాధారణముగ స్థూల, సూక్ష్మ శరీరములు రెంటినీ కలిగియుండును. స్థూల శరీరమందు ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానములను పంచ వాయువులు, పంచ జ్ఞానేంద్రియ, కర్మేంద్రియములు, మనోబుద్ధులు యుండును. జీవుడు మరణించినంతనే ఇవన్నియు నాశనమగును. కానీ మనము కావించిన కర్మల ప్రవృత్తులు లేక వాసనలు సూక్ష్మ శరీరము లేక లింగ శరీరము నంటియుండి వేరొక స్థూల శరీరమును తిరిగి గ్రహించి ఆ కర్మల ననుభవింపజేయును. హరిభక్తిచే ఈ సూక్ష్మ శరీరము నష్టమై, కర్మలు దగ్ధమై, పునర్జన్మ యుండదు.) అందువలన నీవు కల్కి దర్శనము ఒనర్చిన ఎడల శ్రేష్ఠమయిన మోక్షము నొందెదవు అని పరమహంసచే బోధింపబడితిని. అప్పటినుండియు కృష్ణ పూజా నిరతుడనై యుంటిని. తత్ఫలితముగ నాకు ఇపుడు కలివంశ నాశకుడు, కృష్ణస్వరూపుడు, విష్ణుభగవానుడయిన కల్కి భగవానుని దర్శనమయినది. నేనీనాడు రూపరహిత పరమాత్ముని రూపమును దర్శించితిని. పదరహిత పరమాత్ముని పద పల్లవములను స్పర్శించితిని. పలుకులెరుగని పరమాత్ముని పలుకులను వింటిని.”

ఈవిధముగ పలికి అనంతముని అత్యంత ప్రసన్నుడై తన స్వామి, లక్ష్మీపతి, కమలనేత్రుడయిన కల్కికి ప్రణామము లొసంగి తన ఆశ్రమమునకు వెడలెను. తదనంతరము ఆ మహీపతులందరూ ముని ఆచరణముల ననుసరించి కల్కిని పూజించి, పద్మాదేవికి నమస్కృతులొనరించి, కాలాంతరమున మోక్షము నొందిరి. శుకుడు “అజ్ఞానాంధకారమును దూరమొనర్చునది, మాయను విమోహము కావించునది అగు ఈ అనంతముని చరిత్ర చదివిననూ, విననూ కర్మబంధము నుండి విముక్తులగుదురు. శ్రీవిష్ణు సేవాతత్పరులు సంసారసాగర భోగవిలాసములందు లిప్తులైననూ, ఈ అభేదజ్ఞాన రూపాఖ్యానము ద్వారా ధర్మాత్ములై, జ్ఞానజ్యోతి ప్రకాశముచే భక్తి అను ఖడ్గము ధరించి అరిషడ్వర్గములను (కామ, క్రోధ, మోహ, లోభ, మద, మాత్సర్యములు) తెగనరికి జగత్తు నందు ఆత్మస్థితులగుదురు.

(శ్రీకల్కి పురాణమందు ద్వితీయాంశ యందలి అనంతమాయా నిరశనము అను ఐదవ అధ్యాయము సమాప్తము)

ఆరవ అధ్యాయము

(బుద్ధ నిగ్రహ కీకట పురాగమనము)

శుకుడు తిరిగి చెప్పదొడంగెను "రాజులందరూ వెడలిన పిదప కల్కి పద్మ మరియు సేనాసహితుడై శంబల నగరమున కేగుటకు నిశ్చయించెను. ఆ విషయము తెలిసిన ఇంద్రుడు విశ్వకర్మను పిలచి "మహాశయా! నీవు శంబల నగరమునకేగి అచట స్వర్ణ, రత్న, మణిమాణిక్యములతో ఇండ్లు, ఉద్యానములు, అంబరచుంబిత హర్మ్యములు, దేవాలయములు, రాజభవనములు, నీ నిపుణతనంతయు వినియోగించి నిర్మింపవలసినది. అంత విశ్వకర్మ ఇదంతయు తనపై కలిగిన పరమేశ్వరానుగ్రహముగ తలంచి, శంభల నగరమునకేగి స్వస్తిక, హంస, సింహ, గరుడాది ముఖములు గల అనేక దివ్యభవనములు, వాని పైభాగమున ఉష్ణతను తగ్గించు గవాక్షములు, అనేక లతలు, వృక్షములతో కూడిన వనములు, ఉపవనములు, స్వచ్ఛజల సరోవరములు, ఈవిధముగ ఇంద్రుని అమరావతీ తుల్యమగు భవన సముదాయమును శంభల యందు నిర్మించెను. సేనాపరివేష్ఠితుడై, పద్మ సహితుడై కల్కి కారుమతీ నగరమును వీడి సాగరతీరమున నివాస మేర్పరుచుకొనెను. కౌముదీ, బృహద్రథులు తమ పుత్రిక యందలి ప్రేమచే నూతన వధూవరులకు పదివేల ఏనుగులు, ఒక లక్ష ఉత్తమజాతి హయములు, రెండువేల రథములు, రెండు వందల దాసదాసీ జనములను ప్రసన్న పూర్వకముగ సమర్పించిరి. అంతేకాక అనేక రత్నమాణిక్య సువర్ణాభరణములు, అమూల్య వస్త్రములు బహూకరించి, ఆ నూతన దంపతి వెడలుచుండగా అశ్రుపూర్ణ నయనములతో, పలుకుటకు మాటలురాక శిలాప్రతిమలవలె వీక్షింపసాగిరి. పుత్రికా కన్యాదానము ఎంతటి మహనీయులకైననూ దుర్భరమే కదా! చివరకు లక్ష్మీ, విష్ణురూపులయిన పద్మ, కల్కిలకు వీడ్కోలు పలికి తిరిగి ఆ మహారాజ దంపతి కారుమతీ నగరమునకు ప్రస్థానమయిరి.

పద్మా, కల్కిలు తమ సేనాసంరంభముతో నౌకలు అధిరోహించి సముద్ర తరణమునకు ఉపక్రమించిరి. ఆ సమయమున ఒక శృగాలమరుదెంచి, సముద్ర జలములందు ప్రవేశించి, ఆ ప్రవాహవేగమును నిర్బంధించి, నౌకలు సునాయాసముగ ప్రయాణించుటకు సహాయమొనర్చినది. ఈ శృగాలము ఎంత అదృష్టము చేసికొన్నదో కదా! సాక్షాత్ పరమాత్మకు సహాయమొనర్చు అర్హత ఎంతమందికి కలుగును? నెమ్మదిగ నౌకలు ఆవలితీరము చేరినవి. అంత కల్కి సర్వజ్ఞుని (శుకము) పిలచి "సర్వజ్ఞా! నీవు వేగముగ ఏగి నా తల్లిదండ్రులకు నా వివాహవిశేషములు తెలిపి మానుండి వారికి స్వస్తివచనములు తెలుపవలసినది. అంతేకాక వారికి మా కొరకై విశ్వకర్మచే నిర్మింపబడిన రమణీయ హర్మ్యముల గూర్చి ఎరిగింపుము." అని పలికెను. అంత శుకము రివ్వున ఆకాశమార్గమున కెగిరి అత్యంత వేగముగ శంభల చేరెను. సప్త యోజనముల విస్తీర్ణము, చాతుర్వర్ణ సంకులితము, భానుసదృశ ప్రకాశకము, వందలాది సుందర భవనసంకులము, సర్వ ఋతువులయందు సుఖప్రదమయిన శంబల నగరమును శుకము ప్రవేశించి ఒక భవనము నుండి వేరొక భవనమునకు, ఒక వృక్షము నుండి వేరొక వృక్షమునకు ఎగురుచు, చివరకు ప్రసన్నపూర్వకముగ విష్ణుయశుని గృహము ప్రవేశించి వారందరి హృదయము ఆనందపరవశమగునట్లు కల్కి కళ్యాణ ఘట్టములు వివరించి, వారి ఆగమనము గూర్చి తెలిపెను.

అంత విష్ణుయశుడు ప్రజలందరినీ ఒకచోట చేర్చి వారందరికీ, మరియు విశాఖయూప మహారాజునకు ఈ శుభవిశేషముల నెరింగించెను. అంత విశాఖయూపుడు నగరమునంతట చందన చర్చిత శీతల జలములచే కళ్ళాపి జల్లించి, నగరమందు నవపల్లవ పుష్ప తోరణములు వ్రేలాడదీయించి, అరటి, పోకమానులు రహదారుల ప్రక్కన నిలువరించి, రహదారులు మరియు కూడలులందు దీపస్థంభములు నాటించి, నగరమంతటినీ నవవధువు వలె అలంకరింప జేసెను.

అనంతరము భయంకర సేనాసహితుడై, సర్వులకు నయనానందకరమొనర్చుచూ, పరమసుందరుడు, కారుణ్యసాగరుడయిన కల్కి పద్మ సహితుడై శంభల ప్రవేశించి, తన తల్లిదండ్రుల పాదములు స్పృశించి వందన మొనర్చెను. సుమతి తన పుత్రుని, కోడలిని చూచి ఆనందభరిత అయ్యెను. ఆ సమయమున ఆ పుణ్యవనిత పూర్ణకామ, ధర్మాత్మ, అయిన అదితీదేవి వలె శోభిల్లెను. ఆ సమయమున ధ్వజ, పతాకయుక్త అంత:పురములనెడు సుందర నితంబము, విశాల భవన సముదాయములనెడి స్థనములు, నెమళ్ళనెడు స్థనాగ్రములు, హంసల సమూహములనెడు హారములు, సుగంధపదార్ధ ధూపమనెడు వస్త్రము, కోకిలలనెడు పలుకులు, హంసిని వంటి నగరద్వారము గల ముఖము, గల శంభల నగరము కల్కిని పాలకునిగ ప్రాప్తించి గుణవతి, కమలదళాయతాక్షి అయిన సుందర స్త్రీమూర్తి వలె శోభిల్లెను.

తదుపరి కలి వినాశకారి అయిన కల్కి పద్మ సహితుడై, మాయాశ్రితుడై సర్వమును మరచి పద్మాదేవితో కలిసి అనేక వత్సరములు రమించెను. ఆ సమయమందు కల్కి సోదరుడయిన కవికి తన పత్ని అయిన కామకళ యందు పరమ ధార్మికులు, అద్భుత బలశాలురు, మహాపరాక్రమోపేతులయిన "బృహత్కీర్తి", "బృహద్బాను" అను ఇరువురు పుత్రులుదయించిరి. ప్రాజ్ఞునికి సన్నతి యందు లోకపూజితులు, ఇంద్రియనిగ్రహులైన "యజ్ఞ, విజ్ఞ" లను ఇరువురు పుత్రులు కలిగిరి. సుమంత్రునికి మాలిని యందు సజ్జనులకు ఉపకారమొనర్చు "శాశనుడు", "వేగవంతుడు", అను ఇరువురు పుత్రులుదయించిరి. తదుపరి కల్కి, పద్మలకు అత్యంత బలశాలురు, జగత్ర్పసిద్ధులయిన జయ, విజయులను ఇరువురు పుత్రులు కలిగిరి. ఆ సమయమున కల్కి తండ్రి అయిన విష్ణుయశునకు అశ్వమేధయాగము చేయవలెనన్న కోరిక కలిగెను. సర్వ సంపదలచే తలతూగుచున్న కల్కి చతుర్ముఖ బ్రహ్మ వలె వెలుగొందుచున్న తన తండ్రి యొక్క కోరికను గ్రహించి ఆయనతో ఇట్లనియె "తండ్రీ! నేను దిక్పాలురందరనూ జయించి, ధనమునంతటినీ సంగ్రహించి, మీ ద్వారా గొప్ప అశ్వమేధయజ్ఞము కావించెదను."

ఈవిధముగ పలికి సేనలను, సేనాపతులను సన్నద్ధమొనరించి, మొదట "కీకట దేశము"పై దండెత్తెను. ఆ కీకట దేశమంతటా విశాలమయిన బౌద్ధాలయములు, బౌద్ధ మతములు, తో నిండి వైదికధర్మమును సంపూర్ణముగ భహిష్కరించిరి. వారు దేవపూజలు, పితృపూజలు, పారలౌక క్రియలను నమ్మరు. పరలోకమనునది వారికి నేతిబీరకాయ వంటిది. వారికి శరీరమే ఆత్మ. వారికి జాతి, మత, కుల భేదములు లేవు. ధనము, స్త్రీలు, తినుబండారములు, ఇవన్నియు కేవలము భోగ్యవస్తువులే! వీరికి పునర్జన్మ యందు ఎంతమాత్రము నమ్మకము లేదు. కర్మఫలములందు, పరలోకము నందు ఏవిధమయిన నమ్మకము అంతకంటే లేదు. వీరందరూ నిరంతర సాంసారిక భోగతత్పరులు. సర్వకాల సర్వావస్థల యందునూ ఇంద్రియ భోగములే పరమావధి అను దుష్కర్ములు. "జినుడు" ఈ కీకటదేశమున కధిపతి. కల్కి సేనాసహితుడై తమ నగరము నాక్రమించెనని తెలిసి అగ్రహోదగ్రుడై రెండు అక్షౌహిణీల సేనతో కల్కితో యుద్ధమునకు నగరము బయటకు ఏతెంచెను. ఆ సమయమున ఇరుసేనలు చతురంగ బలములతో సర్వాభరణ భూషితులై, అస్త్రశస్త్రధారులై, బలిసిన అంగప్రత్యంగములు కలవారలై, సూర్యతాపమును భేదించు ధ్వజ పతాకయుక్తములయిన రధములధిరోహించి యద్ధసన్నద్ధులయిరి.

(శ్రీకల్కి పురాణమందు ద్వితీయాంశ యందలి బుద్ధ నిగ్రహ కీకట పురాగమనము అను ఆరవ అధ్యాయము సమాప్తము)

ఏడవ అధ్యాయము

(బౌద్ధ యుద్ధము)

కలి వినాశకుడు, సర్వులను జయించు ఇచ్ఛ కలవాడు, విష్ణురూపుడయిన కల్కి సేనాగ్రభాగమున మదించిన మత్తేభము నెదరించు పంచాస్యము వలె నిలబడి తన తీక్షణ, రూక్షణ సాయకములచే బౌద్ధసేనను చిందరవందర కావించెను. అంత బౌద్ధసేన అంతయు రక్తవర్ణముతో రెపరెపలాడుచున్న చీరకట్టి, విశాలమయిన నడుము, ఎగురుచున్న ముంగురులు కలిగి వేదనతో భయంకరారావము కావించుచున్న మానినీమూర్తి వలె కానబడినది. పలాయన మొనర్చుచున్న బౌద్ధసేనను గాంచి కల్కి "పారిపోవలదు, వెనుకకు రావలసినది. యుద్ధమొనర్ప వలసినది. మీ పరాక్రమము చూపింపవలసినది" అని కవ్వించెను. అంత కీకట దేశాధీశుడు జినుడు రోషయుక్తుడై, పరాక్రమవంతుడై ఒక ఎద్దునెక్కి కరవాలము, డాలును చేతియందు ధరించి తిరిగి సమరాంగణము ప్రవేశించెను. అనేక అస్త్రశస్త్రముల ధరించి, వాని ప్రయోగము నందు ప్రవీణుడయిన జినుడు ధైర్యము బూని సమరమొనర్చి దేవతలను సహితము దిగ్భ్రాంతుల నొనర్చెను. జినుడు కల్కి యొక్క అశ్వము గారుడమును తీవ్ర సాయకములతో గాయపరచి, కల్కిని మూర్ఛితుని కావించెను. కల్కి క్రిందపడెను. అంత కల్కిని లేవదీసి, బంధితుని గావించి తన కోటలోనికి తీసుకొనిపోవు ప్రయత్నము కావించెను. కానీ కల్కిని లేవనెత్తలేక "ఈతడు ఈ సంసారము యొక్క పాలన, పోషణ కావించువాడు" అని తెలిసికొని మూర్ఛితుడయిన కల్కి యొక్క కవచమును, శస్త్రములను ముక్కలు ముక్కలు కావించెను.

ఆ దారుణకృత్యమును గాంచిన విశాఖయూప మహారాజు పరుగున ఏతెంచి, ఒక గదతో తీవ్రముగ జినునిపై ప్రహారము కావించి మూర్ఛితునొనర్చెను. అటుపిదప కల్కిని అవలీలగా ఎత్తి, తన రథమందు చేర్చి అచట నుండి దూరముగ గొనిపోయెను. భగవానుడు భక్తసులభుడు కదా! ఇంతలో కల్కి మేల్కొని, విశాఖయూపుని రథము నుండి క్రిందికి దూకి జినుడున్న ప్రదేశమునకు పరుగెత్తెను. తనను హింసించిన బౌద్ధసేనపై కినుక వహించి ఆ సేననంతటినీ కాళ్ళతో తన్నుచూ, దండముతో ప్రహారమొనర్చుచూ, కేశములు పట్టి ఈడ్చుచూ, బౌద్ధసేనా సంద్రమందు తిమింగళము వలె కలదిరిగి వేలాది సైనికులను హతమార్చెను. కల్కి యొక్క నిశ్వాస వేగమునకు కొంతమంది సైనికులు వేరొక ద్వీపమందు పడిరి. రథ, గజ, హయములు యుద్ధక్షేత్రమందే క్రిందపడిరి. ఆ సమరమందు గార్గ్యుడు డెబ్బదివేల మందినీ, భర్గ్యుడు ఒక కోటిమందినీ, విశాలుడు ఏబదివేల మందినీ, బౌద్ధ సైనికులను పరిమార్చిరి. కవి తన పుత్రసహితుడై ఇరువదివేల మందినీ, ప్రాజ్ఞుడు పదిలక్షలమందినీ, సుమంత్రకుడు అయిదులక్షలమంది సైనికులను వధించిరి.

ఇంతలో కల్కి, జినులిరువురు ద్వంద్వ యుద్ధమునకై ఒకరి ఎదురుగ ఒకరు నిలబడిరి. కల్కి నవ్వుతూ "ఓరీ! దుర్మతీ! నిలు నిలు. చేసిన కర్మల శుభాశుభ ఫలితములను జీవులనుభవించవలసినదే! నీవు నా సాయక వర్షముచే విచ్ఛిన్న శరీరుడవై, ఏకాకివై, ఎవ్వరును తోడులేక మృత్యుగృహమున కేగుదువు. అందువలన నీవు ఇపుడే నీ ప్రియబంధు, మిత్ర, బాంధవులను వీక్షింపవలసినది" అని పలికెను. అంత జినుడు హేళనగా నవ్వుచూ "మేము ప్రత్యక్షముగ కనిపించిన దానినే విశ్వసించెదము. మా శాస్త్రములు సహితము ప్రత్యక్షము కానివానిని అంగీకరింపవు. నీవు సమరమందు నన్ను హతమార్చినప్పటికీ మా బౌద్ధులెవ్వరూ మీ అప్రత్యక్ష వాదమును స్వీకరింపరు. నాఎడల నీవు కావించిన నిందా వాక్యములను నీవద్దనే యుండనిమ్ము. ఇంచుక ధైర్యము వహించి నా పరాక్రమము సహితము చవిచూడుము" అని పలికి క్రోధానిలుడై కల్కిని భయంకర బాణవర్షముచే ముంచెత్తెను. కానీ సూర్యుడు మంచును ఎగురగొట్టునటుల కల్కి ఆ బాణవర్షమును చెల్లాచెదురు కావించెను. జినుడు బ్రహ్మాస్త్రము, వాయువ్యాస్త్రము, ఆగ్నేయాస్త్రము, పర్జన్యాస్త్రము మొదలగు అనేక

అస్త్రములను కల్కిపై ప్రయోగించెను. అవన్నియు బంజరుభూమిపై పడిన బీజముల వలె, అశ్రోత్రియునకు కావింపబడిన అపాత్రదానము వలె, సజ్జన ద్వేషముతో పరిపాలింపబడిన విష్ణుభక్తి వలె, కల్కిని దర్శించుటతోడనే భస్మీపటలమయినవి. అటుపిదప కల్కి జినునిపై దూకి ఆతని కేశములు పట్టి బలముగ లాగెను. అంత ఇరువురు బలిష్ఠమయిన మృగముల వలె క్రిందపడిరి. తిరిగి లేచి చాణూర కృష్ణుల వలె శస్త్రములు వదలి బాహాబాహీ మల్లయుద్ధ మొనర్పమొదలిడిరి. కొంతసేపటికి కల్కి మదోన్మత్తమయిన మత్తేభము తాళ వృక్షమును చరిచినటుల జినుని నడుముపై తన అరచేతితో ప్రహరించెను. జినుడు రెండు ముక్కలై నేలపై బడెను.

జినుడు పరాజితుడగుట గాంచి బౌద్ధసైన్యము హాహాకారము లొనర్చినది. జినుడు హతుడగుటచే క్రోధానిల సంతప్తుడయిన ఆతని సోదరుడు శుద్ధోధనుడు గదాధారియై కల్కిని సంహరించుట కేతెంచెను. కానీ శత్రుహంత అయిన కవి నలుప్రక్కలా బాణవర్షము కురిపించుచూ శుద్ధోధనుని ఆపి కుంజరముపై లంఘించు సింహము వలె గర్జించెను. రథారూఢుడు కాక భూమిపై నిలచిన శుద్ధోధనుని గాంచి ధర్మజ్ఞుడయిన కవి తాను సహితము రథము దిగి గదాధారియై ఆ బౌద్ధుని కెదురునిలచెను. వారిరువురు మదించిన ఏనుగులవలె సమరమొనర్చిరి. మహా పరాక్రమవంతులు, గదాయుద్ధ నిపుణులు అయిన వారిరువురు ప్రహారములు సహించుచు, ప్రత్యర్థిని మర్దించుచూ, భయంకర ఛీత్కారము లొనర్చుచూ, ఒకరిపై ఒకరు విజయమునకై ప్రాణములొడ్డి పోరాడుచుండిరి. కవి అత్యంత భారము, భయంకరమయిన తన గదను గిరగిరా త్రిప్పుచూ శుద్ధోధనునిపై ప్రహరించి, ఆతని చేతి యందలి గదను క్రింద పడవైచునట్లు చేసి, అదే వేగముతో శుద్ధోదనుని వక్షముపై ప్రహరించెను. శుద్ధోధనుడు ఒక్క క్షణము మూర్ఛిల్లి, క్రిందపడి, తేరుకొని, వెంటనే తిరిగి లేచి తన గదను గ్రహించి తిరిగి కవి యొక్క శిరముపై ప్రహరించెను. ఆ ఘాతముచే కవి నిర్భ్రాంతుడై, వ్యాకులుడై, నిశ్చేష్ఠితుడై, స్థంభము వలె జడీభూతుడయ్యెను.

మహాపరాక్రమోపేతుడయిన కవి పదివేల రథములచే పరివేష్ఠితుడగుట గమనించి శుద్ధోదనుడు మాయాదేవిని మేల్కొలుపుట మొదలిడెను. ఆ మాయాదేవి దర్శనమాత్రమున దేవాసుర మానవాదులు పరాక్రమ రహితులై శిలాప్రతిమల వలె జడులగుదురు. అంత మాయాదేవిని మందునుంచుకొని శుద్ధోధనుని బంధువులు, కోట్లాది బౌద్ధులు, లక్షలాది మ్లేచ్ఛులు, తిరిగి సమరాంగణమున కేతెంచిరి. సింహపతాక యుక్తమయిన రథమునందు నెలకొని వేలాది కాకులు, నక్కలచే పరివృతయై, అరిషడ్వర్గ సమూహముచే సేవింపబడుచూ, అనేక అస్త్రశస్త్రములను ఉత్పన్నమొనర్పగల మాయాదేవిని ముందునుంచుకొని బౌద్ధసేన ముందుకురికిరి. అనేక రూపధారిణి, బలశాలినీ, త్రిగుణములను వ్యక్తీకరింపగల మాయాదేవిని కాంచి కల్కి యొక్క సేన క్రిందపడిరి. తన పత్ని అయిన మాయాదేవిచే క్షీణింపబడి, చిత్తరువులవలె నేలబడియున్న తన సేనను కాంచి సర్వవ్యాపి అయిన కల్కి ముందుకు వచ్చెను. సర్వులకు స్వామి, విష్ణు స్వరూపుడు, తన ప్రియుడయిన కల్కిని చూడగనే మాయ బౌద్ధసేనను విడచి కల్కి శరీరమందు ప్రవేశించెను. అంత మాయాదేవిని కానక బౌద్ధ, మ్లేచ్ఛాదులందరూ పౌరుషవిహీనులై రోదింప మొదలిడిరి. కల్కి తన కృపాకటాక్ష వీక్షణములచే తన సేననంతటినీ తిరిగి చేతనాయుక్తుల గావించెను. అంత కల్కి శివదత్తము, అతి భయంకరమయిన చంద్రహాసమును కరమున దాల్చి, గారుడము నధిరోహించి బౌద్ధులను సంహరించుటకు నిశ్చయించెను.

అంతేకాక తన హస్తములందు భయంకర చాపము ధరించి, తారలవంటి బంగారు బిందువులు తాపడము చేయబడిన కవచధారియై, కోట్లాది మణిముత్యములు కలిగిన కిరీటము ధరించి, సర్వానందప్రదుడు, మరియు ఆనందమునకు నివాసస్థానము అయినవాడు, శత్రుసేనల కకావికలు కావింపగల సమర్థుడు, తన భక్తులకు ఆనందము కలిగించువాడు, కమలలోచనుడు, కమలచరణుడు, అయిన కల్కిని గాంచి ధర్మనిందకులయిన బౌద్ధులు భయభీతులయిరి.

కల్కి యొక్క నిశ్చయమును గాంచిన దేవతానీకము అత్యంత హర్షోల్లాసులయిరి. అద్వితీయుడు, శ్రేష్ఠ సేనాయుతుడు, శత్రునాశకుడు, మహా సంగ్రామమును మనోరంజకముగ భావించువాడు, సజ్జన రక్షణకై అవతారములు గొనువాడు, తన భక్తుల దురలవాట్లను తొలగించువాడు, సమస్త ప్రాణుల పాలన, పోషణ కావించువాడు అయిన కల్కి భగవానుడు మిమ్ము రక్షించుగాక.

(శ్రీకల్కి పురాణమందు ద్వితీయాంశయందలి బౌద్ధ యుద్ధము అను ఏడవ అధ్యాయము సమాప్తము)

తృతీయాంశము

ఒకటవ అధ్యాయము

(మ్లేచ్ఛ నిధనము)

సూతుడు "కల్కి భగవానుడు కరాళ కరవాలధరుడై మ్లేచ్ఛులపై స్వైరవిహారము కావించి, వారి శరీరములను ఖండఖండములు కావించెను. ధనువు సారించి బాణపరంపరలు కురిపించి వారి సేనలను తుత్తునియలు కావించెను. విశాఖయూపుడు, కవి, ప్రాజ్ఞుడు, సుమంత్రకుడు, గార్గ్య భర్గ్యులు, విశాలుడు సహితము తమ సహాయమొనర్చి మ్లేచ్ఛులను యమపురికంపించిరి. కపోతరోముడు, కాకాక్షుడు, కాకకృష్ణుడు, మొదలగు శుద్ధోధనుని అనుయాయులేతెంచి యద్ధమొనర్ప మొదలిడిరి. ఆ సమరము భయంకరరూపు దాల్చినది. ఎక్కడ చూచిననూ పీనుగుల పెంటలు, రక్తమాంసముల బురద, రక్త ప్రవాహములతో రుధిరసరిత ఏర్పడినది. వీరుల ప్రహారములకు రాలుచున్న ఏనుగులు, క్రిందపడుచున్న హయములు, ముక్కలగుచున్న రథములు, ఖండితులగుచున్న పదాతులు, ఆ రుధిరసరిత యందు మునుగుచూ, తేలుచూ కొట్టుకొని పోవుచుండిరి. ఆ ప్రవాహమందు ధనస్సులు తరంగముల వలె, ఖండిత శిరములు తాబేళ్ళవలె, చేతులు మత్స్యముల వలె, కానపట్టుచున్నవి. భైరవ, భేతాళ, పిశాచ గణములు నృత్యమొనర్చుచూ రుధిరపానమొనర్చుచున్నవి. నక్కలు వికృతముగ ఊళలు వేయుచున్నవి. ఆ భయంకర దృశ్యము వీరులకు హృదయానందకరము, భీరువులకు హృదయ విదారకముగనూ తోపుచున్నది. ఏనుగులు ఏనుగులతోనూ, అశ్వికులు అశ్వికులతో, ఇట్లు చతురంగ బలములు తమకు సములతో యుద్ధమొనర్చి సమసిపోయిరి. నలువంకలా బాణప్రహారములతో గాయపడిన గజాశ్వ పదాతులే! ఎక్కడ చూచిననూ ఖండిత శిరములు, మొండెములు, కాళ్ళు, చేతులు, శిరములే! వీరులందరూ ధూళిదూసరయుక్తులై, రక్తముచే తడుపబడి కాషాయములు ధరించిన సన్యాసుల వలె కానబడుచుండిరి. భయభీతులైన మ్లేచ్ఛులు కొందరు వెన్నుచూపిరి, కొందరు శరణాగతులైరి, ఎటుచూసిననూ మ్లేచ్ఛులకు, బౌద్ధులకు కల్కిసేనలనెడి అగ్నివర్షము నుండి శాంతి లభింపలేదు.

ఇంతలో మ్లేచ్ఛస్త్రీలు రథాశ్వములు, గజములు, పక్షులు, ఒంటెలు, గాడిదలు, అధిరోహించి సమరాంగణమున కేతెంచిరి. వారందరూ ఖడ్గ, తోమర, గద, ధనుష్పాణులై, కవచధారులై, సువర్ణాభరణ భూషితలై ఉజ్వలకాంతితో ఒప్పారుచుండిరి. వారిలో కొందరు పతివ్రతలు, కొందరు కాముక స్త్రీలు, కొందరు వేశ్యలు, మరికొందరు వ్యభిచారిణులు. వారందరూ తమ పతుల, పుత్రుల, సోదరుల మరణమునకు ప్రతీకారముగ కల్కిపై, ఆయనసేనపై, అత్యంత కృద్ధులై యుండిరి. శాస్త్రానుసారము అతి పేలవమయిన మట్టి, భస్మము, చక్కవస్తువులు, చిత్రవిచిత్రములయిన అల్ప విషయములకై జనులు తమ ప్రాణములు త్యజించుచున్నారు. మరి తమ పతులను, పుత్రాదులను కోల్పోయిన పడతులు క్రోధముపూనుట యందు ఆశ్చర్యమేమున్నది? ఈవిధముగ ఆయుధపాణులై ఆ స్త్రీలందరూ కల్కి సైన్యముపై విరుచుకుపడిరి. ఆ స్త్రీసేనను కాంచి కల్కి సైన్యమందలి యోధులందరూ ఆశ్చర్యచకితులై సమర మాచరించుటయా లేక విరమించుటయా! ఏదియునూ తెలియక కల్కి భగవానుని వద్ద కేతెంచిరి. దీనినంతటినీ వినిన కల్కి ఆ విడ్డూరమును తిలకించుటకు తానునూ రథారుఢుడై యుద్ధక్షేత్రమున కరుదెంచి వివిధాయుధ సంపన్నులై, వివిధ వాహనముల నధిరోహించిన వీర వనితల నుద్దేశ్యించి ఇట్లనియె "ఓ! శూర వనితలారా! ఉంగరములు తిరిగిన సుందర ముంగురులు కలిగి హృదయానందప్రదాతలు, చంద్రముఖులైన మిమ్ము శస్త్రములచే ఎవరు ప్రహరింపగలరు? అరవిరిసిన కమలముల శోభాసదృశములు, మెరయుచున్న అయస్కాంతముల వంటి చంచల నేత్రములు గల కమలనయనలకు ఎవరు కష్టమొనరింపగలరు? మధుర మలయమారుత వీవనముచే సుకుమారముగ కదులాడుచున్న ముంగురులను చకోరములచే చుట్టుముట్టబడిన మీ పూర్ణచంద్రుని తలపించు ముఖములను గాయపరచుట అను పాపకార్యము ఎవరాచరింపగలరు?

ఘన స్థనభారముచే కందుచున్న మీ సన్నని నడుము, త్రివళీయుతమయిన మీ సుతిమెత్తని ఉదరముపై ఏ పురుషుడు ప్రహరింపగలడు? నేత్రానందకరము, పట్టువస్త్రముచే చుట్టబడిన నిష్కళంక సుందర నితంబమును వీక్షించుట తప్ప బాణ సముదాయమును ఎవరు ఎక్కుబెట్టగలరు?"

ఈ విధమయిన కల్కి యొక్క కర్ణపేయములు, మృదుమధుర వచనములు వినిన ఆ చిగురుబోడులు "హే! విభూ! మీరు మా పతులను సంహరించి మమ్ములను తొలుతనే హతమార్చిరి" అని పలికిరి. అంతలో ఒక చిత్రము జరిగినది. అంతకుమున్ను ఆ స్త్రీసమూహములన్నియు కల్కి భగవానుని నిర్జించుటకు విసిరిన ఆయుధములన్నియు తిరిగి వారి హస్తములనలంకరించి, ఆ ఆయుధములన్నియు మూర్తి రూపములు ధరించి ఇట్లు పలికినవి "ఓ! కమలాక్షులారా! ఎవరి తేజస్సుచే మాకు ఇతరుల నిర్జించు శక్తి ఉత్పన్నమయినదో ఆయనను మీరు పరమాత్మ, సర్వమయునిగా తెలిసికొనవలసినది. ఎవని ద్వారా మేము సృజింపబడి నామరూపముల నొందితిమో, ఎవరి శక్తిచే మేము చలించుచున్నామో ఆయనను ఈశ్వరునిగ తెలియవలసినది. ఎవరు పంచభూతాత్మకమయిన ఈ జగత్తుయై శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములనెడు తన్మాత్రలకు అధిష్ఠాత అయిన పరమాత్ముడో ఆ పరమాత్మయే ఈ కల్కి భగవానుడు. ఈయన ఇచ్ఛ చేతనే కాలము, స్వభావము, సంస్కారము, నామాదులు గల పరాప్రకృతి (మూల ప్రకృతి), మహత్తత్వము, అహంకారము, బ్రహ్మాండము, ప్రజాపతి (బ్రహ్మ), యొక్క రచన కావింపబడును. ఈయన మాయచే సృష్టిస్థిత్యంతములు అను సంసారయాత్ర జరుగుచుండును. ఈ సంసారమునకు మూలము ఈయనే!! ఈ పరమపురుషుడు సృష్టికి పూర్వము, ప్రళయానంతరము సహితము యుండుటచే ఈయనను "ఈశ్వరుడు" అని వక్కాణింతురు. "ఈతడు నా భర్త, ఈమె నా భార్య, వీరు నా సంతానము, వీరందరూ నా బంధుబాంధవులు" అను బంధములన్నియు స్వప్నతుల్యములే! ఈయన మాయచే కనిపించు ఈ నానావిధ వస్తుజాలము అంతయు మిధ్య లేక ఇంద్రజాలము. స్నేహ, మోహములను నియంత్రించువారు, జన్మ మృత్యువులను కేవలము ఒక మార్పుగా స్వీకరించువారు, రాగద్వేషముల కతీతులు, ఈ సంసారమును మిధ్యగా భావించి తదనుకూల వ్యవహారమును అనుసరించువారు మాత్రమే కల్కి యొక్క భక్తులు లేక సేవకులు. ఈ కాలము ఎప్పుడు మొదలయినది? మృత్యువు ఎక్కడి నుండి ఏతెంచినది? యముడెవరు? దేవతలు ఎక్కడ యుండిరి? ఇవన్నియు కూడా కేవలము కల్కి భగవానుని మాయయే! ఓ! ఇంతులారా! మేము శస్త్రములము కాము. మేము ఎవరిపై ప్రయోగింప అనర్హులము. ఈ నామరూప భేదమంతయు మిధ్యయే! ఓ! పూబోణులారా! మీకొక ఆశ్చర్యమును తెల్పెదము. దైత్యచక్రవర్తి హిరణ్యకశిపుని నుండి విష్ణుభగవానుడు ప్రహ్లాదుని రక్షించెను. ఆ సమయమున జరిగిన సమరమందు దైత్యపతి లక్ష్మీపతిపై మమ్ము (ఆయుధములను) ప్రహరించెను. కానీ మేము ఆ పరమాత్ముని ప్రహరింపలేకపోతిమి. అట్లే ఇపుడు ఈ కల్కి భగవానుని సేవకులపై (సేనలపై) సహితము మేము ప్రహారమొనర్పలేము."

ఈ పరమాశ్చర్య సంవాదమును వినిన మ్లేచ్ఛ వనితలందరూ స్నేహ, మోహములను వీడి కల్కి భగవానుని శరణమొందిరి. జ్ఞానశ్రేష్ఠులయిన ఆ వనితలందరినీ వీక్షించి పద్మాపతి అయిన కల్కి శుచిస్మితుడై, వారికి నిష్కామకర్మయోగమును, భక్తియోగమును, అజ్ఞానమును నాశమొనర్చు జ్ఞానయోగమును బోధించెను. కల్కి ద్వారా తెలుపబడిన యోగము ద్వారా ఆ చెలువలందరూ ఇంద్రియములను జయించి, తీవ్ర భక్తియోగము నవలంబించి, పరమ యోగులకు సహితము దుష్ప్రాప్యమగు సర్వోత్తమ పదము (మోక్షము) నొందిరి. భయంకర కృత్యము లొనరించు కల్కి భగవానుడు ఈ విధముగ బౌద్ధులు, మ్లేచ్ఛులను సంహారమొనర్చి, వారందరినీ తన జ్యోతిస్వరూపమందు విలీనమొనర్చి, వారి ప్రియపత్నులకు మోక్షము ప్రసాదించెను. కష్టనివారకము, పరమ కళ్యాణకరము, నిరంతరము విష్ణుభక్తిని ప్రసాదించునది సర్వసంపదలను ఒసంగునది, మాయా మోహములను నష్టమొనర్చునది అయిన బౌద్ధమృత్యు విషయకము, మ్లేచ్ఛ వినాశకము అను ఈ ఆఖ్యానమును ఏ జనులు ప్రతిదినము వినెదరో, లేక వినిపించెదరో వారికి పునర్జన్మ యుండదు.

(శ్రీకల్కి పురాణమందు తృతీయాంశ యందలి మ్లేచ్ఛ నిధనము అను ఒకటవ అధ్యాయము సమాప్తము)

రెండవ అధ్యాయము

(కుతోధరి వధానంతర ముని దర్శనము)

సూతుడు "ఈ విధముగ బౌద్ధ, మ్లేచ్ఛ సేనా సమూహముల దునుమాడి, విజయమంది, అచట గల ధన రత్న రాశులను మరలించి, తిరిగి వెనుకకు బయలుదేరెను. లోకపాలురవంటి సోదర సహితుడై, తన సేనలన్నింటితో కలసి పరమ తేజస్వీ, ధర్మరక్షకుడయిన కల్కి చక్రతీర్థమందు స్నానమాచరించెను. ఆ సమయమున అచటికి దు:ఖార్తులయిన అనేకమంది మునులేతెంచిరి. వారందరూ జటావల్కలధారులు, భయముచే కృశించిన శరీరము కలవారు, అతిచిన్న శరీరులైన వాలఖిల్యాది ఋషులు. వారు "ఓ! జగత్పతీ! మమ్ము రక్షింపవలసినది. మిమ్ము శరణునొందుచున్నాము" అని ముక్తకంఠముతో పలికిరి. కల్కి వారందరినీ కాంచి, అంజలి ఘటించి వినమ్రుడై ఇట్లనియె "మహర్షులారా! మీ ఆగమనమునకు కారణమేమి? మీ భయమునకు కారణము తెలుపవలసినది. మీ భయకారకుడు ఇంద్రుడయిననూ వానిని నిర్జించెదను." అంత వారందరూ ప్రసన్నులై కమలనయనుడయిన కల్కికి నికుంభతనయ అయిన "కుతోధరి" యొక్క వృత్తాంతమును తెలుపసాగిరి. "ఓ! విష్ణుయశపుత్రా! కుంభకర్ణునకు నికుంభుడు అను పుత్రుడు కలడు. వానికి కుతోధరి అను పుత్రిక కలదు. ఆమె బృహత్కాయని. ఈమె ఆకాశమంత ఎత్తు యుండును. ఆమె కాలకుంజుడు అను దనుజుని పరిణయమాడి వికుంజుడు అను పుత్రునకు జన్మనిచ్చెను. ఈమె వికుంజునకు స్థనపాన మిచ్చుటకై విశ్రమింప ఈమెశిరము హిమాలయములందు, పాదములు నిషధ పర్వతమందు యుండును. ఆమె ఉచ్ఛ్వాస, నిశ్వాసములు భరింపలేక మేము ఇచటి కేతెంచి, మా భాగ్యవశమున మీ చరణకమలములు దర్శింప గలిగితిమి. మునులను రాక్షసుల మరియు విపత్తుల బారినుండి రక్షించు భారము మీదే!"

ఈ విన్నపముల నాలకించిన కల్కి వెంటనే తన సేనలను తీసికొని హిమాలయ పర్వతప్రాంతమున కేగెను. వారు హిమాలయ ప్రాంతము చేరుసరికి సాయంత్రమగుటచే ఆ రాత్రికి వారందరూ అచటనే విశ్రమించిరి. మరునాడు ఉదయము వారందరూ లేచి ఒక పాలనదిని కాంచిరి. శంఖము, పున్నమిచంద్రుని వంటి తెల్లదనముతో నురుగులు గ్రక్కుచూ వేగముగ ప్రవహించుచున్న ఆ దుగ్ధసరితను కాంచి సర్వులు ఆశ్చర్యచకితులైరి. కల్కి చతురంగబలములు, సేనాదళములచే పరివేష్ఠితుడై సర్వము తెలిసినప్పటికీ ఏమీ తెలియనివానివలే అచటగల మునులను "ఈ నది ఏమి? ఈ విధముగ పాలు ప్రవహించుటకు కారణమేమి?" అని ప్రశ్నించెను. అంత మునులు "ఓ! కల్కీ! ఈ నది హిమాలయములందు ఉత్పన్నమయినది. ఈ పాలు కుతోధరి యొక్క స్థనముల నుండి స్రవించుచున్నవి. ఇయ్యది ఏడు ఘడియలు ఇట్లు ప్రవహించి, అటుపిమ్మట శాంతించి ఒక తటము వలె ఒప్పును. ఆ సమయమున రెండవ దుగ్ధ సరిత ప్రారంభమై వేగముగ ప్రవహించును" అని పలికిరి.

అంత సర్వులు ఆశ్చర్యచకితులై "ఏమీ! ఒక రక్కసి యొక్క ఒక్క స్థనము నుండి వెలువడిన పాలచే ఈ నది ఏర్పడెనా? పుత్ర స్నేహవశమున కుతోధరి వికుంజునకు స్థనపాన మిచ్చుచున్నది. ఇక ఈ రక్కసి యొక్క పరిమాణ మొంతయుండియుండును?" అని దిగ్భ్రాంతి నొందిరి. అంత కల్కి కవచధారియై, ఆయుధములు ధరించి, అస్త్రశస్త్రములు సజ్జితము గావించి సైనిక సహితుడై రాక్షసి వద్దకరిగెను. మునుల ద్వారా తెలుపబడిన మార్గముగుండా వారు ఏగి కాలమేఘసదృశ అయిన కుథోధరి ఒక పర్వతచరియ వద్ద విశ్రాంతి తీసికొనుట గమనించిరి. ఆ రక్కసి యొక్క నిశ్వాసములచే ఏనుగులు సహితము దూరముగ ఎగిరి పడుచున్నవి. ఆమె కర్ణ కుహరములందు సింహములు నివాసమేర్పరుచుకొన్నవి. ఆమె శిరోజములను గుహలనుకొని హరిణ సమూహములు అందు పుత్రపౌత్రాదుల సహితలై నివసించుచున్నవి. ఆ పర్వతలోయ యందు రెండవ పర్వతము వలె భాసించుచున్న ఆ రాక్షసిని చూచి కల్కి సైనికులు భయముచే వ్యాకులులై,

బుద్ధివిహీనులై, తమ అస్త్రశస్త్రములను విడుచుటకు తత్పరులైరి. అంత కల్కి వారందరినీ చూచి ఇట్లు ధైర్యవచనములు పలికెను "నాతో అరుదెంచిన సేనాసమూహములారా? మీరందరూ ఇచటనే యుండి, మీచుట్టూ ఒక అగ్నిదుర్గము నిర్మించుకొని సురక్షితులై యుండవలసినది. నేను కొద్దిమంది సైనికులతో కలసి ఈ రక్కసిని మట్టుబెట్టుట కేగెదను."

అటుపిదప సింహ పరాక్రముడయిన కల్కి ఆ రక్కసికి ఎదురేగి బాణవర్షము కురిపించుట ప్రారంభించెను. అకస్మాత్తుగా పిడుగుల వంటి బాణములు పడుచుండుటచే కుతోధరి ఒక్క ఉదుటున లేచి క్రోధోద్రిక్తయై విచిత్రముగ రంకెలువేయుట మొదలిడెను. ఆ భయానక ఆరావములచే కల్కి సేనలన్నియు భయభీతులై, అనేకమంది సైనికులు మూర్ఛనొందిరి. అంత ఆ భయంకర రక్కసి విశాలమయిన తన ముఖమును తెరచి, తన నిశ్వాసముచే రథ, గజాశ్వములను ఒకచోటికి చేర్చి వారిని భక్షించుట ఆరంభించెను. ఎలుగుబంటి నోటిచే పీల్చబడు వాయువుచే అద్దాని ముఖమందు ప్రవేశించు కీటక సమూహముల వలె కల్కి సేనలన్నియు కుతోధరి ముఖము ప్రవేశించుచున్నవి. కల్కి సహితము తన సేనలతో ఆ రక్కసి ఉదరము ప్రవేశించెను. ఈ అకృత్యమును కాంచి దేవగంధర్వాదులు హాహాకారము లొనర్చిరి. కొందరు మునులు శాపములిడిరి. మరికొందరు జపమొనర్చుట మొదలిడిరి. వేదాధ్యయనము, అధ్యాపనము కావించు బ్రాహ్మణులు దు:ఖపీడితులై మూర్ఛనొందిరి. బ్రతికి బయటపడిన కలి సైనికులు రోదించుట మొదలిడిరి. నిశాచరులు ఆనంద పరవశులయిరి. ఈ దృశ్యమంతటినీ తిలకించుచున్న కమలనేత్రుడు, రాక్షస వినాశకుడు అయిన కల్కి తన ఆత్మ స్వరూపమును స్మరించెను. తదుపరి తన బాణములచే అగ్నిని రగల్చి అందు కాష్ఠములు, వల్కలములు వైచి ఆ అగ్నిని పెనుమంటగా మార్చెను. పిదప శివకృత కరవాలమును చేతధరించి, ఆ రక్కసి ఉదరమును ఖండించి, సేనాసంబంధుల సహితుడై కల్కి బయటకు ఏతెంచెను. ఆ సమయమున ఆయన వృత్రాసురుని కంఠమును ఖండించి బయటకు ఏతెంచిన పురంధరుని వలె శోభిల్లెను. కుతోధరి శరీరము నుండి రుధిరము కాల్వలై ప్రవహించుచుండెను. బయటపడిన సేనా సమూహములు ఆ రక్కసిపై బాణ పరంపరలు కురిపించి ఆమెను మిక్కిలి గాయపరచిరి. శరీరమంతయు ముక్కలు ముక్కలై భూనభోంతరాళములు ప్రతిధ్వనించునటుల అరచుచూ, పర్వతములు చూర్ణమొనరించుచూ కుతోధరి అసువులుబాసెను.

తన తల్లి మరణించుటచే అత్యంత దు:ఖితుడై వికుంజుడు శోకించి తదుపరి మిక్కిలి కృద్ధుడయ్యెను. ఆతడు ఐదు వత్సరముల బాలుడు. అయిననూ చేత ఆయుధము ధరింపక కల్కిసేనలందు ప్రవేశించి ఆ సేనలను అతలాకుతలము గావించెను. ఆ సమయమున ఆ బాలుని వక్షస్థలమందు ఏనుగులు మాల వలె వ్రేలాడుచుండెను. హయములు ఆతని శరీరముపై ఆభూషణముల వలె శోభిల్లెను. ఆతని శిరము ఒక విశాలమయిన కొండచిలువచే తలపాగ వలె చుట్టబడెను. చేతివేళ్ళ చివరలు పులిగోళ్ళ వలె పదునుగ యుండెను. ఆ అమానుష రాక్షసబాలుడు కలిగించుచున్న ధ్వంసమును కాంచిన కల్కి ఈతడు సామాన్యుడు కాడని తలచి, పరశురామునిచే తనకు ప్రసాదింపబడిన బ్రహ్మాస్త్రమును సంధించి విడచెను. అ అస్త్ర ప్రభావముచే ఆతని శిరము ఖండింపబడి వికుంజుడు విగత ప్రాయుడయ్యెను. పర్వత సదృశులయిన తల్లీ తనయులను తుదముట్టించిన కల్కిని సర్వ దేవతలు, మునులు కీర్తించిరి. తదుపరి మునుల కోరిక మీదట సర్వ వ్యాపకుడయిన కల్కి భగవానుడు గంగానదీ తటమందలి హరిద్వారమున విశ్రమించెను. ఆ రాత్రి అచటనే గడిపి మరునాడు ఉదయము నిద్రలేచెను. ఆ ప్రదేశమునకు చేరువనే పిండారక వనమున్నది. అచట అనేకమంది మునులు తపమొనర్చుచుండిరి. కల్కి యొక్క ఆగమనము గూర్చి విన్నవారై వారందరూ ప్రాత:కాల గంగాస్నాన నెపమున కల్కి దర్శనమున కేతెంచిరి. వారందరూ వివిధ స్తోత్రములచే పున: పున: కల్కిని ప్రస్తుతించి కీర్తించిరి.

(శ్రీకల్కి పురాణమందు తృతీయాంశ యందలి కుతోధరి వధానంతర మునిదర్శనము అను రెండవ అధ్యాయము సమాప్తము)

మూడవ అధ్యాయము

(సూర్యవంశ వర్ణనమందు రామచరితము)

తన దర్శనార్థము ఏతెంచిన మునిపుంగవులందరినీ దర్మజ్ఞుడయిన కల్కి యధావిధిగ పూజించి ఇట్లనియె "ఓ! మహర్షులారా! మీరందరూ సూర్యసమాన తేజస్సులు, సర్వదా తీర్థక్షేత్రములను సేవించు తత్పరులు, త్రిలోకములకు ఉపకారమొనర్చు మహనీయులు. ఈనాడు నా సౌభాగ్యముచే మీరందరూ ఇచట ఉపస్థితులయిరి. నేను అత్యంత పుణ్యవంతుడను, భాగ్యవంతుడను, మరియు యశశ్విని. ఎందుకనగా మీ కృపాకటాక్ష వీక్షణములు నాపై ప్రసరించినవి. నాపై అభిమాన వర్షము కురిపించుచున్న మీరెవరు? మీ పరిచయ భాగ్యమును నాకు కలిగింపవలసినది." వారందరూ తమ నామములను ఈ విధముగ తెలిపిరి – వశిష్ఠ, వామదేవ, అత్రి, గాలవ, భృగు, పరాశర, నారద, అశ్వత్థామ, పరశురామ, కృప, త్రిత, దుర్వాసో, దేవల, కణ్వ, వేద, ప్రమతి, అంగిర మొదలగువారు. ఆ మునిప్రముఖులందరూ చంద్ర, సూర్య వంశములందు ఉత్పన్నమై చిరకాలమునుండి తపమాచరించుచున్న మహాబలశారులైన "మరువు", "దేవాపి" అను ఇరువురు రాజులను ముందునుంచుకొని కలి నాశకుడయిన కల్కిని ప్రసన్నమనస్కులై ప్రార్థించుచూ ఇట్లు పలికిరి "ఓ! జగత్పతీ! నీవు సర్వాంతర్యామివి. సృష్టిస్థిత్యంతములు కావించునది నీవే! ఓ! పరమాత్మా! మాయందు ప్రసన్నుడమవవలసినది. కాలము, కర్మము, మరియు గుణములకు ఆవాసమీవే! తమతమ కార్యము లాచరించు బ్రహ్మాది దేవతలు సహితము నీ చరణకమలములను నిరంతరము పూజించుచుందురు. స్వామీ! నీవు లక్ష్మీపతివి. దయచేసి మాయందు ప్రసన్నుడవు కమ్ము."

అంత కల్కి వారి పూజలను గ్రహించి ప్రసన్నుడై "మీ ఎదురుగ యున్న ఈ మహాపరాక్రమశాలురు, మరియు తపస్వులైన ఈ ఇరువురు మహితాన్వితులు ఎవరు? వీరిరువురు ప్రసన్నమనస్కులై జహ్నుకన్య అయిన గంగానదిని స్తుతించి గంగాజపము ఆచరించుచుండిరి. తత్కారణమేమి?" అని ప్రశ్నించెను. అంత వారిరువురిలో కార్యకుశలుడు, ప్రసన్నమనస్కుడయిన మరువు వినమ్రుడై అంజలి ఘటించి తన గూర్చి ఇట్లు తెలిపెను "ఓ! సర్వాంతర్యామీ! సర్వుల హృదయములందు వెలుగొందు పరమాత్మా! మీకు సర్వము తెలియును. అయిననూ మీరు ప్రశ్నించిరి కావున నేను పలుకుచున్నాను. మీ నాభినుండి చతుర్ముఖ బ్రహ్మ ఉద్భవించెను. ఆయన పుత్రుడు మరీచి. మనువు మరీచి తనయుడు. ఈయనకు సత్యవాది, పరాక్రమోపేతుడు అయిన ఇక్ష్వాకు ఉదయించెను. ఇక్ష్వాకునకు యవనాశ్వుడు, ఆతనికి మాంధాత, మాంధాతకు పురుకుత్సుడు పుత్రులయిరి. పురుకుత్సునకు బుద్ధిమంతుడైన అనరణ్యుడు, ఆతనికి త్రసదస్యుడు, ఆయనకు హర్యశ్వుడు, వానికి త్రయ్యారుణి, ఆతనికి త్రిశంకువు ఉదయించిరి. త్రిశంకుని పుత్రుడు బుద్ధిమంతుడు, మహాప్రతాపి హరిశ్చంద్రుడు. ఆయనకు హరితుడు, ఆతనికి భారుకుడు, వానికి వృకుడు, వృకునికి సగరుడు, ఆయనకు అసమంజసుడు, వానికి అంశుమంతుడు, పుత్రులుగా గలిగిరి. అంశుమంతునికి దిలీపుడు, ఆతనికి భగీరధుడు పుత్రులయిరి. ఈ భగీరధుడు మహాత్ముడు. ఈయన కావించిన తీవ్రతపముచే ఆకాశగంగ పృధివిపై అవతరించి "భాగీరధి" అని పేరుపొందినది. స్వామీ! ఈ భాగీరధి తొలుత మీ పాదములనుండి ఉత్పన్నమయినది. అందువలన భాగీరధి సర్వులచే ప్రణామములందుకొని స్తుతింపబడి, పూజింపబడినది. ఈ భగీరధునకు నాభాగుడు, వానికి బలవంతుడయిన సింధుద్వీపుడు, వానికి అయుతాయువు, వానికి ఋతుపర్ణుడు, వానికి సుదాసుడు, వానికి సౌదాసుడు, సౌదాసునికి బుద్ధిమంతుడయిన ఆశ్మకుడు పుత్రులుగ కలిగిరి. అశ్మకునికి మూలకుడు, వానికి దశరధుడు, వానికి ఏడవిడుడు, వానికి విశ్వసహుడు, ఆతనికి ఖట్వాంగుడు, వానికి దీర్ఘబాహువు పుత్రులుగ కలిగిరి. దీర్ఘబాహువునకు వంశ స్థాపకుడయిన రఘు మహారాజు జన్మించెను.

రఘువునకు అజుడు, అజునకు దశరధుడు, ఆ దశరధునకు పరమ కళ్యాణ గుణాకరుడు, సకల మనోభిరాముడు, ధర్మ విగ్రహుడు, సాక్షాత్ విష్ణు అవతారమయిన శ్రీరామచంద్ర ప్రభువు ఉదయించెను."

శ్రీరామ నామముచే అత్యంత ప్రసన్నుడయిన కల్కి మరువును శ్రీరామ చరితమును విస్తారముగ తెలుపమని ఆదేశించెను. మరువు "ప్రభూ! ఈ పృధివి యందు సీతాపతి, సాక్షాత్ శ్రీరామచంద్రుని చరితము నుటంకించుటకు దక్షులెవరు? సహస్రఫణుడయిన శేషునికి సహితము అయ్యది అశక్యము. కానీ మీ ఆజ్ఞ కావున నా బుద్ధిని అనుసరించి పరమ పవిత్రము, పాపనాశకమయిన శ్రీరామచరిత్రను ఉటంకించెదను. తొలుత బ్రహ్మాది దేవతలచే పూజింపబడిన కారణమున సర్వవ్యాపకుడయిన విష్ణువు అజ తనయుడయిన దశరధునకు నలుగురు పుత్రులుగ ఉదయించెను. అందు రాక్షసాంతకుడయిన రామచంద్రుడు బాల్యముననే విశ్వామిత్రునిచే కావింపబడిన సోమయజ్ఞమందు విఘ్నకారకులయిన అసురులను అంతమొందింప మొదలిడెను. అపరిమిత శక్తిశాలి, కంబుకంఠుడు, జానకీ వల్లభుడయిన శ్రీరామచంద్ర ప్రభువుకు జయోస్తు! విజయోస్తు!! సమస్త శస్త్రాస్త్ర విద్యాపారంగతుడు, సర్వోత్కృష్ఠ కాంతివాసుడు, సర్వలోకరంజకుడు, పరిపూర్ణ ప్రేమసాగరుడు, బృహత్ కర్మల నాచరించుటయందు దక్షుడు, అయిన శ్రీరామచంద్రమూర్తి తన సోదరుడయిన లక్ష్మణ సమేతుడై విశ్వామిత్రుని వెనుక జనక రాజసభాభవనము ప్రవేశించెను.

బ్రహ్మదేవుని వెనుక అంధకారమును పటాపంచలు కావించు పూర్ణిమా సుధాకరునివోలె, విశ్వామిత్రుని వెనుక దివ్యదీప్తులీనుచున్న శ్రీరామచంద్రుని గాంచి జనక మహీపతి తన ప్రియపుత్రి జానకికి యోగ్యమయిన వరుడు ఈతడే అని తలచెను. అంత ఆ మహారాజునకు తనచే కావింపబడిన ప్రతిజ్ఞ "శివధనువును ఎక్కుపెట్టిన వానికే ఈ సీతాదేవిని ఇచ్చెదను" జ్ఞప్తికేతెంచి, తనను తాను నిందించుకొని నెమ్మదిగ రామచంద్రుని చేరెను. రాముడు జనక మహీపతిచే పూజింపబడి, జానకీ కటాక్ష వీక్షణములచే సన్మానింపబడి, కఠోరమయిన శివధనస్సును అవలీలగా పైకెత్తి ధనుర్భంగము కావించెను. చుట్టాయున్న జనులందరూ "రామచంద్రునికీ జై, రామచంద్రునికీ జై" అని జయజయ ధ్వానములు కావించిరి. ఆ ధ్వని ముల్లోకములు వ్యాపించినది. తదుపరి జనకుడు ధశరధుని నలుగురు పుత్రులకు తన నలుగురు పుత్రికలను (సీత, ఊర్మిళ, మాండవి, శృతకీర్తి) ఇచ్చి వివాహమొనరించెను. తదుపరి పరశురాముడేతెంచి శ్రీరాముని పరీక్షింప దలచెను. శ్రీరాముడు ఆ పరీక్షయందు నెగ్గి, పరశురాముని శక్తిని గ్రహించెను. అనంతరము వారందరూ అయోధ్య కేతెంచి ఆనందముగ రోజులు గడుపుచుండిరి. నిష్కళంకుడయిన శ్రీరామునికి రాజ్య పట్టాభిషేకమొనర్చవలెనని దశరధుడు తలచెను. అంత దశరధుని తలంపును కైకేయి వ్యతిరేకించెను. తత్ఫలితముగ దశరధుని ఆదేశానుసారము శ్రీరాముడు, జనకరాజనందిని సీత, సుమిత్రాసుతుడయిన లక్ష్మణుడు వెంటరాగా పదేనాల్గేండ్లు అరణ్యవాసమునకుచనెను. వనమందు గుహుని ఆతిధ్యము స్వీకరించి, అచటనే తన రాజచిహ్నములు త్యజించి, జటావల్కలధారి అయ్యెను. అచటనుండి బయలుదేరి అరణ్యాంతరమునకేగి మునివృత్తి సాగించుచుండగా, ఆతని సోదరుడు భరతుడు వ్యాకులుడై రాముని వెదకుచూ ఏతెంచి ఆయనకు తమ తండ్రి మరణవార్తను తెలిపెను. పితృనిధనమునకు విచారించి రాముడు మిగిలిన అరణ్యవాసకాలము పంచవటి యందే నివసించుటకు నిశ్చయించెను.

రావణుని సోదరి అయిన శూర్పనఖ రాముని అందచందములు చూచి మోహపడి, ఒక సుందరమయిన రూపము ధరించి పంచవటి చేరెను. ఆ రక్కసి జానకిని మ్రింగబోగా రాముని ఆజ్ఞ మేరకు లక్ష్మణుడు ఆమె ముక్కు చెవులు కోసి విరూపిని కావించెను. తదుపరి జనస్థానమందు పదునాల్గువేల రాక్షసులను, ఖర, దూషణులతో సహా రాముడు నిర్జించెను. అంత రావణుని ఆజ్ఞచే మారీచుడు మాయలేడి రూపము ధరించెను. సీతాదేవికి ప్రియమొనర్చుటకై రాముడు ఆ మాయలేడిని బంధించుటకు ఏగి, అది దొరకక చివరకు దానిని సంహరించెను. రామలక్ష్మణులు ఆశ్రమమందు లేని సమయమున రావణుడు క్రోధముచే జనకపుత్రి అయిన సీతను అపహరించెను. రాముడు తన ప్రియసతిని కానక "హా! సీతా! హా!

సీతా!" అని ఎలుగెత్తి శోకించి మూర్ఛిల్లెను. సీతను వెదకుచూ సోదరులిరువురు అనేక మున్యాశ్రమములు, పర్వత లోయలు, జలాశయములు వెదకుచూ తీవ్ర క్షతగాత్ర అయిన "జటాయువు" అను పక్షిని కాంచిరి. జటాయువు ద్వారా సీతను రావణుడు అపహరించెనన్న వార్త విని, జటాయువు మరణించగా ఆ పక్షిని పితృస్వరూపముగ తలచి అద్దానికి అగ్నికర్మములు, అంత్యేష్ఠి సంస్కారములు కావించిరి. సీతా వియోగముచే అత్యంత దు:ఖితుడై, సోదరుడు ముందుసాగుచుండగా జగదేక ధనుర్ధారి అయిన శ్రీరామచంద్రుడు ఋషభాచలము చేరెను. అచట సూర్యపుత్రుడయిన సుగ్రీవుని, ఆతని ప్రియసచివుడు, వినమ్రుడు, హితకారి అయిన వాయుపుత్రుడు హనుమంతుని రామలక్ష్మణులు కలసిరి. సుగ్రీవుడు రాముని "సప్త తాళములు భేదింపమని, తదుపరి తనను రాజ సింహాసనమందు ప్రతిష్ఠింపమని" ప్రార్థించెను. రాముడు సుగ్రీవుని చరితమును, విన్నపమును ఆలకించి, వాలిని వధించుట ధర్మమని నిశ్చయించి, వాలిని వధించి సుగ్రీవుని వానరరాజుగ అభిషేకించెను. అనంతరము వాయుపుత్రుడు హనుమంతుడు సీతజాడకై వెడలి, జటాయు సోదరుడయిన సంపాతి యొక్క పలుకులచే సాగరమును లంఘించి, లంకాపురి చేరి, సీత జాడను అరసి, లంకాపురియందు అనేక రాక్షసయోధులను సంహరించి, లంకానగరమును దగ్ధమొనర్చి తిరిగి కిష్కింధ చేరెను.

రాముడు వానర సహితుడై సముద్రతీరము చేరి క్రోధముతో సముద్రమును ఇంకింపజేసెను. ఆ పయోనిధిపై వానరులు విశాలమయిన వారధిని నిర్మించగా రామలక్ష్మణులు వానర సహితులై లంకాపురి చేరిరి. లంకాపురి నలుప్రక్కలా విశాలమయిన అగడ్తలచే పరివేష్ఠింపబడి, అనేక దుర్గములచే పరిరక్షింపబడుచున్నది. రాముడు తన బాణాగ్నిచే అగడ్తలను ఇంకింపజేసి, దుర్గములను ధ్వంసమొనర్చెను. రాక్షసవీరులు చతురంగబల సమేతులై సమరమునకు ఏతెంచగా, రాముడు సోదరసహితుడై ఒక ప్రచండమయిన కోదండమును చేపట్టి సాయక పాండితీప్రకర్షచే బాణవర్షము కురిపించి, ఆ రాక్షస గణములను ఊచకోత కోసి నిర్జించెను. సీతాదేవిని అపహరించెనన్న క్రోధముతో వానరవీరులైన సుగ్రీవ, అంగద, హనుమ, నల, నీలాదాలు, భల్లూకపతి అయిన జాంబవంతుడు దండెత్తి వెళ్ళి రాక్షసవీరులను దునుమాడి సంహరించిరి. రాముని సోదరుడు, మహాపరాక్రమశాలి, ఓటమినెరుగని లక్ష్మణుడు ప్రళయకాల సదృశ భీషణ ధ్వని కావించు శస్త్రాస్త్రములు ప్రహరించి ప్రహస్త, వికట, నికుంభ, మకరాక్ష, మేఘనాదాది మహారాక్షసులను సంహరించెను. అంత రావణుడు చతురంగబల సమేతుడై, వానరసేనా పరివృతుడయిన శ్రీరాముని ఎదుర్కొనెను. బ్రహ్మవరబల గర్వితుడు, మహాబలశాలి, పరమ పరాక్రమోపేతుడు, యుద్ధమందు పర్వతమువలె అచలముగ నిలువగల రాక్షసపతి అయిన రావణుని, ఆతని సోదరుడు అత్యద్భుత బలాఢ్యుడు కుంభకర్ణుని రామచంద్ర ప్రభువు తన నిశిత సాయకములచే ఖండించి, భంజించి, నిధనుల కావించెను. రామరావణ సంగ్రామము అతి భయంకరమయినది. వారిరువురు ఒండొరులపై కురిపించిన బాణవర్షముచే భూనభోంతరాళములు నిండినవి. ఆకాశము మేఘములు లేకుండగనే పిడుగులు పడినటుల గర్జించినది. ఇంద్రుని వజ్రమువంటి భయంకరారావము ఇరువైపులా కావించు ధనుష్టంకారములచే వెలివడినది. కానీ సీతాపహరణముచే కృద్ధుడయిన రామునిముందు ఇంద్రుని సహితము పరాజితుని కావించిన రాక్షసపతి రావణుడు నిలువలేక ధరాశయుడయ్యెను.

తదుపరి అగ్నిచే సంరక్షింపబడిన సీత రామునికి సమర్పింపబడెను. ఇంద్రుని పలుకులు గౌరవించి రాముడు విభీషణుని రాక్షసరాజుగ అభిషేకించెను. తదుపరి తన ధర్మపత్ని సీత, సోదరుడు లక్ష్మణుడు, మిత్రుడు సుగ్రీవుడు, ఆంజనేయాది వానరుల సహితుడై రఘుపతి ఉజ్వలము, ఆకాశగమన, అత్యంత దీప్తివంతమయిన పుష్పకవిమాన మధిరోహించి ఆయోధ్య వైపు పయనమయ్యెను. దారిలో మున్యాశ్రమములు దర్శించి, గుహుని ఆతిధ్యము స్వీకరించి, తన ముని చిహ్నములను అచట వదలి, తన సోదరులు, అనుయాయుల సహితుడై భరతుని తల్లి అయిన కైకేయిని పలుకరించి, వందనములిడి, తదుపరి తన తల్లిని, ఇతర మాతలకు ప్రణామములాచరించి, వశిష్ఠాది మునిపుంగవులచే

రాజ్యాభిషిక్తుడయ్యెను. సమస్త జగదాధారుడయిన శ్రీరామచంద్ర ప్రభువు సీతా సమేతుడై ఇంద్రుని వలె శోభిల్లెను.

రాముడు రాజయిన పిదప వర్షములు సకాలములో కురిసినవి. జనులందరూ అంత:కలహములు వీడి పరస్పరము మిత్రత్వము వహించిరి. ప్రజలు తమ కర్తవ్యపాలనమందు కృతసంలగ్నులయిరి. బ్రాహ్మణులు తపమందు నిమగ్నమయిరి. శ్రీరాముడు తన మనోహర గుణముల ద్వారా ప్రజలను, తన అనిర్వచనీయమయిన ప్రేమ ద్వారా తన ప్రియతమ అయిన సీతను, అనేక యజ్ఞములు, దక్షిణల రూపేణ శ్రేష్ఠ మునులను, అశ్వమేధయాగములచే దేవతలను సంతుష్టియొనర్చి పదివేల సంవత్సరములు రాజ్యపాలన కావించెను. తదుపరి ఏదో ఒక కారణమును మదిన తలచి, నిర్దయుడై పూర్ణగర్భిణి అయిన జనకపుత్రిని అడవులకు పంపించెను. అంత బ్రహ్మపుత్రుడయిన వాల్మీకి ఆ ధన్యచరిత, మహాత్మురాలైన జనకనందినికి తన ఆశ్రమమునందు ఆశ్రయము కల్పించెను. ఆసమయమున వాల్మీకిమహర్షి సర్వపాపహరమయిన రామాయణగాధను రచించుచుండెను. ఆ మహర్షి ఆశ్రమమున జానకీమాత అత్యంత బలశాలురు, మహా పరాక్రమోపేతులయిన "కుశ, లవు"లను పుత్రులకు జన్మనిచ్చెను. అనంతరము నిష్కళంక, దేవతలచే సహితము కీర్తింపబడు చరిత్ర కలిగిన సీతాదేవిని పుత్రసహితముగ వాల్మీకి రామచంద్రున కర్పించెను. పుత్రసహితయై తన ఎదుట రోదించుచున్న జానకిని మరియొకమారు అగ్నిపరీక్ష గైకొనమని రాముడు ఆజ్ఞాపించెను. అంత ఆ సాధ్వి తన భర్తకు ప్రణామములర్పించి, తన తల్లి పృధివీమాతను తలచి, ఆమెతో పాటుగా మణిరత్నయుతమయిన రసాతలమున కేగెను. జనకనందిని యొక్క ప్రస్థానానంతరము ఆమెనే స్మరించుచు శ్రీరాముడు తన సోదరులు, ప్రజలు సహితుడై సరయు నదియందు ప్రవేశించి, దివ్యదేహుడై దివ్యాదరము అధిరోహించి సర్వులు వైకుంఠమున కేగిరి. ఈ రఘువంశ నాయకుడయిన శ్రీరామచంద్రుని చరితము అమృతస్వరూపము, సంసారసాగరతరణ మొనర్చునది, అత్యంత ప్రసన్నత, సుఖశాంతులు, మోక్షమును సహితము ప్రసాదించునది. ఈ చరితను ఎవరు ఆదర పూర్వకముగ వినెదరో, వారు ఇహలోకమందు రోగవిముక్తులై, వంశవృద్ధియై, ధన, జన, స్వర్గాది సంపత్తుల నొందెదరు.

(శ్రీకల్కి పురాణమందు తృతీయాంశ యందలి సూర్యవంశ వర్ణనమందు రామచరితమను మూడవ అధ్యాయము సమాప్తము)

నాల్గవ అధ్యాయము

(చంద్రవంశ కీర్తనము)

మరువు తిరిగి చెప్పదొడంగెను. రాముని పుత్రుడు కుశుడు. ఆయనకు నిషధుడు, నిషధునకు నభుడు, ఆతనికి పుండరీకుడు, వానికి క్షేమధన్వి, క్షేమధన్వికి దేవానీకుడు, ఆతనికి హీనుడు, వానికి పరిపాత్రుడు, వానికి బలాహకుడు, వానికి అర్కుడు ఉదయించిరి. అర్కునకు రజనాభుడు, వానికి ఖగణుడు, వానికి విధృతుడు, విధృతునికి హిరణ్యనాభుడు కలిగిరి. హిరణ్యనాభునకు పుష్పుడు, వానికి ధృవుడు, వానికి స్యందనుడు, వానికి అగ్నివర్ణుడు, ఆయనకు శీఘ్రుడు ఉద్భవించిరి. ఈ శీఘ్ర మహీపతి అత్యంత పరాక్రమోపేతుడు మరియు నా పితృపాదులు. నేనాయన పుత్రుడను. నా నామధేయము "మరువు". నన్ను "బుధుడు", "సుమిత్రకుడు" అని కూడా పిలచెదరు. నేను "కలాప" గ్రామము ప్రవేశించి తీవ్రతపము నందు మునిగితిని. లక్ష సంవత్సరముల నుండి తపశ్చర్య కావించుచుండగా సత్యవతీ నందనుడు, వేదవ్యాసుడు నావద్దకేతెంచి పాపవినాశకుడవు, ధర్మ పరిరక్షకుడవు, సర్వకామనాపూర్ణుడవు, కీర్తి ప్రదాయకుడవు, పరమాత్ముడవైన నీ

ఆవిర్భావము గూర్చి తెలిపెను. వెనువెంతనే ప్రభూ! నేను మీ దర్శనార్థము ఏతెంచితిని" అని పలికి మరువు మౌనము వహించెను.

అంత కల్కి "మరు మహారాజా! సూర్యవంశ సంజాతుడవైన నీ గూర్చి సంపూర్ణముగ తెలిపితివి. ఐశ్వర్య సంపన్నుడు, మహాపురుష లక్షణ సమన్వితుడయిన నీ మిత్రుడెవరు?" అని ప్రశ్నించెను. కల్కి భగవానుని పలుకులు విని వినయ విధేయ సంపన్నుడయిన దేవాపి మధురస్వరముతో ఇట్లనియె "పరమాత్మా! ప్రళయానంతరము మీ నాభికమలము నుండి చతుర్ముఖ బ్రహ్మ ఉద్భవించెను. ఆయన మానసపుత్రుడు అత్రి, అత్రికి చంద్రుడు, ఆయనకు బుధుడు, బుధునకు పురూరవుడు, ఆతనికి నహుషుడు, ఆయనకు యయాతి ఉద్భవించిరి. యయాతికి దేవయాని యందు యదువు, తుర్వసుడు; శర్మిష్ఠ యందు ద్రుహ్యువు, అనువు, పూరుడు కలిగిరి. సృష్ట్యాది యందు పంచమహాభూతము లుత్పన్నమయినటులే యయాతికి పంచ పుత్రులుదయించిరి. పూరునకు జనమేజయుడు, ఆతనికి ప్రచిన్వాన్, వానికి ప్రవీరుడు, వానికి మనస్యుడు, ఉద్భవించిరి. మనస్యునికి అభయదుడు, వానికి ఉరుక్షయుడు, వానికి త్రయ్యారుణి, వానికి పుష్పవారుణి, వానికి బృహత్క్షేత్రుడు, ఆయనకు హస్తి పుత్రులుగ కలిగిరి. హస్తియే హస్తినాపుర నిర్మాత. హస్తికి ఇరువురు పుత్రులుదయించిరి. వారు అజమీఢ, పురుమీఢులు. అజమీఢునకు ఋక్షుడు, ఆయనకు సంవరుణుడు, ఆయనకు కురువు పుత్రులుగ కలిగిరి. ఈ కురువు తిరిగి వంశస్థాపకుడయ్యెను. అప్పటినుండియు చంద్రవంశము కురువంశమయ్యెను. కురువునకు పరీక్షిత్, ఆతనికి సుధనుడు, జహ్ను, విషధుడు అను ముమ్వురు పుత్రులు కలిగిరి. సుధనునకు సుహోత్రుడు, సుహోత్రునకు చ్యవనుడు, ఆయనకు కృతి పుత్రులుగ కలిగిరి. కృతికి బృహద్రధుడు, బృహద్రధునకు కుశాగ్రుడు, ఆతనికి ఋషభుడు, వానికి సత్యజితుడు, ఆతనికి పుష్పవానుడు, వానికి నహుషుడు ఉత్పన్నమయిరి. బృహద్రధుని రెండవపత్ని నుండి శత్రుకర్షణుడయిన జరాసంధుడు ఉత్పన్నమయ్యెను. జరాసంధునకు సహదేవుడు, ఆతనికి సోమాపి, ఆతనికి శృతశ్రవుడు కలిగిరి. శృతశ్రవునికి సురధుడు, సురధునకు విదూరదుడు, ఆతనికి సార్వభౌముడు, వానికి జయసేనుడు, ఆతనికి రధానీకుడు కలిగిరి. రధానీకునకు క్రోధము గల యుతాయువుద్భవించెను. యుతాయువునకు దేవాతిధి, ఆతనికి ఋక్షుడు, ఋక్షునకు దిలీపకుడు, దిలీపకునికి నా తండ్రి అయిన ప్రతీపుడు ఉద్భవించిరి. ఆ మహీపతికి పుత్రునిగ "దేవాపి" అను నామము గల నేను, నా కుమారుడయిన శంతనునికి రాజ్యమొసంగి కలాప గ్రామమున కేగి చిరకాలము తపమాచరించితిని. తదుపరి ఈ మరువు, మరియు ఈ మునులతో కలసి మీ చరణకమల సందర్శనార్థము ఇచట కేతెంచితిని. మీ సందర్శన పుణ్యబలముచే నేను కాలసర్పదష్టుడనవక ఆత్మజ్ఞాని పదము నొందెదను.

అంత కల్కి వారిరువురి పలుకులు వినిన మీదట చిరునవ్వు నవ్వి, వారిరువురికీ ఆశ్వాశన మొసంగుచూ ఇట్లనియె "మీరిరువురు సర్వధర్మములు ఎరిగిన జ్ఞాతలు; మరియు ప్రసిద్ధులు. నా ఆజ్ఞగా మీరిరువురు మీమీ రాజ్యములను పాలింపవలసినది. ధర్మవిహీనులు, ప్రాణిహింసకులు అయిన మ్లేచ్ఛులను సంహరించి నేను ఓ! మరూ! నిన్ను తిరిగి నీ రాజ్యమయిన ఆయోధ్య యందు రాజుగా అభిషేకించెదను. ఓ! రాజర్షీ! దేవాపీ! నిన్ను హస్తినాపురమందు తిరిగి రాజుగా నియుక్తుని కావించెదను. నేను మధురయందు స్థితిగతుడనై మీ ఇరువురికీ భయనిర్మూలన మొనర్చెదను. శచ్యాకర్ణుడు, ఉష్ట్రముఖుడు, ఏకజంఘుడు, విలోదరుడు, మొదలగు మ్లేచ్ఛులను సంహరించి తిరిగి సత్యయుగమును ప్రతిష్ఠించెదను. మీరిరువురు ఇక తపస్వుల వేషములు వర్జించి, రాజోచితదుస్తులు ధరించి, రధారూఢులై సమరోన్ముఖులు కావలసినది. శస్త్రాస్త్ర కుశలురయిన మీరిరువురు ఇక సేనాసహితులై మ్లేచ్ఛసంహారమందు నాకు సహాయమొనర్పవలసినది. తక్షణము ఆ రాజులిరువురు నవయవ్వన, రూపసంపన్న బలాఢ్యులయిరి. అనంతరము కల్కి విశాఖయూపుని వైపు తిరిగి "మహారాజా! అత్యంత సుందరీమణి, వినయసంపన్న, పద్మదళేక్షణ, అయిన నీ పుత్రిక "విష్ణుద్యుతి" ని ఈ మరువుకు పత్నిగా ఈయవలసినది, అని పలికి దేవాపితో "రాజా! నీవు నా పలుకులు మన్నించి రుచిరాశ్వ మహారాజపుత్రిక అయిన

“శాంత”ను నీ ధర్మపత్నిగా స్వీకరింపవలసినది.” మరు, దేవాపిలిరువురు ఆశ్చర్యకరమయిన ఈ సంఘటనను, కల్కి పలుకులను విని “ఈయన నిశ్చయముగ శ్రీవిష్ణు భగవానుడే!” అని తలచిరి.

మరుక్షణము మరియొక అద్భుత సంఘటన జరిగినది. సూర్యసదృశ తేజోమయము, దివ్య శస్త్రాస్త్ర సమన్వితము, మణిరత్నఖచిత స్వర్ణయుతము, రథి యొక్క ఇచ్ఛానుసారము పోగల రెండు రథములు అంబరవీధి నుండి భువికి ఏతెంచినది. అవి రెండునూ విశ్వకర్మ వినిర్మితములు. వానిని కాంచి సర్వులు విస్మితులై, ఆశ్చర్యచకితులైరి. అంత కల్కి మరు, దేవాపిల నుద్దేశ్యించి తిరిగి ఇట్లనియె “రాజన్యులారా! మీరిరువురు ఆదిత్యుడు, సోముడు, ఇంద్ర, యమ, కుబేరాంశ సంభూతులై, ఈ సంసార రక్షాహేతువై జన్మించి ఇప్పటి వరకు తపమాచరించుచున్నప్పటికీ, మీరిరువురు ఈ మ్లేచ్ఛసంహార క్రతువునందు నాకు సాహచర్య మొనరించుటకే ఉత్పన్నమయిరి.” లక్ష్మీపతి, సమస్త సంసారమునకు స్వామి, సనాతనుడయిన కల్కి భగవానుని మృదుమధుర గంభీరవాక్కులు వినిన దేవతలు పుష్పవృష్టి కురిపించి ఆయనను స్థుతించిరి. ఆ సమయమున పవనము దివియందలి ఆకాశగంగా తరంగముల నుండి ఉత్పన్నమై, పరమ కళ్యాణకరుడయిన మహేశుని శరీర విభూతిచే పరాగయుక్తమై, జగన్మాత, పర్వతనందిని పార్వతీదేవి పరమపవిత్ర శరీరమును తాకి, భువికేతెంచి కల్కి సహిత రాజ, మునిగణములందరినీ మంగళకర మలయమారుతమై స్పృశించెను. ఆ సమయమున అచటికి కమలదళనేత్రుడు, తప్తకాంచన సన్నిభుడు, ధర్మమునకు ఆలవాలము, పాపసమూహములను సంపూర్ణముగ దగ్ధమొనర్చువాడు, దండకమండలములు ధరించిన దివ్యదేహుడు, జటావల్కలధారి, పరమప్రసన్న శరీరుడయిన ఒక భిక్షుకుడు అచటి కేతెంచెను.

(శ్రీకల్కి పురాణమందు తృతీయాంశ యందలి చంద్రవంశ కీర్తనము అను నాల్గవ అధ్యాయము సమాప్తము)

ఐదవ అధ్యాయము

(కృతయుగాగమనము)

కల్కి సభాసదుల సహితుడై లేచి, నుంచొని ఆ భిక్షుకునకు అర్ఘ్య, పాద్య, ఆచనమనాదులకు జలము సమర్పించి, ఆయన సుఖాశీనుడయిన పిదప ఇట్లనియె “పాపరహితులు, సదా సంతుష్టులు, సర్వజీవులకు మిత్రులు, అయిన జనులు కేవలము జనోద్ధరణకు మాత్రమే సంచార మొనర్చుచుందురు. ఈరోజు మా సౌభాగ్యవశముచే ఏతెంచిన ఓ! స్వామీ! మీరెవరు? దయచేసి తెలుపవలసినది.” అంత బిక్షువు “ఓ! లక్ష్మీపతీ! నేను కృతయుగమును. మీరు కల్కి రూపమున అవతారము స్వీకరించుటచే మీ గుణ, రూప, ఐశ్వర్యములను వీక్షించుటకు ఇచట కేతెంచితిని. స్వామీ! తత్వత: మీరు ఉపాధిరహితులు. కానీ మీ మాయచే ప్రకటితమయిన కాలము ద్వారా క్షణము, దండము, లవము, ఈవిధముగ వ్యక్తీకరింపబడుచున్నారు. పగలు, రాత్రి, దినము, పక్షము, నెల, ఋతువులు, సంవత్సరము, పదునాల్గుమంది మనువులు మీ అధీనములే! స్వాయంభవ, స్వారోచిష, ఉత్తమ, తామస, రైవత, చాక్షుస, వైవశ్వత, దక్షసావర్ణి, బ్రహ్మాసావర్ణి, ధర్మసావర్ణి, రుద్రసావర్ణి, వేదసావర్ణి, దైవసావర్ణి, ఇంద్రసావర్ణి అను పదునాల్గురు మనువులు కేవలము మీ విభూతి స్వరూపమే! ఈ నామరూపాత్మక జగత్తు అంతయు మీ మాయాస్వరూపమే! కేవలము మీ మాయ కారణముగనే సర్వులు ఈ జగత్తు యందు ఉద్భవించి, తమ కార్యములాచరించి తిరిగి అదృశ్యులగుదురు. దేవతల చతుర్యుగములు కలిపి పన్నెండువేల దివ్య సంవత్సరముల నిడివి యుండును. ఇందు సత్యయుగము నాలుగువేల సంవత్సరములు మరియు సంధ్యాంశము నాలుగు వందల వత్సరములు. త్రేతాయుగము మూడువేల వత్సరములు మరియు సంధ్యాంశము మూడు

వందల సంవత్సరములు. ద్వాపరము రెండువేల సంవత్సరములు మరియు సంధ్యాంశము రెండు వందల వత్సరములు. కలియుగము ఒకవేయి వత్సరములు మరియు సంధ్యాంశము ఒక వంద సంవత్సరములు. ఈ విధముగ సంధ్య మరియు సంధ్యాంశము కలిపి రెండువేల సంవత్సరముల కాలము యుండును.

ఒకొొక్క మనువు డెబ్బదిఒక్క యుగములు పర్యంతము భోగించును. ఈవిధముగ పదునాల్గుమంది మనువులు రాజ్యమేలిన ఎడల అయ్యది ప్రజాపతికి (బ్రహ్మ) ఒక దినము. ఆయనకు రాత్రి సహితము అంతే నిడివి యుండును. దివరాత్రములు, పక్ష, మాస, సంవత్సరములు, ఋతువులు మొదలగు కాలసహిత ఉపాధులే బ్రహ్మ యొక్క జన్మమృత్యువులకు కారణభూతమగును. చతుర్ముఖ బ్రహ్మ ఒక వందసంవత్సరముల ఆయు:పరిణామము అయిన పిదప, ఆయన మీయందు విలీనమై తిరిగి ప్రళయానంతరము మీ నాభినుండి ఉత్పన్నమై సృష్టిరచన కావించును.

సత్యయుగమును నేనే! ఈ యుగమందు ధర్మము అన్నివేళలా ఆచరింపబడును. ప్రజలు కేవలము యోగ్యమయిన కార్యములనే కావించెదరు. అందువలన నన్ను "కృతయుగము" అని కూడా పిలిచెదరు. ఈ విధముగ పలికి సత్యయుగ పురుషుడు మౌనము వహించెను. అంత కల్కి ఆ వచనామృతమును ఆలకించి అత్యంత ప్రసన్నుడై "విశసన" నగరము నేలుచున్న కలిపురుషుని ఎదుర్కొనుటకు సంసిద్ధుడై తన సేనలతో ఇట్లనియె "మీరందరూ యుద్ధకుశలురు, శ్రేష్ఠ శస్త్రాస్త్రధరులు, సర్వభూషణ భూషితులు. మనము కలిపురుషుని ఎదుర్కొనవలెను. అందువలన చతురంగ బలములను సమీకరించి సమీక్షింపవలెను. మీరందరూ ఏగి మనసేనయందు ఎంతమంది రథ, గజ, హయ, పదాతులు యుండిరో గణించి నాకు తెలుప వలసినది."

(శ్రీకల్కి పురాణమందు తృతీయాంశ యందలి కృతయుగాగమనము అను ఐదవ అధ్యాయము సమాప్తము)

ఆరవ అధ్యాయము

(కల్కిసేనా సంగ్రామము)

సూతమహర్షి చెప్పదొడంగెను "కల్కి పలుకులు వినిన మరుక్షణము కొద్దిసేపటి క్రితమే వివాహక్రతువును పూర్ణమొనరించుకొనిన మరు, దేవాపిలు కల్కి సమక్షమున కేతెంచిరి. వారిరువురు ఆరు అక్షౌహిణీ సేనాసహితులై, శస్త్రాస్త్ర సంపన్నులై, తూణీరములను భుజములపై బిగించుకొని ధనుర్ధారులై, కవచములు ధరించి, చతురంగ బలసమేతులై ఆపాదపర్యంతము శిరస్త్రాణములు ధరించియుండిరి. ఇంతలో ఒక లక్షఏనుగులు, పదిలక్షల అశ్వసేన, ఏడువేల రథములు, తొమ్మిది లక్షల పదాతుల సహితుడై వాయువీవనముచే రెపరెపలాడుచున్న ఉత్తరీయము, తలపాగ ధరించి విశాఖయూపుడు ఏతెంచెను. ఈసమయమున చతురంగ బలములచే పరివేష్ఠితుడయిన కల్కి దేవతలచే పూజింపబడుచున్న దేవరాజు ఇంద్రుని వలె శోభిల్లుచుండెను. తన బంధు, మిత్ర, బాంధవ, సోదరుల సహితుడై కల్కి దిగ్విజయమునకు సంసిద్ధుడగుచుండగా కలిచే తిరస్కృతుడయిన ధర్మదేవత ఒక బ్రాహ్మణరూపము ధరించి అచటి కేతెంచెను. ధర్మము, ఋతము, ప్రసాదము, అభయము, సుఖము, ఆనందము, యోగము, అర్థము, అహంకారము, స్మృతి, క్షేమము, ప్రతిశ్రయము, శ్రీహరి అంశీభూతులయిన నరనారాయణులు, అంతేకాక పైనతెలిపిన వారందరి స్త్రీ, పుత్రగణముల సహితుడై ధర్ముడేతెంచెను. ధర్మము నాశ్రయించిన శ్రద్ధ, మిత్రత, దయ, శాంతి, సంతోషము, పోషణము, క్రియాశీలత, ఉన్నతి, బుద్ధి, ధారణాశక్తి, సహిష్ణుత, లజ్జాదులు శరీరధారులై వారివారి బంధుబాంధవ సహితులై ఆ బ్రాహ్మణుని వెనుక ఏతెంచి తమతమ ప్రయోజన సిద్ధికై కల్కి దర్శనము కావించిరి.

వీరందరి సహితుడై ఏతెంచిన బ్రాహ్మణుని వద్దకు కల్కి అత్యంత వినమ్రుడై ఏగి, విధివిధానముగ పూజనమొనర్చి ఇట్లనియె "మహాత్మా! మీరెవరు? ఏ ప్రయోజనసిద్ధికై నావద్దకేతెంచిరి? మీరు స్త్రీ, పుత్ర, పుత్రీ సహితులై పుణ్యక్షీణమయిన పుణ్యాత్ముని వలె గోచరించుచున్నారు. మీ రాజ్యమేది? అద్దానిని పాలించు ప్రభువెవరు? మీ పత్నీపుత్రులు బల పౌరుషవిహీనులై, పాఖండులచే తిరస్కృతులైన వైష్ణవ సాధువుల వోలె అత్యంత దయనీయముగ తోపుచుండిరి. మీరు ఏమాత్రము భీతినొందక సర్వము కూలంకషముగ తెలుపవలసినది. కల్కి యొక్క ఆశ్వాశనమును వినిన ధర్ముడు తన అనాధత్వమును స్మరించుచూ అత్యంత దు:ఖితుడై, లక్ష్మీపతి అయిన కల్కి భగవానుని తొలుత ధర్ముడు తన పత్నీపుత్ర సహితుడై అంజలి ఘటించి, స్థుతించి, పూజనమాచరించి ఇట్లనియె "ఓ! కల్కి భగవానుడా! బ్రాహ్మణ రూపధారినైన నేను ధర్ముడను. నేను ప్రాణుల ఇచ్ఛలను పూర్ణమొనరించెదను. నేను సాక్షాత్తు మీ వక్షస్థలము నుండి ఉత్పన్నమయితిని. దేవతలకు, పితరులకు ఆహుతులను చేరవేయు దేవతలందు అగ్రగణ్యుడను, సర్వుల కామనలను పూర్ణమొనరించు విశ్వవ్యాపిని, సజ్జనులకు యశమును ప్రసాదించువాడను. ఈ సర్వకార్యములను ప్రభూ! నేను మీ ఆజ్ఞచే మాత్రమే పాలించుచుంటిని. కానీ నేడు శక, కాంభోజ, శవరాదులతో నివసించు కలిచే భహిష్కరింపబడితిని. ఓ! సర్వాశ్రయభూతా! నేడు కలియుగమందు కలి ప్రభావముచే సజ్జనులందరూ అత్యంత దు:ఖభాజనులు అగుచున్నారు. అందువలన మేమందరము మీ చరణకమలములను శరణుజొచ్చుచున్నాము. ఈ విధముగ ధర్ముని దయనీయమయిన వేదనను ఆలకించిన పాప నిర్మూలకుడు కల్కి భగవానుడు నెమ్మదిగ ఇట్లు పలికెను "ధర్మా! భీతివలదు. నిర్భయుడవగుము. చతుర్ముఖ బ్రహ్మదేవుని ప్రార్ధన మీదట దుష్టశిక్షణకు, శిష్టరక్షణకు, ధర్మసంరక్షణకు నేను అవతారము స్వీకరించితిని. ఈ సూర్య, చంద్రవంశ సంజాతులయిన మరు, దేవాపిలను, కృతయుగమును, వీక్షింపుము. కీకటదేశమందలి బౌద్ధులను నాశమొనర్చితిని. వేదధర్మమును తిరస్కరించినవారినీ, మిమ్ము (ధర్మమును) నష్టమొనరించిన వారినీ, సంహరించుట కొరకే నేను సేనాసహితుడనై జైత్రయాత్ర కేగుచుంటిని. నేను, సత్యమును ప్రతిష్ఠితులమై యుండగా మీకిక భయమేల? యజ్ఞ, దాన, తప, నియమములతో ఓ! ధర్మమా! మీరిక భయరహితులై ప్రవర్తిల్లవలసినది. మీరు పుత్ర, పత్నీ, బాంధవ సహితులై దశదిశలకు ఏగవలసినది. మీవెంట నేనుండి మిమ్ములను సురక్షితమొనరించెదను." ఆ పలుకులు విని ధర్ముడు అత్యంత హృదయానందమునొంది, తన ధర్మమును గుర్తుచేసికొని కల్కి సహాయార్థము యుద్ధమునకు ఏగుటకు నిశ్చయించెను. ఆసమయమున ధర్ముడు సప్తస్వరములనెడి సప్తాశ్వములు పూన్చిన వేదజ్ఞానమనెడు విశాలరధమధిరోహించి, శాస్త్రమర్దనా సంకల్పమనెడు ధనువు ధరించి, బ్రాహ్మణుని సారధిగా గ్రహించి, అగ్నిరూప ఆసనముపై స్థిరాశీనుడై, క్రియాశీలత, భేదము మొదలగు ఉపాయములను సేనగా తీసికొని యుద్ధసన్నద్ధుడయ్యెను. వారందరూ ముందునకేగి సిద్ధాశ్రమమునందు ఆగిరి. కల్కి తన సేనలతో సహితముగ యజ్ఞ, దాన, తప, సంయమ, నియమాదులను సహితము గైకొని కలి పరాజయార్ధము వెడలెను.

ఆ సమయమున కలి ఖశ, కాంభోజ, శవర, వర్వరాది మ్లేచ్ఛులతో కూడి భూతప్రేత పరివేష్ఠితుడై, అత్యంత కామాసక్తులైన జనులతో సంఘటితుడై మిక్కిలి బలోపేతుడై యుండెను. కలి నివాసప్రాంతమంతయు గోమాంస ఖండనముచే ఆవిర్భవించిన దుర్గంధముచే నిండియుండి కాకులు, గుడ్లగూబలు, నక్కలు స్వేచ్ఛగా విహరించుచుండెను. స్త్రీలు కలహప్రియులై, వివాదానురక్తులై, జూదము మరియు అనేక వ్యసనముల కాలవాలమై యుండిరి. పరమభయంకరుడు, సంసారమును అతలాకుతలము కావించువాడు, కాముక స్త్రీలకు స్వామి, అయిన కలి నగరమునకు కల్కి భగవానుడేగెను. కల్కి యుద్ధసంరంభుడై ఏతెంచెనని వినిన కలి అత్యంత క్రోధావిష్టుడై అనేక కరవాలములు నింపి, గుడ్లగూబలు పూన్చిన రధమధిరోహించి తన పుత్ర, బాంధవుల సహితుడై, యుద్దోన్ముఖుడై నగరము బయటకేతెంచెను. అంత కలిని కాంచి కల్కి ఋషిసహితుడై యున్న ధర్ముని సమరమొనర్పమని ప్రోత్సహించెను. ఆ సమయమున ఋతము దంభముతోనూ,

అనుగ్రహము లోభముతోనూ, అభయము క్రోధముతోనూ, సుఖము భయముతోనూ, ఆనందము నరకముతోనూ, యోగము మానసికపీడతోనూ, క్షేమము శారీరక రోగముతోనూ, వినమ్రత గ్లానితోనూ, స్మృతి వృద్ధావస్థతోనూ, పరమభీషణ సంగ్రామమొనర్చిరి. ఈ చండప్రచండ సంగరమును తిలకించుటకు బ్రహ్మాది దేవతలు తమ విభూతులు (అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యము, ఈశిత్వ, వశిత్వములు) సహితులై ఏతెంచి అంబరమందు ప్రతిష్ఠితులైరి.

మరు మహారాజు అత్యంత యుద్ధకుశలురు, సేనాసహితులైన ఖశ, కాంభోజులతోనూ, దేవాపి మహారాజు చీని, వర్వరులతోనూ యుద్ధమొనర్చిరి. నానాశస్త్ర శోభితుడయిన విశాఖయూపుడు పుళిందులు, స్వపచులతోనూ సంగర మొనరించెను. కల్కి భగవానుడు అత్యంత బలశాలురు, బ్రహ్మదత్త వరసంపన్నులు, మహా పరాక్రమోపేతులు, సేనాసహితులైన కోక, వికోకులను ఎదుర్కొనెను. ఈ కోకవికోకులు వృకాసురుని పుత్రులు, వజ్రసదృశ దృఢశరీరులు, అనేక శస్త్రాస్త్ర విద్యాపారంగతులు, గదాయుధధరులు, మరియు ఏకాకృతి గల కవలలు. ఆ సమయమున సమరాంగణమంతయు గజముల ఘీంకారములతో, అశ్వముల హేషలచే, రథముల ఠణఠణలచే, వీరుల భుజాస్ఫోటనములచే, పరస్పర అధిక్షేపణములచే, ధనువుల టంకారములచే, యోధుల సింహనాదములచే నిండి భూనభోంతరాళములు ప్రతిధ్వనించుచుండెను. యోధులు అలసట ఎరుగక పోరుచుండిరి. శూరులు ఖడ్గములు, గదలు, తోమరములు, భిందిపాలములు, బల్లెములు, త్రిశూలాది ఆయుధములతో ప్రత్యర్థులను చీల్చుచుండగా, సమరాంగణమంతయు రక్తపుటేరులతో, పీనుగుల పెంటతో నిండిపోయెను.

(శ్రీకల్కి పురాణమందు తృతీయాంశయందలి కల్కి సేనాసంగ్రామమను ఆరవ అధ్యాయము సమాప్తము)

ఏడవ అధ్యాయము

(కోక వికోకుల వధ)

సూతుడు "తొలుత అత్యంత క్రోధితుడయిన ధర్ముడు కృతయుగ సహితుడై కలితో యుద్ధ మొనర్చెను. నిర్దిష్టభేదనమొనర్చు తీవ్ర బాణవర్షఘాతములను తాళజాలక కలి తన వాహనమయిన గార్దభమును విడచి, పరాజితుడై తన నగరము లోనికేగెను. ఉలూకాక్షములవంటి తునకలయిన రథముగల కలి సర్వావయవముల నుండి రుధిరము కాల్వలై పారుచుండగా దుర్గంధభూయిష్ఠుడై, భయంకర ముఖుడై తన నగరమున కరిగెను. దంభము అంగారసదృశ బాణసమూహములు తనను నిర్వీర్యుని కావింపగా నిస్తేజుడై, ఉత్సాహవిహీనుడై వెనుకకు తిరిగెను. అనుగ్రహముతో కొంతసేపు గదాయుద్ధమొనరించిన లోభము ఆ గదా ఘాతములను తాళజాలక, కుక్కలు పూన్చిన రథము తునాతునకలవ్వగా, ఒడలంతయూ గాయములై, మస్తకము పగలి వెనుదిరిగి నగరములోనికి పరుగెత్తెను. ఎర్రని నేత్రములు గల క్రోధుడు ఎలుకలు పూన్చిన రథమధిరోహించి అభయముతో సంగరమొనరించెను. కానీ అభయుని తీవ్రతచే రథము శిథిలమై ఒడలుతప్పి క్రోధుడు పరాజితుడై విశసన నగరాంతర్భాగమునకు పరుగుదీసెను. భయుడు సుఖము యొక్క పాద ప్రహారములచే ప్రాణవిహీనుడై నేలకొరగెను. ఆనందము యొక్క మోకాలి తాకిడికి నరకుడు యమసదనమున కేగెను. సత్యయుగము యొక్క బాణపరంపరలకు పీడితులై శారీరక, మానసిక రోగములు తమ వాహనములను సహితము వదలి దశదిశలకు పరుగులెత్తినవి. ధర్ముడు తిరిగి కృతయుగముతో కలసి విశసన నగరమునకేగి కలి సహితముగ ఆ నగరమును అగ్నిబాణపరంపరచే దహించెను. తన నగరము, ప్రజలు, పత్నీపుత్రులు, తన సర్వాంగములు భస్మీమపటలమగుటచే కలి ఏకాకియై రోదించుచూ దూరదేశముల కేగెను.

మరువు తన శస్త్రాస్త్ర ప్రభావముచే శక, కాంభోజులను, అంతమొందించెను. దేవాపి శవర, చోళ, వర్వులను అట్టడిగించి, శౌర్యవిహీనుల కావించి తుదకు తుదముట్టించెను. అమిత పరాక్రమోపేతుడయిన విశాఖయూపుడు తన బాహుబల విక్రమముచే పుళింద, పుక్కసులను సంహరించెను. అంతటితో ఆగక నిర్మలబుద్ధి అయిన విశాఖయూప మహీపతి శస్త్రాస్త్రవర్షము కురిపించి శత్రుయోధులను దునుమాడి సంహరించెను. గదాయుద్ధ విశారదుడయిన కల్కి ఒక భయంకరమయిన గదను ధరించి కోక వికోకులతో యుద్ధమొనరించెను.

వృకపుత్రులు, శకునికి మేనల్లురు అయిన ఆ దనుజులిరువురు కల్కిని ఎదుర్కొనిరి. ఆ సమరము శ్రీహరి, మధుకైటభ సంగ్రామమును తోపించినది. ఆ దనుజుల గదా ప్రహారములకు కల్కి శరీరము నొచ్చి గద చేతినుండి క్రిందకు జారెను. ఆ సంగరమును తిలకించుచున్న సర్వులు దనుజుల శౌర్యమునకు అచ్చెరువొందిరి. అంత కల్కి క్రోధావేశుడై ఒక బల్లెము చేత ధరించి, విసురుగ వికోకునిపై ప్రహరించి ఆతని శిరమును శరీరము నుండి వేరుపరచెను. కానీ ఆశ్చర్యము. కోకుని దృష్టి పడగనే వికోకుని శిరము మొలిచి వికోకుడు జీవితుడయ్యెను. అంత కల్కి గదను హస్తమందు ధరించి, తీవ్రముగ ప్రహరించి కోకుని శిరము ఛిద్రమొనరించెను. కానీ వికోకుని దృష్టిపాతముచే తిరిగి కోకుడు జీవితుడయ్యెను. అంత కోకవికోకులు విజృంభించి కాల, మృత్యువులవలె కల్కితో పోరాటమొనరించిరి. పదునయిన చంద్రహాసములు, డాళ్ళు చేతబట్టి, సోదరులిరువురు అనేకమార్లు కల్కిపై ప్రహారములొనర్చిరి. అంత కల్కి క్రోధితుడై ఒకే బాణముతో ఇరువురి శిరములు ఒకేమారు ఖండించెను. కానీ బ్రహ్మ వరమున దనుజులిరువురు తిరిగి పునర్జీవితులయిరి. ఈ పరిస్థితిని గమనించి కల్కి ఇంచుక చింతాగ్రస్థుడయ్యెను. ఇంతలో కల్కి హయము తన స్వామి శక్తిహీనుడయ్యెనని గమనించి, ఆ దనుజులిరువురినీ తన పాదములతో ప్రహరించెను. అంత దనుజులిరువురు అత్యంత క్రోధితులై తన ధనువులు సారించి ఆ హయమును బాణవర్షముతో ముంచెత్తిరి. అంత హయము ఆ దనుజుల భుజములను కొరికి హస్తముల నుత్తరించెను. తిరిగి హస్తములు పొందిననూ భుజములు శిధిలమై, ఒడలంతయు గాయములయిన ఆ సోదరులిరువురు ఆ హయము యొక్క తోకను బాలురు గోవు తోకపుచ్చుకొనునట్లు పట్టుకొనిరి. అంత ఆ హయరాజము క్రోధముబూని తన వెనుకకాళ్ళతో ఆ సోదరులిరువురినీ వజ్రఘాతము వలె ప్రహరించెను. అంత వారిరువురు కొంత తడవు మూర్ఛిల్లి, తేరుకొని తిరిగి కల్కిని యుద్ధమునకు ఆహ్వానించిరి.

ఆ సమయమున బ్రహ్మ కల్కి వద్దకేతెంచి “ఓ! ఆత్మస్వరూపా! ఈ దనుజులిరువురు ఏ అస్త్రశస్త్రములచే సంహరింపబడరు. కేవలము హస్తప్రహారముచే మాత్రమే వీరు మరణించెదరు. అదియునూ వీరిరువురూ ఒకేమారు మరణింపవలెను. లేనిఎడల ఒకరిని వేరొకరు జీవింపచేసెదరు” అని పలికెను. అంత కల్కి తన అస్త్ర, శస్త్ర, వాహనములను విడచి, ముందునకేగి ఇరుచేతుల యందు ముష్టిని బిగించి ఒకేమారు ఇరువురి శిరములపై ముష్టిప్రహార మొనర్చెను. తక్షణము స్వర్గలోకమందు దేవతలకు భయముగొల్పినవారు, భూలోకమందు అత్యాచారము లొనర్చినవారు, అయిన ఆ దురాత్ములిరువురు పుడమి పైబడి అసువులు బాసిరి. వెంటనే దేవతలు పుష్పవృష్టి కురిపించిరి. గంధర్వులు గానము, అప్సరసలు నాట్యము కావించిరి. పుణ్యాత్ములైన మునులు వేదపాఠములతో కల్కిని స్తుతించిరి. దేవదుందుభులు మ్రోగినవి. దిశలు నిర్మలమయినవి. తదుపరి కవి తన బాణపరంపర కురిపించి శత్రుసైన్యమందలి పదివేలమంది మహారధులను కూల్చెను. ఆ యుద్ధక్షేత్రమందు ప్రాజ్ఞుడు ఒక లక్షమంది యోధులను, సుమంత్రుడు ఏబదివేల రధికులను, సంహరించెను. వారేకాక గార్గ్య, భర్గ్య, విశాలాది వీరులు సహితము తమ కదనకౌశలము ప్రదర్శించి నిషాధ, మ్లేచ్ఛ, వర్వరులను సంహారమొనర్చిరి. ఈ విధముగ సర్వులను జయించి కల్కి నృపసమూహము, సేనాపరివేష్ఠితుడై భల్లాట నగరము పైకి జైత్రయాత్రకు వెడలెను.

(శ్రీకల్కి పురాణమందు తృతీయాంశ యందలి కోక వికోక వధ అను ఏడవ అధ్యాయము సమాప్తము)

ఎనిమిదవ అధ్యాయము

(శశిధ్వజ, కల్కి సేనా సంగ్రామము)

భల్లాట నగరాధీశ్వరుడు "శశిధ్వజుడు" అత్యంత కృష్ణభక్తుడు. ఆయనకు ఏతెంచుచున్న కల్కి సాక్షాత్ విష్ణుస్వరూపుడని తెలియును. కాలగతి చిత్రము. భగవల్లీలలు ఇంకనూ విచిత్రము. శశిధ్వజుడు మహాత్ముడు, విశాలకాయుడు, చతురంగబల సేనాసమాన్వితుడు, బుద్ధిమంతుడు. ఆయన రోమాంఛితుడై పదివేల గజసేనా పరివృతుడై కల్కిని సంగరమందు ఎదుర్కొనుటకు సంసిద్ధుడయ్యెను. ఆయన ధర్మపత్ని "సుశాంత". ఆమె సహితము అత్యంత విష్ణుభక్తిపరాయణి. కల్కితో యుద్ధమునకు సంసిద్ధుడగుచున్న పతివద్దకేగి ఇట్లనియె "ప్రాణనాధా! పరమ మనోహరరూపుడు, సర్వాంతర్యామీ, సంసారమునకు ప్రభువు, సర్వసమర్ధుడు, కల్కి రూపమున ఉపస్థితుడయిన నారాయణ భగవానునిపై మీరు ఆయుధములు ఎట్లు ప్రహరింపగలరు?" శశిధ్వజుడు "సుశాంతా! నీకు చతుర్ముఖ బ్రహ్మ ద్వారా కావింపబడిన ఒక నియమమును తెలిపెదను. సమరాంగణమునందు గురువు, శిష్యుడు, లేక సాక్షాత్ శ్రీహరి ఎదురైననూ వానిని ప్రహరింపవలసినదే! జీవించియున్న ఎడల సుఖభోగములు అనుభవించెదను. సమరమున మరణించిన ఎడల వీరస్వర్గ మలంకరించెదను. క్షత్రియులకు విజయ, వీరస్వర్గములు రెండునూ ముదావహమే!" అంత సుశాంత "స్వామీ! నృపత్వము, దేవత్వము, విషయభోగలాలస, ఇవన్నియు కాముకులకు, ఉన్మత్తులకు యోగ్యము. కానీ విష్ణుచరణ సేవాసంస్థితులకు కాదు. మీరు సేవకులు. ఆయన స్వామి. మీరు నిష్కాములయిన ఎడల ఆయన ఫలప్రదాత సహితము కాదు. ఈ రెంటినీ మీరు యుద్ధముతో ముడిపెట్టుటకు కారణము కేవలము మీ మోహమే!" అని పలికెను.

శశిధ్వజుడు "సాధ్వీ! సుఖదు:ఖములు, ఈశ్వర, సేవకులు, మొదలగు ద్వంద్వములు శరీరధారణ కారణములు, మాయ అయిన ఎడల ఈ ద్వంద్వములు, ద్వైతభావన సహితము మిధ్యయే! నేను కావించు సమరమునకు కారణము సహితము మాయయే! ఈ యుద్ధము భగవంతునికి నేను కావించు సేవగా తలంపవలెను. ఈశ్వరుడు శరీరధారణ మొనర్చుటచే మాయ యొక్క అంగభూతములైన కామాదులు ఆయన యందు ఆరోపింపబడు చున్నవి. అట్లే సమస్త విషయములు కూడా ఆయన యందు ఆరోపింపబడవలెను కదా! ఈశ్వరుడొక్కడే! ఆతడు తన బ్రహ్మతత్వమందు నిలిచియున్నపుడు బ్రహ్మమగును. శరీరము ధరించినపుడు శరీరి (జీవి) అగుచున్నాడు. ఈ జీవి తన నామరూపాదులందు సంలగ్నుడవక బ్రహ్మమునందు తాదాత్ముడయిన ఎడల జన్మమృత్యుచక్రమునుండి విముక్తుడై పరబ్రహ్మమందు లీనమగును. ఈ మాయాకారణమున ఏర్పడిన స్వామిత్వ సేవకత్వములు విష్ణువు యొక్క సేవగా పరిఢవిల్లును. ఈ ద్వైతాద్వైతములు సజ్జనులకు ధర్మార్ధకామదాయకములు అగును. ప్రియా! అందువలన నేను సేనా సహితుడనై కల్కి భగవానునితో యుద్ధమొనర్చుటకు ఏగుచుంటిని. నీవు సర్వులకు స్వామి అయిన లక్ష్మీపతిని పూజింపుము" అని బదులిచ్చెను. అంత సుశాంత "స్వామీ! మీ హృదయము ఎల్లప్పుడూ విష్ణుసేవా తత్పరత యందే రమించుచుండును. మిమ్ము భర్తగా పొంది నేను కృతార్ధురాలినైతిని. అంతేకాదు ఇహపరములందు విష్ణు భగవానుడు వినా వేరొక గతి లేదు!!" అని పలికెను. తన పత్ని కావించిన మృదుమధుర సంభాషణచే అశ్రుపూరిత నేత్రుడై శశిధ్వజుడు అంతరంగమందు విష్ణుస్మరణ కావించుచూ ఆమెను ఆలింగనమొనర్చి, తదుపరి సేనాపరివృతుడై విష్ణుభక్తియుతుడై సంగరమునకేగెను.

శశిధ్వజుని పుత్రుడు "సూర్యకేతు" మహా పరాక్రమోపేతుడు, యుద్ధవిద్యా విశారదుడు, ధనుర్ధారులందు శ్రేష్ఠుడు, లక్ష్మీ సంపన్నుడు, మరియు విష్ణుభక్తుడు. ఆతడు ముందునకేగి మరు మహారాజుతో సంగరమొనర్చి, ఆ మహీపతిని పరివేష్ఠించిన సేనను చెల్లాచెదురు కావించెను. సూర్యకేతుని సోదరుడు "బృహత్కేతుడు" సుందరుడు, మృదుమధురగాత్రుడు,

మరియు గదాయుద్ధ ప్రవీణుడు. ఆతడు దేవాపితో యుద్ధమొనర్చెను. శశిధ్వజుడు శస్త్రాస్త్రనిపుణుడు, గజసేనా పరివృతుడు అయిన విశాఖయూపునితో సంగరమొనర్చెను. శశిధ్వజుని సేనయందలి ధనుర్ధారులందరిలో అగ్రేసరుడగు "శాంతుడు" రక్తవర్ణ హయమును అధిరోహించిన భర్యునితో ద్వంద్వయుద్ధ మొనరించెను. ఇరుసేనలు గద, బాణములు, శక్తి, ముష్టి, బల్లెములు, ఖడ్గములు, భృశుండి, తోమరములతో తీవ్రయుద్ధము ఒనర్చుచుండిరి. రథముల యొక్క పతాకములు, ముద్రాంకిత ధ్వజములు, ఛత్రములు, చామరములు, మరియు ఎగసినధూళిచే యుద్ధరంగమంతయు అంధకారబంధురమయ్యెను. వీరుల సింహనాదములు, రథముల ఠణఠణలు, ఏనుగుల ఘీంకారములు హయముల హేషణలచే మిన్నునంటుచున్న సమరాంగణ ధ్వనిచే ఉత్ప్రేరితులై దేవ, గంధర్వ, మానవ, తిర్యక్ జాతులన్నియు ఆ భయంకర సంగ్రామమును వీక్షించుట కేతెంచిరి. రథికులు రథికులతోనూ, పదాతులు పదాతులతోనూ ఇట్లు ఎవరికి తుల్యమయిన వారితోవారు సమర మొనరించుచుండిరి. క్రమముగా ఆ యుద్ధము తీవ్రదశను దాల్చి భయంకర తుములయుద్ధముగ పరిణమించినది. గజ, హయ, పదాతుల శరీరములు విదీర్ణములై ఖండింపబడి రక్తము ఏరులై పారినది.

ఆ సమరమందు కొందరు అరచుచుండిరి. కొందరు అలసటతో అస్పష్టముగ పలుకుచుండిరి. కొందరు పరుగులిడుచుండిరి. కొందరు పారిపోవుచుండిరి. కోట్లాది వీరులు తమ ప్రాణములు తృణప్రాయముగ తలంచి యుద్ధమందు ఆత్మార్పణము చేసి వీరస్వర్గ మలంకరించిరి. వారి మృతదేహముల నుండి వెలువడిన రక్తప్రవాహము భూత, పిశాచాదులకు ఆనందము ప్రసాదించుచున్నది. సూర్యకేతు, మరువు లిరువురు అత్యంత లాఘవముతో ఒకరిపై ఒకరు బాణప్రయోగము కావించి ఒండొరులను విదీర్ణుల కావించిరి. అంత మరువుయొక్క బాణప్రయోగముచే కృద్ధుడయిన సూర్యకేతు మరువు రథాశ్వములను సంహరించి, రథమును తుత్తునియలు కావించెను. అంత మరువు ఒక గదను చేత ధరించి సూర్యకేతు వక్షముపై ప్రహరించెను. సూర్యకేతు విచిలితుడై ఒక్క క్షణము మూర్ఛనొంది, పిదప తెప్పరిల్లి తాను సహితము వేరొక గదను గ్రహించి, అద్దానితో మరువుపై ప్రహారము కావించెను. ఆ ఘాతమునకు మరువు మూర్ఛిల్లెను. అంత కుశలుడయిన మరువు సారథి వేరొక రథము తెచ్చి, ఆ రథమందు మరువును ఆశీనుని కావించి యద్ధరంగమునకు దూరముగ గొనిపోయెను.

ఇదే విధముగ బృహత్కేతుడు సహితము దేవాపిని తన బాణవర్షముచే ముంచెత్తెను. మేఘములచే ఆవరింపబడిన సూర్యునివలె దేవాపి కనబడకుండెను. అంత దేవాపి తన ధనువును సజ్జచేసి, బాణప్రహారము కావించి, ఆ బాణ పంజరమును ఛిద్రమొనర్చి రెక్కలు కలిగినవి, శిలా సదృశములయిన సాయకములచే బృహత్కేతుని గాయపరచెను. బృహత్కేతుడు కొంతతడవు ఆగి, తిరిగి బలము సమకూర్చుకొని, దివ్య ధనుర్బాణములు గ్రహించి గ్రద్ద ఈకలు అమర్చినవి, బంగారువన్నె కలిగినవి, అగ్రభాగము పదునయిన ఇనుముతో చేయబడిన సాయకములు సంధించి, విడచి దేవాపి శరీరమును విదీర్ణమొనర్చెను. అంత దేవాపి తన ధనుష్పాండిత్య ప్రకర్షచే తిరిగి విజృంభించి బృహత్కేతుని దివ్య ధనువును ముక్కలు ముక్కలు గావించెను. అంత బృహత్కేతుడు తన ధనస్సు ఛిద్రమగుటచే అత్యంత క్రోధితుడై, చేత కరవాలము ధరించి, దేవాపి రథము వద్దకేతెంచి ఆతని రథసారథిని, హయములను సంహరించెను. అంత దేవాపి తనకు దగ్గరగా ఏతెంచిన బృహత్కేతు యొక్క భుజముల మధ్యభాగమును తన అరచేతితో బలముగ ప్రహరించెను. అంత పద్ధెనిమిది సంవత్సరముల బాలుడయిన బృహత్కేతువు మూర్ఛనొందెను. దానినికాంచి ఆతని సోదరుడయిన సూర్యకేతు అత్యంత కృద్ధుడై కన్నుల అగ్నికణములు రాలుచుండగా దేవాపి శిరముపై ముష్టిఘాత మొనర్చెను. వజ్రసదృశ ముష్టిఘాతము సహింపనోపక దేవాపి మూర్ఛనొందెను. అంతటితో క్రోధము చల్లారక సూర్యకేతు చిచ్చరపిడుగు వలె విజృంభించి దేవాపి యొక్క సేనాగణమును అట్టడిగించెను. ఆ సమయమున యుద్ధక్షేత్రమందు వేరొకచోట శశిధ్వజుడు సూర్యతేజుడు,

పీతాంబరధారి, కమలనేత్రుడు, విశాలబాహుడు, సుందర ముకుటాలంకృతుడు అయిన కల్కి భగవానుని కాంచెను. ఆ సమయమున కల్కి భగవానుడు మణిమయభూషణుడై సమస్త ప్రాణుల హృదయాంధకారమును దూరమొనర్చుచూ, విశాఖయూపాది మహీపతులు, ధర్మము, కృతయుగములచే పరివేష్ఠితుడై యుండెను.

(శ్రీకల్కి పురాణమందు తృతీయాంశ యందలి శశిధ్వజ, కల్కిసేనా సంగ్రామము అను ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

తొమ్మిదవ అధ్యాయము

(ధర్మ, కల్కి, కృతయుగాపహరణము)

సూతుడు చెప్పదొడంగెను "సర్వుల హృదయమందు ధ్యానయోగ్యుడు, పూర్ణుడు, ఖడ్గపాణి, అశ్వారోహుడు, ధనుర్ధారి, సర్వాభరణభూషితుడు, పాప, కష్ట నివారణాతత్పరుడు, సర్వశ్రేష్ఠుడు, పరమాత్మ స్వరూపుడు అయిన కల్కి భగవానుని కాంచి శశిధ్వజుడు పులకిత శరీరుడై ఇట్లనియె "ఓ! కమలనేత్రా! రమ్ము! రమ్ము!! నా హృదయముపై ప్రహరింపుము. నీవు నిర్గుణుడవైనప్పటికీ గుణములు గ్రహించి ప్రవర్తిల్లెదవు. అద్వైతుడవయినప్పటికీ ఆయుధపాణి వగుదువు. నిష్కాముడవు అయినప్పటికీ విజయప్రాప్తికై సేనల సహాయము స్వీకరించెదవు. ఇటువంటి పరమాత్మతో రధారూఢుడనై నేడు నేను సంగరమొనరించెదను. ఒకవేళ నీకు నా సాయకములనిన భయమైనచో అంధకారబంధురమయిన నా హృదయమందు ప్రవేశింపుము. స్వామీ! మీరు సర్వవ్యాపకులు అయినప్పటికీ నేను దృఢమయిన శస్త్రములను మీపై ప్రయోగించెదను. ఎందుకనగా నేను మీనుండి అభేదుడను. నేను మీయందు భేదము పాటించిన ఎడల శివకేశవుల యందు భేదము పాటించిన వారలు ఏగు లోకమునకేగుదురు." (తాత్పర్యము!వివరణ:సంధ్యావందనమందు ఒక మంత్రము యున్నది. **శివస్య హృదయం విష్ణు:విష్ణుస్య హృదయగం శివ: యధాంతరం నపశ్యామి;తధామే స్వస్థిరాయుషి.** అనగా శివకేశవులు ఒకరి హృదయమందు వేరొకరు యుందురు. వీరి నడుమ భేదము చూచువారల క్షేమము, ఆయుష్షు నష్ఠమగును. అనగా నరకగాములగుదురు.)

ఈ పలుకులు విని క్రోధరహితుడయిన పరమాత్మ క్రోధము అభినయించి ఆయుధపాణియై శత్రుదమనుడయిన శశిధ్వజుని ప్రహరించెను. అంత ఆ మహీపతి ప్రతిస్పందించి ధనుర్బాణములు చేతబట్టి పర్వతముపై కురియు వర్షధారల వలె కల్కిపై సాయకవర్షము కురిపించెను. నారాచ వర్షముచే సంతప్తుడై కల్కి తాను సహితము ప్రత్యర్థిపై బాణప్రయోగము కావించెను. వారిరువురు ఒండొరులపై అనేక దివ్యాస్త్రశస్త్రములు ప్రయోగించిరి. బ్రహ్మాస్త్రమును బ్రహ్మాస్త్రముతో, వాయువ్యాస్త్రమును పర్వతాస్త్రముతో, ఆగ్నేయాస్త్రమును పర్జన్యాస్త్రముతో, నాగాస్త్రమును గారుడాస్త్రముతో ఈ విధముగ ఒండొరులు అస్త్రసంధానము కావించిరి. ఈ భయంకరాస్త్రములతో ఆచరింపబడు సంగరమును గాంచి సర్వులు యుగాంతమేతెంచెనని తలచిరి. అంబరమందలి బాణాగ్నిచే ఆకాశగమనలయిన దేవతలు వారి గమనమును మానిరి. ఇరువురు ఒకరినొరకు ఓడింపవలెనన్న తృష్ణతో కావించు ప్రయత్నములన్నియు నిష్ఫలమయ్యెను. ఇక శస్త్రములన్నియు లుప్తమయి ఇరువురు బాహాబాహీ, ముక్కాముక్కీ, మల్లయుద్ధమొనర్ప మొదలిడిరి. ఇరువురు ప్రతివీరుని యుద్ధకుశలతను అభినందించిరి. అంత కల్కి శశిధ్వజుని తన అరచేతితో ప్రహరించెను. అద్దానిచే రాజు మూర్ఛితుడై, కొన్ని క్షణముల తదుపరి తేరుకొని క్రోధోద్రిక్తుడై కల్కిపై వజ్రసదృశమయిన ముష్ఠిప్రహార మొనర్చెను. అంత కల్కి మూర్ఛితుడై నేలపైబడెను. సర్వలోక ప్రభువయిన కల్కి మూర్ఛితుడగుట కాంచి ధర్ముడు, కృతయుగపురుషుడు ఆయనను తీసికుని వెళ్ళుటకు

ఏతెంచిరి. అంత శశిధ్వజుడు వారిరువురినీ తన బాహుమూలములందు బంధించి, కల్కిని తన వక్షస్థలముపై నిడుకొని నగరమందలి తన భవనమున కేతెంచెను. మిగిలిన కల్కి సహాయకులందరికీ రాజపుత్రుల నోడించుట అశక్యమయినది.

శశిధ్వజ మహీపతి ఈవిధముగ ఆ ముప్వురినీ తీసికొని పులకిత హృదయుడై రోమాంఛితుడై తన భవనమునకేగి విష్ణు కథాగానము ఆలపించుచున్న మనోహరి, పద్మముఖి, అయిన తన ధర్మపత్నితో ఇట్లనియె "ఓ! సుశాంతా! నా ప్రహరణముచే మూర్ఛితుడయెనన్న నెపముతో ఈ కల్కి భగవానుడు నీ సేవలందుకొనుటకు ఏతెంచెను. నా బాహుమూలములందున్న ఈ పుణ్యపురుషులు ధర్మ, కృతయుగములు. నీవు ఈ భగవానుని దర్శనమొనర్చి అత్యద్భుత పూజావిధికి సమాయత్త మొనర్పవలసినది. ఆ రాజమహిషి హృదయానందమునొంది కల్కిభగవానునకు, ధర్మ, కృతయుగములకు వందనమొనర్చి, సిగ్గువిడచి తన సఖులతో కలసి విష్ణుకథా, గుణగాన మొనర్చుచూ ఆనందతాండవము కావించినది.

(శ్రీకల్కి పురాణమందు తృతీయాంశ యందలి ధర్మ, కల్కి, కృతయుగాపహరణము అను తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

పదియవ అధ్యాయము

(కల్కి, రమా వివాహము)

తదుపరి సుశాంత ఈవిధముగ కల్కి భగవానుని ప్రార్థించినది "ఓ! మహాప్రభూ! నీకు జయమగుగాక! ఇంద్రాది దేవతాప్రముఖులచే ఎల్లప్పుడూ స్తుతింపబడు స్వామీ! సర్వాభరణభూషితా! నిరంతరము సజ్జనులచే పూజింపబడు చరణకమలములు కలవాడా! మహామతీ! నీ మూర్ఛను త్యజింపవలసినది. సంతజనుల హృదయకమలములందు స్థితిగతమయిన నీ శరీరము అపూర్వ లావణ్యమయము, మరియు కామదేవుని మనసును సహితము మోహింపజేయునది. ప్రభూ! నా పవిత్రాశయములు పూర్ణమగురీతిని నీవు కార్యాచరణము కావింపవలసినది. నీ యశోగానము సంసారసర్పదష్ట కష్టములను నష్టమొనరించును. నీ సుకుమార కథామృతము సర్వులకు ప్రసన్నతను ప్రసాదించును. సర్వ చిత్తాపహారకమయిన నీ చిద్విలాసము అమృత సరోవరము. పూర్ణచంద్ర నిభాననమయిన నీ ముఖాంభోజము సంసారజీవులందరి కళ్యాణముల కాలవాలము. సర్వులకు దుర్జయుడయిన నా భర్త మీఎడల ఏదేని అనుచిత కార్యమొనర్చిన ఎడల వానియందు శత్రుత్వము వహింపక, దయాళువై ఆయనను క్షమింపవలసినది. మీ మాయ అయిన మూలప్రకృతి ద్వారా మహత్తత్వము, అహంకారము, పంచ తన్మాత్రలచే మా శరీరములన్నియు నిర్మింపబడినవి. మీ కేవల లీలాపూర్వక కృపాకటాక్ష వీక్షణములచే బ్రహ్మ సృష్టి యొనరించుచున్నాడు. ఇంద్రియాత్మకమయిన ఈ నా శరీరము పంచభూత (ఆకాశము, వాయువు, అగ్ని, జలము, భూమి) సంఘాతముచే నిర్మింపబడి, త్రిగుణములచే (సత్వ, రజస్; తమోగుణములు) ప్రవర్తిల్లుచున్నది. ఇదంతయు ఓ! సర్వవ్యాపకా నీ సేవ యొనర్చుట కొరకే!! అందువలన ప్రభూ! నాయందు దయ చూపింపవలసినది.

స్వామీ! నీ పరమకళ్యాణ శుభనామము గుణములకు ఆవాసము, పాపములను దగ్ధమొనరించి భయమును బాపునది. నీ నామమును నిరంతరము స్మరించి ప్రశంశించు పుణ్యాత్ములు పాపములను భస్మమొనరించి పునరావృత్తి రహితమయిన మోక్షము నొందెదరు. పరంధామా! నీ అవతార స్వీకరణ సజ్జనుల గౌరవమును ఇనుమడింపజేయును.

బ్రాహ్మణులకు ఉన్నతి, దేవతలకు రక్షణ, ధర్మమునకు వృద్ధి, సత్యయుగమునకు ప్రవృత్తి కలుగజేసి కలివంశమును నాశనమొనరించును. మహాప్రభూ! నీ అవతారరూప వ్యవహారమంతయు నాకు కళ్యాణమొనరించుగాక! శరణాతవత్సలా! నాఈ పతి, పుత్రపౌత్రాదులు, మణిజటిత స్వర్ణాభరణములు, ఆసనములు, భవనములు, చతురంగ బలములు, రాజ్యము అన్నియు మీ చరణసన్నిధి సేవచేయక వృధాకదా! ఓ! జగదాధారా! జగద్వశమునకై నీవు స్వీకరించిన శరీరము, చిత్తాపహరణమొనర్చు నీ చిద్విలాసము, అకళంకితమయిన నీ ముఖపద్మము, మధురిమ లొలకించు నీ దివ్యవాణి నాకు లభింపనిచో ఇకనాకు మృత్యువే శరణ్యము. ఓ! అవిక్రమ పరాక్రమోపేతా! అశ్వారూఢుడవై నీవు భూమండలమందు జరిపిన జైత్రయాత్ర సర్వుల భయము దూరమొనర్చును. నీ తీక్షణ సాయక పరంపరచే మహా పరాక్రమోపేతులయిన ప్రత్యర్థులను నిర్వీర్యులొనర్చి పరాజితుల కావించినప్పటికీ వారి పాలన, పోషణ నీవే వహించెదవు. బ్రహ్మ, రుద్రులకు సహితము నీవే ఆధారము. నీ ముఖబింబము వందలాది పూర్ణచంద్రుల ఆహ్లాదము నిచ్చును."

సుశాంత యొక్క ముఖమునుండి తన గుణకీర్తనము నాలకించిన కల్కి భగవానుడు మిక్కిలి ప్రసన్నుడై నిద్రనుండి లేచినటుల మెలకువనొంది తన ఇరువైపులా ధర్మ, కృతయుగ పురుషులను, వెనుక శశిధ్వజుని కాంచి ఇంచుక లజ్జితుడై ఇట్లనియె "ఓ! పద్మనేత్రా! నా సేవాతత్పరవయిన నీవు ఎవరు? నా వెనుక ఈ శూరుడయన శశిధ్వజుడు ఏల నిలబడెను? ఓ! ధర్మ, కృతయుగములారా! మనము రణభూమిని వదలి ఈ శత్రు అంత:పురమును ఎట్లుచేరితిమి? ఈ శత్రుపత్ని నాకు ప్రసన్నతా పూర్వకముగ ఎందుకు సేవ ఒనరించుచున్నది? తన పరాక్రమమందు స్వాభిమానము గల శశిధ్వజ మహారాజు నన్ను రణమందు ఏల సంహరింపలేదు?" అంత సుశాంత "భగవాన్! స్వర్గ, మర్త్య, పాతాళములందు, దేవ, దానవ, మానవ, నాగాదులందు నారాయణసేవ కావింపని వారెవరు స్వామీ! ఎవని కడగంటి చూపులతో బ్రహ్మాండమందలి శత్రుత్వము నశించునో అటువంటి నారాయణప్రభువు ఉపస్థితుడై యున్నచోట శత్రుత్వ మెట్లుండును? నా పతి మీయందు శత్రుభావము వహించని ఎడల మీ పవిత్ర చరణస్పర్శ మాగృహమునకు, మాకు, దొరకునా? ఓ! కరుణావత్సలా! నా పతి మీ సేవకుడు. నేను మీ దాసిని. మాపై కరుణామృతధారలు వర్షించుటకై మీరు మా గృహమున కేతెంచిరి" అని పలికెను. అంత ధర్ముడు "ఓ! కలినాశకా! మీ ఎడల ఈ దంపతికి యున్న భక్తికి, వీరు కావించిన ఈ స్తోత్రమును విని, కాంచి నేను కృతార్థుడనైతిని! కృతార్థుడనైతిని!! అని ప్రస్తుతించెను. కృతయుగము "మీ ఎడల ఈ శశిధ్వజ దంపతికి గల భక్తి, ప్రేమను గాంచి సత్యయుగ మేతెంచినది అని నేనిప్పుడు నమ్ముటమే గాక నా నామము సత్యయుగమునకు సార్థకత అబ్బినది" అని పలికెను.

శశిధ్వజుడు "ఓ! సర్వవ్యాపీ! నేను కామాదులకులోనై, యోధుడనని తలచి మీపై శస్త్రాస్త్ర ప్రహరణము కావించితిని. నేను కావించిన కార్యము దండనార్హము. నన్ను దయచేసి దండింపవలసినది" అని పలికెను. అంత కల్కి భగవానుడు మందహాసము చేయుచూ "శశిధ్వజా! నేను మీ భక్తిచే పరాజితుడనైతిని" అని పున: పున: పలికెను. తదుపరి శశిధ్వజుడు తన పుత్రులను, మరు, దేవాపి, విశాఖయూపుడు, శయ్యాకర్ణులను యుద్ధరంగము నుండి వెనుకకు పిలపించి, తన సతి యొక్క మనసును తెలిసినవాడగుటచే తమ పుత్రిక అయిన "రమ"ను కల్కికి ఇచ్చి వివాహమొనరించుటకు నిశ్చయించెను. భల్లాట నగరమంతయు ఆ సేనావాహినిచే నిండి సుందర కోలాహలమేర్పడెను. కల్కి, రమల వివాహ మహోత్సవము తిలకించుటకు వివిధదేశపు మహీపతులందరూ తమ సేనాసహితులై ఏతెంచిరి. శంఖ, భేరీ, మృదంగ వాద్యములు మిన్నుముట్టుచుండగా, నృత్య, గీతముల మధ్య పతివ్రతలైన ముత్తైదువల మంగళ కార్యములచే కల్కి, రమల వివాహము కన్నుల పండువగా జరిగెను. ఏతెంచిన రాజులందరూ యధావిధిగ సత్కరింపబడిరి. వివిధ ప్రకారమలుయిన భక్ష్య, భోజ్య, చోష్య, లేహ్యములచే సర్వులు సంతృప్తులైరి. చాతుర్వర్ణములవారూ ఆ దివ్య నవదంపతిని చూచుట కేతెంచిరి. తారల మధ్య శోభించు పూర్ణచంద్రుని వలె ఆ రాజనీకము మధ్య కల్కి భగవానుడు సర్వజనాకర్షకుడై నిలచెను. రమాసహిత

కల్కి భగవానుని కాంచి శశిధ్వజ దంపతి పరమాత్ముని జామాతగా పొంది తాము ధన్యత నొందితిమని శాంతమనస్కులై కూర్చొనిరి.

(శ్రీకల్కి పురాణమందు తృతీయాంశ యందలి రమాకల్కి వివాహమును పదియవ అధ్యాయము సమాప్తము)

పదకొండవ అధ్యాయము

(నృపగణ శశిధ్వజ సంవాదము; జాతిస్మర కథనము)

సూతుడు "ఆ సమయమున ఒక సంఘటన జరిగినది. పరిపూర్ణ భక్తిచే తన్మయులయిన శశిధ్వజ సుశాంత దంపతిని ధర్ముడు, సత్యయుగ పురుషుడు చూచుచుండగా వివాహమున కేతెంచిన రాజులందరూ ఇట్లు ప్రశ్నించిరి "ఓ! పుణ్యదంపతీ! మీరు సాక్షాత్ నారాయణ స్వరూపుడయిన కల్కిని జామాతగా పొందిరి. ఇచటి కేతెంచిన ఋషి, ముని, బ్రాహ్మణ, రాజ, సర్వ వర్ణులందరూ విష్ణు భగవానుని ఎడల మీకు గల భక్తికి ఆశ్చర్యచకితులము అగుచున్నాము. పరమాత్ముని యందు ఇంతటి శుద్ధభక్తి మీకిరువురికీ ఎట్లు కలిగినది! ఈ నిష్కళంకభక్తి మీకెవరయిననూ భోదించారా? లేక స్వాభావికముగ అలవడినదా? త్రిలోకములను పవిత్ర మొనరించునది, సంసార బంధనమునుండి ముక్తి ఒసంగునది అయిన భగవత్ సంబంధమగు మీ చరిత్ర వినవలెనని మాకు ఉత్సుకత కలుగుచున్నది. దయచేసి తెలుపవలసినది." అంత శశిధ్వజుడు ఇట్లు పలికెను "భగవద్భక్తులారా! మా ఇరువురి చరితను, జన్మ కర్మాదులను, స్మృతి, భక్తి లక్షణములను వివరించెదను. దయచేసి వినవలసినది. కొన్ని వేల యుగముల పూర్వము నేను ఒక గ్రద్దవలె జన్మించితిని. నా ఈ భార్య అపుడు ఒక ఆడగ్రద్దయై నా భార్య అయినది. మేమిరువురము ఒక వృక్షపు కొమ్మపై గూడుకట్టుకొని నివసించుచుంటిమి.

మేము చనిపోయిన మృగముల మాంసభక్షణము కావించుచూ ఆ వన, ఉపవనములందు స్వేచ్ఛగా విహరించుచూ జీవనము గడపుచుంటిమి. ఒకానొక దినము పచ్చిమాంసమును భక్షించు ఒక క్రూరుడయిన వేటగాడు మా పక్షులజంటను చూచి ఆశాపూరితుడై, తన పెంపుడుగ్రద్దను మా గూటి వద్ద యుంచెను. ఆ సమయమున ఆకలిచే అలమటించుచున్న మేమిరువురు ఆ గ్రద్ద వద్దకు చేరి ఆ వేటగాని వలకు చిక్కితిమి. అంత ఆ క్రూరుడేతెంచి మా కంఠములను పట్టుకొనెను. మేమిరువురము మా చంచువులతో వానిని పొడిచి మిక్కిలి బాధను కలిగించితిమి. అంత ఆ పచ్చిమాంసము తిను వ్యాధుడు గండకీనది సమీపమున గల ఒక పెద్ద రాయిపై మమ్ముల నిరువురినీ బలముగా మోది మా శిరములు ఖండించెను. కానీ మా అదృష్టవశాత్తు ఆ శిల గండకీనది నుండి బయల్వెడలిన చక్ర చిహ్నములు గల సాలిగ్రామమగుటచే మరణించిన మేమిరువురము చతుర్భుజులుగ మారి, సర్వులచే వందితులమై ఒక దివ్యవిమానమందు వైకుంఠధామమున కేగితిమి. అచట వంద యుగములుండి అచటినుండి బ్రహ్మలోకమున కేగితిమి. బ్రహ్మలోకమున ఐదువందల యుగములుండి, అత్యంత ఆనందప్రాప్తి నొంది, అచటినుండి దేవలోకమున కేతెంచి అచట నాలుగువందల యుగములు నివసించితిమి. తదుపరి మేము తిరిగి మృత్యులోకమందు జన్మించితిమి. కానీ శాలిగ్రామశిలపై మరణించిన కారణమున శ్రీవిష్ణుకృపచే మాకు పూర్వజన్మ వృత్తాంతమంతయు జ్ఞప్తియున్నది. ఇక గండకీనది యొక్క పవిత్రత, మహిమ ఏమని తెలుపుదును? ఆ దివ్యసరితాజల స్పర్శమాత్రమున నాకు పూర్వజన్మ విశేష జ్ఞాపకముదయించినది. కేవల చక్రాంకిత శిలా స్పర్శనమే ఇంతటి ఫలము ప్రసాదించిన ఎడల నిజముగ వాసుదేవ భగవానుని సేవచే లభించు పుణ్యఫలము వర్ణించుట నాకశక్యము. అందువలన మేము విష్ణుపూజ యందు నిమగ్నులమై, ఉన్మత్తులమై, హరి గుణకీర్తన, నృత్యాదులు

కావించుచూ హర్షాతిరేకముతో ఆనంద డోలికలందూగుచూ మేమిరువురము కాలము గడుపుచున్నాము. నేను చతుర్ముఖ బ్రహ్మదేవుని ముఖతా నారాయణుడు కల్కిగా అవతరించి కలిని నాశమొనరించునని వింటిని. ఈ కల్కిభగవానుని వీరత్వము సర్వలోక విదితము.”

ఈ విధముగ పలికి శశిధ్వజుడు రమాపతి అయిన కల్కికి పదివేల ఏనుగులు, ఒక లక్ష గుఱ్ఱములు, ఆరువేల రథములు, ఆరువందల దాసదాసీజనము, అనేక మణి, రత్న, సువర్ణ భూషణములను బహూకరించి ఆ దంపతి తమను తాము కృతకృత్యులుగ భావించిరి. సభాసదులందరూ ఈ పరమాద్భుతగాథ విని, శశిధ్వజదంపతిని సంపూర్ణులుగ భావించి, కల్కి భగవానుని ప్రశంశ, స్తుతి, ధ్యానాదులు కావించి తిరిగి శశిధ్వజుని భక్తి మరియు భక్తి లక్షణముల గూర్చి ఇట్లు ప్రశ్నించిరి “రాజా! భగవద్భక్తి ఎట్లుండును? భగవద్భక్తుడు ఎట్లుండును? ఏమి కావించుచుండును. ఏమి తినును? ఎచట నివాసముండును? ఏవిధముగ భాషించును? ఓ! రాజశ్రేష్ఠుడా! నీ కృష్ణభక్తి కారణముగ, పూర్వజన్మ వృత్తాంతమంతయు జ్ఞప్తియుండిన కారణమున, ఈ సంసారమును పవిత్ర మొనరింపవలెనన్న కృష్ణసంకల్ప కారణమున, ఈ ప్రశ్నలన్నింటికీ దయచేసి మాకు జవాబులు తెలియజేయవలసినది.”

ఈ పలుకులు వినిన రాజు తాను బ్రహ్మ సదనమున వినిన సంభాషణలు జ్ఞప్తికి తెచ్చుకొని “మీరందరూ ధన్యులు. అందువలననే ఈ ప్రశ్నలు అడుగుచుండిరి. ఒకనాడు బ్రహ్మసభయందు అనేకమంది మహర్షులు ఆశీనులై యుండిరి. ఆ శుభ సమయమున సనక మహర్షి నారదుని మీరడిగిన ప్రశ్నలే అడిగెను. ఆ పరమ పుణ్యాత్ముల సంభాషణ వారి దివ్యాశీశ్శులచే నేను సహితము వింటిని. ఈ ఆఖ్యానము పరమ పాపనాశకము మరియు పుణ్యదాయకము. దీనిని మీరందరూ వినవలసినది. సనకుడు “ఓ! నారదమునీంద్రా! జన్మమృత్యువులను రెండు చివర్ల మధ్య సంచరించుచూ, సంసారచక్రమును దూరమొనరించు హరిభక్తి అనగా ఏమి? మాకు విస్తారముగ తెలియజేయవలసినది.” నారదమహర్షి “సంసారచక్రమందు పరిభ్రమించుచున్న మానవుడు తన మనస్సును, ఇంద్రియములను ఏకాగ్రమొనర్చి, వశము చేసికొని గురువు వద్దకు ఏగవలెను. గురువు ప్రసన్నుడయిన ఎడల భగవానుడు ప్రసన్నుడగును. గురూపదేశముచే **“ఓం నమ: స్వాహా”** అను మంత్రము గ్రహించి, అద్దానిని ఏకాగ్రతతో ఉచ్చారణ మొనర్పవలెను. తదుపరి సర్వాంగసుందరమయిన వాసుదేవమూర్తిని హృదయకమలమందు వీక్షించుచూ షోడశోపచార పూజన కావించవలెను. ఈవిధముగ భావనచేసి ధ్యానమొనర్చుచూ మనసా, వాచా, ఇంద్రియ సహితుడై తనను విష్ణుభగవానుని చరణకమలములకు అర్పణము కావించుకొనవలెను. సమస్త దేవతానీకము సాక్షాత్ విష్ణుభగవానుని రూపములే! వీరెవ్వరూ అభిన్నులు కారు. అంతేకాదు. సమస్త జీవకోటి పరమాత్మ స్వరూపములే! జీవులు తమ అజ్ఞానకారణమున, మరియు పరమాత్ముని మాయ కారణమున భిన్న ఉపాధుల యందున్నవారిని నామరూపాత్మకముగ వేరువేరుగా తలచెదరు.

కానీ జ్ఞానులు తత్వత: సర్వభూతములయందు ప్రవర్తిల్లెడిది పరమాత్మయే అనియు, పరమాత్మయే సృష్టిస్థిత్యంతములకు కారణభూతమని తెలిసికొని అద్దానిని నుడివెదరు. అదే విధముగ భక్తులు సహితము అవిద్య కారణమున సేవ్యుడు, సేవకుడు, ఈవిధముగ పరమాత్ముని నుండి తమను వేరుపరచుకొని ద్వైతభావ మవలంబించెదరు. కానీ నిజమునకు ఉన్నది ఆ పరమాత్మ – విష్ణువు / కృష్ణుడు / కల్కి ఒక్కడే!!! కానీ ద్వైత భావమునున్న భక్తులు విష్ణు భగవానుని స్మరణ, కీర్తన కావించుచూ, ఆయనకు సంబంధించిన కార్యము లాచరించుచుందురు. ఈ ఆచరణముచే భక్తులకు సుఖానందములు ప్రాప్తించును. ఈ భక్తులు ఉన్మత్తులవలె నవ్వుచూ, ఏడ్చుచూ, నృత్యమొనర్చుచూ, తిరుగుచూ, క్రిందపడుచూ, సర్వకాల, సర్వావస్థల యందునూ భగవంతునే స్మరించుచూ తమనుతాము మరచెదరు. ఈ విధములయిన తీవ్రభక్తి దేవ దానవ, మానవ సహిత సమస్త లోకములను పవిత్ర మొనరించును. ఇటువంటి భక్తి ప్రకటితమయిన అయ్యది బ్రహ్మము, త్రిమూర్త్యాత్మకము, మరియు వేదాదుల కంటె శ్రేష్ఠతరము.

ఈ సంసారమందు ద్వైతము ఆచరించువారలందు సత్వగుణాభ్యాసముచే భక్తులగుదురు. రజోగుణాభ్యాసముచే ఇంద్రియవిషయ భోగములందు లాలస నొందెదరు. తమోగుణాభ్యాసులు క్రూరకర్ములగుదురు. సత్వగుణ సంపన్నులు నిర్గుణతను (మోక్షము), రజోగుణ సంపన్నులు విషయ భోగములను, తమోగుణ సంపన్నులు నరకమును పొందెదరు. దేవతా, దేవీమూర్తులకు అర్పింపబడిన పదార్థము "నైవేద్యము" అని పిలువబడును. ఈ నైవేద్యము శుద్ధము, స్వస్తిదాయకమగును. భక్తులు ఈ నైవేద్యమును ప్రసాదముగ స్వీకరించెదరు. ఈ ప్రసాదము ఎల్లప్పుడూ "సాత్విక" భోజనముగ పరిగణింపబడును. ఇంద్రియములకు ఆనందము నొసంగునది, రక్త, వీర్య వృద్ధినొనరించునది, దీర్ఘాయువు, నిరోగత్వము కలిగించు పవిత్ర భోజనము "రాజస" భోజనముగ పరిగణింపబడును. మిక్కిలి పులుపు, చేదు, వేడి, మంట కలిగించు భోజనము "తామస" భోజనమనబడును. సాత్వికులు తపోవనములందు, రాజసికులు గ్రామములందు, తామసికులు జూద, మద్యశాలలందు నివసించెదరు. మీకొక విస్మయాస్పదమయిన విషయము తెలిపెదను. భక్త, భగవానుల మధ్య అనిర్వచనీయమయిన ప్రీతి, ప్రేమ యుండును. భక్తుడు భగవంతుని ఏమియునూ కోరడు. భగవంతుడు భక్తునకు ఏమియునూ ఈయడు." ఈవిధముగ భక్త, భగవానుల అనుబంధము, గుణముల ద్వారా జీవుల ప్రవర్తన గూర్చి తెలిపి నారదుడు మౌనము వహించెను. సనక, సనందనాదులు ఆయనకు నమస్కృతులర్పించి ఇంద్రలోకమునకు చనిరి.

(శ్రీకల్కి పురాణమందు తృతీయాంశ యందలి నృపగణ శశిధ్వజ సంవాదము, జాతిస్మర కథనము అను పదకొండవ అధ్యాయము సమాప్తము)

పన్నెండవ అధ్యాయము

(భక్తి, భక్త మహాత్మ్యము)

శశిధ్వజుడు "మహాత్ములారా! మీకు పరమపావనము, విష్ణుభగవానుని తెలుపు భక్త, భక్తి విషయవిశేషముల గూర్చి తెలిపితిని. ఇంకనూ మీరేమి వినదలచుకొంటిరి?" రాజులు "మహాత్మా! మీరు శ్రేష్ఠ విష్ణుభక్తులు మరియు సర్వ ప్రాణిహితమందు తత్పరులు. సాధారణముగ సజ్జనులు విషయభోగలిప్తులయిన ప్రాణులకు తమ ప్రాణ, బుద్ధి, ధన, వాణి ద్వారా హితమొనర్చెదరు కదా! అయిననూ సమరమొనర్చి హింస కావింపవలెనన్న ప్రవృత్తి మీకు ఎట్లు కలిగెను?" అని ప్రశ్నించిరి. శశిధ్వజుడు "ద్వైతమును ప్రకాశింపజేయునది, త్రిగుణాత్మకము, ఇచ్ఛానుసారము రూపము స్వీకరించునది అయిన మాయ లేక మూలప్రకృతి ఈ సమస్త చరాచరయుక్తమయిన త్రిలోకములను, వేదములను ఉత్పన్నము కావించినది. విషయభోగములందు తాదాత్మ్యులైన జనులందు అధర్మ నాశనమునకు, ధర్మాచరణమునకు విష్ణుభక్తి ప్రతిపాదింపబడినది. ఋషులు, వేదవేదాంగ పారంగతులయిన వాత్సాయనాది మునులు వివేక వాక్యములను మనసునందు స్థిరమొనర్చుకొని విష్ణుభగవానునికై యజ్ఞము లొనర్చెదరు. ఇట్టి వేదధర్మము ననుసరించి మేము సహితము కర్మ, ధర్మములను విశ్వసించి యుద్ధప్రియులమైతిమి. అట్లే వేదవాక్యానుసారము నాపై దండయాత్ర కావించిన వారిని ప్రతిఘటించి యుద్ధమొనర్చుట సహితము అధర్మము కాదు. (తాత్పర్యము: క్షత్రియులకు సమరమొనరించుట స్వధర్మము; మరియు వేదసమ్మతము). సర్వ వేదార్థజ్ఞాత అయిన వేదవ్యాసమహర్షి "అవధ్యులను సంహరించుట ఎంత పాపమో అట్లే వధ్యులను ఉపేక్షించుట సహితము అంతే పాపము" అని శలవిచ్చెను. ఈ పాపమునకు ప్రాయశ్చిత్తము లేదు. అందువలన దుర్నిరీక్షణములైన ఈ కల్కిభగవానుని చతురంగబలములను ఎదుర్కొని, సేనలను వధించి దర్మ, కృతయుగ సహిత కల్కిభగవానుని ఇచటకు తీసికొని వచ్చితిని. నా ధర్మము ననుసరించి ఇదియే భక్తి. మీరు మీ అభిమతములను తప్పక తెలుపవచ్చును. **"వ్యాప్నోతి**

ఇతి విష్ణు:" అనునది వేదవాక్యము. అనగా సర్వమునందు వ్యాపించినవాడు విష్ణువు. అదే నిజమయిన చంపెడిదెవ్వరు? చంపెడిదీ విష్ణువే! చచ్చెడిదీ విష్ణువే!! అపుడు ఎవరు ఎవరిని వధించుచున్నారు?"

"వేదములు తెలిపిన ప్రకారము యజ్ఞమందు, యుద్ధమందు కావింపబడు వధ వధకాదు. ఇత:పూర్వము మునులు, పదునాల్గుమంది మనువులు సహితము దీనినే శ్లాఘించిరి. అందువలన నేను విష్ణు భగవానుని యజ్ఞములచే, యుద్ధములచే పూజించెదను. అందుచే జనులు భగవానుని మాయను ఆశ్రయించి స్వామి, సేవక భావము వహించి విధివిధానముగ యజ్ఞములాచరించి భక్తులై సుఖము నొందవలెను" అని బదులిచ్చెను. రాజులు తిరిగి ఇట్లు ప్రశ్నించిరి "మహారాజా! శశిధ్వజా! పూర్వకాలమందు ఇక్ష్వాకు పుత్రుడయిన నిమిచక్రవర్తిని వశిష్ఠమహర్షి శపించెను. తత్కారణమున ఆయన మరణించెను. కానీ దేవతలు దయాళువులై ఆ మహారాజు యొక్క శాపమును శమింపజేసి తిరిగి ఆయనను తన శరీరమందు ప్రవేశింపమని ఆదేశించిరి. కాని నిమిచక్రవర్తి అట్లు కావించుటకు నిరాకరించెను కదా! ఆయనకు కర్మభోగమును అనుభవించుటకు ప్రాప్తించిన శరీరమందు ప్రవేశించుటకు నిరాకరించు వైరాగ్యమెట్లు కలిగెను? అట్లే నిమిచక్రవర్తి సహితము వశిష్ఠునకు ప్రతిశాపమిచ్చుటచే వశిష్ఠుడు మృతినొందెనని వింటిమి. కానీ మహర్షి తిరిగి శరీరము నొందెను కదా! భక్తులు ముక్తులయిన ఎడల మరి ముక్తశరీరులు తిరిగి జన్మను, శరీరమును ఏల గ్రహించెదరు! భగవానుని మాయను అతిక్రమించుట జితేంద్రియులకు సహితము దుర్లభము. ఈ మాయా ప్రభావమున ఇంద్రజాలము వంటి ఈ సంసారమందు సర్వులు మోహితులగుచున్నారు."

ఈ ప్రశ్నలను విని వక్తలందు శ్రేష్ఠుడయిన శశిధ్వజుడు హృదయమందు పరిపూర్ణ భక్తితత్పరుడై ఇట్లనియె "జీవులు అనేక జన్మలు తీర్థాటనము, క్షేత్రదర్శనములు కావించిన మీదట వారికి సత్సాంగత్యము లభించును. తద్మూలమున వారికి ఈశ్వర సాక్షాత్కారము కలుగును. తదుపరి వారు విష్ణులోకమునకేగి నిర్మలచిత్తులై ఈశ్వర భజన కావించుచూ, సంసారమందలి సర్వోత్తమ భోగములనుభవించుచూ సాత్విక భక్తులగుదురు. కానీ రజోగుణాశ్రయులయిన జనులు కర్మనిష్ఠాగరిష్ఠులై హరిపూజ యందు లీనమగుదురు. వీరు భగవానుని గుణగానకీర్తనము ఆలపించుచూ, ఆయన రూపమును నిరంతరము వీక్షించుచూ, భగవద్భక్తి యందు లీనమయ్యెదరు. వారు భగవంతుని అనంత లీలలను స్మరించుచూ ఆయన కొరకై వ్రత, పర్వ, మహోత్సవములు కావించుచూ భగవద్భక్తి అనెడు ఆనందాతిరేకమందు సంపూర్ణముగ లీనమగుదురు. ఇటువంటి భక్తులు ముక్తిఫలము నొల్లక, మోక్షమును తిరస్కరించి, ముక్తులైనప్పటికీ తిరిగి హరిభక్తులుగ జన్మను స్వీకరించెదరు. ఈ భక్తుడు సహితము హరిరూపియే! ఈ భక్తుడు సర్వ తీర్థములను, స్థలములను సహితము పవిత్రమొనరించి, ధర్మకార్యములాచరించుట యందు తత్పరుడై, జగత్తు యొక్క తత్వమును, నిస్సారతను తెలిసి స్వామి, సేవకుడు అను రూపములతో శరీరము గ్రహించి సేవ్యభావ మకరందమును అనుభవించును. ఎట్లు కృష్ణభగవానుడు అవతారములు స్వీకరించునో అట్లే కృష్ణభక్తులు సహితము అవతారము స్వీకరించెదరు. అందువలన నిమిచక్రవర్తి భక్తుల నేత్రములందు నిమేష (కనురెప్ప) రూపమున స్థితిగతుడై యుండెను. ముక్తుడయిన వశిష్ఠ మహర్షి శరీరధారణ మొనర్చుటకు సహితము కారణమిదియే! ఇదంయునూ భగవల్లీలయే!!"

"ఓ! మహీపతులారా! మీకు భక్త, భక్తి మహిమను ఎరింగించితిని. ఇయ్యది జీవుల పాపములను నష్ఠమొనరించి, విష్ణుభక్తిని ఇనుమడింపజేయును. ఇంద్రియాశ్రితులయిన దేవతలందరికీ ప్రభూత సుఖానందములు ప్రసాదించును. మాయను ఛేదించి, నష్ఠమొనరించి, రాగద్వేషాది అరిషడ్వర్గములను దూరమొనర్చును. వ్యాసాది భక్తియుక్తులయిన మునులు అనేక వేదశాస్త్ర పురాణాదులను మధనము కావించి త్రికాలజ్ఞులై, కృష్ణభక్తి అనెడు పవిత్రము, మృత్యునాశకమయిన వెన్నను వెలికిదీసి, స్వీకరించి త్రిలోకనాథుడయిన శ్రీకృష్ణప్రాప్తి నొందిరి.

(శ్రీకల్కి పురాణమందు తృతీయాంశ యందలి భక్త, భక్తి మహాత్మ్యము అను పన్నెండవ అధ్యాయము సమాప్తము)

పదమూడవ అధ్యాయము

(శశిధ్వజునిచే చక్రమరణాఖ్యానము)

ఈవిధముగ శశిధ్వజ మహీపతి సభామధ్యమున తన కథలను సర్వులకు తెలిపి ప్రసన్నమనస్కుడై చేతులు జోడించి కల్కి భగవానునితో ఇట్లనియె "ఓ! సర్వలోకశాశకా! మహాప్రభూ! ఈ రాజులందరూ మిమ్ము ఆశ్రయించినవారు. నన్ను మీరెల్లప్పుడూ మీ ఆజ్ఞను పాలించు సేవకునిగ తలంపవలెను. నా మనసు ఈ సంసారబంధము నొల్లకున్నది. మీ ఆజ్ఞగా నేను మునులందరికీ ప్రియమయిన హరిద్వారమునకు తపశ్చర్యకై ఏగదలచుకుంటిని. నా పుత్ర, పౌత్రాదులందరూ మీ ఆశ్రితులు. వారిని మీరే పాలింపవలెను. స్వామీ! ద్వాపరమందు కృష్ణరూపమున జాంబవంతునికీ, బలభద్రరూపమున ద్వివిద వానరునికీ మోక్షము ననుగ్రహించిరి. మీకు నా మనోవాంఛితము సహితము తెలియును. నాకు పత్నీసహితుడనై తపశ్చర్యకేగుటకు అనుమతి నీయవలసినది." అంత కల్కి కించిత్ లజ్జితుడై అధోముఖుడయ్యెను. ఈ వింతను గాంచి రాజులందరూ ఆశ్చర్యచకితులై కల్కిని చూచి "హే! జగన్నాధా! ఈ మహారాజు పలుకులు విని మీరు ఏల అధోముఖులైరి? దయచేసి మాకు తెలుపవలసినది." అంత కల్కి "ఓ! మహీపతులారా! మీ ప్రశ్నకు పరమ బుద్ధిమంతుడు, నాయందు దృఢభక్తియుతుడు అయిన ఈ శశిధ్వజుడు సమాధానమీయగలడు." అంత రాజులు మరింత కుతూహలురై అదే ప్రశ్నను శశిధ్వజుని ప్రశ్నించిరి. అంత ఆ మహారాజిట్లనియె

"పూర్వకాలమందు రామావతార సమయమున రామలక్ష్మణులు సీతాన్వేషణము కావించుచూ లంకజేరి రావణునితో సమరమొనరించిరి. ఆ సమయమున లక్ష్మణుడు రావణపుత్రుడయిన మేఘనాధుని సంహరించి వానికి రాక్షసజన్మము నుండి విముక్తి కలిగించెను. కానీ బ్రాహ్మణుడయిన మేఘనాధుని సంహరించిన కారణమున ఒకానొక తీవ్రజ్వరము లక్ష్మణుని శరీరమందు ప్రవేశించినది. లక్ష్మణుడు వ్యాకులడగుట గమనించి దైవవైద్యులయిన అశ్వనీకుమారుల అంశతో జన్మించిన మైంద, ద్వివిదులందలి ద్వివిదుడు లక్ష్మణునకు ఒక మంత్రముపదేశించెను. జ్వరముచే తన శరీరము స్వాధీనత లేక పరుండియుండిన లక్ష్మణునకు విశాలభుజుడయిన ద్వివిదుడు ఒక మంత్రమును ఒక పత్రముపై వ్రాసి, శ్రీరామచంద్రుని ఎదుటనే అద్దానిని లక్ష్మణునకు చూపెను. లక్ష్మణుడు ఆ పత్రమందు రచింపబడిన మంత్రమును చదివి, తక్షణము స్వస్థతనొంది, పూర్వ సత్వమును వెంతనే పొందెను. అంత లక్ష్మణుడు అత్యంత ఆనందితుడై ద్వివిదుని వరము కోరుకొనమనెను. లక్ష్మణప్రభువు పలుకులకు మిక్కిలి ప్రసన్నుడై ద్వివిదుడు "స్వామీ! నన్ను మీ చేతులతో సంహరించి, నాకు ఈ వానరజన్మము నుండి విముక్తి యొనర్చి, మోక్షమును ప్రసాదింపవలసినది" అని కోరెను. అంత లక్ష్మణుడు "ద్వివిదా! నేను మరుజన్మమందు బలరామునిగ అవతారము స్వీకరించెదను. ఆ సమయమున నీకు మోక్షమును ప్రసాదించెదను." అని వరమిచ్చెను. ద్వివిదుడు లక్ష్మణునకు చూపిన మంత్రము **"సముద్రస్యోత్తరే తీరే ద్వివిదో నామ వానర:"** సముద్రమునకు ఉత్తరతీరమున ద్వివిదుడు అను వానరుడు కలడు అని ఈ మంత్రార్థము. ఈ విధముగ వ్రాయబడిన మంత్రమును ఎవరు చూచెదరో వారికి జ్వరము వెంతనే ఉపశమించును. ఈ విధముగ ఈ మంత్రమును ఒక తాళపత్రము పై వ్రాసి ద్వారమందు కట్టి ఎవరు చూచుచుందురో వారికి సహితము జ్వరము దూరమగును. ఈవిధముగ ద్వివిదుడు లక్ష్మణుని నుండి వరమును పొంది బహుకాలము ఆరోగ్యవంతుడై జీవించి, ద్వాపరాంతమున బలరామునిచే సంహరింపబడి మోక్షము నొందెను.

ఈ విధముగ తన ఇచ్చ ప్రకారమే సూతపుత్రుడయిన రోమహర్షణుడు బలరామునిచే సంహరింపబడెను. విష్ణుభగవానుడు బలిచక్రవర్తి నణచుటకై వామనావతారము స్వీకరించి తదుపరి త్రివిక్రముడయ్యెను. ఆ సమయమున

జాంబవంతుడు త్రివిక్రమునకు ప్రదక్షిణ లాచరించెను. జాంబవంతుని మనోవేగమును పోలిన శీఘ్రగమన శక్తికి సంతసిల్లిన విష్ణుభగవానుడు "ఓ! ఋక్షరాజా! మహాబలీ! నీ శీఘ్రగమన శక్తికి సంతసిల్లితిని. నీ మనోవాంఛితమును కోరుకొనుము" అని పలికెను. అంత చతుర్ముఖ బ్రహ్మ యొక్క అంశ అయిన జాంబవంతుడు "మహాప్రభూ! నీ చక్రాయుధముతో నన్ను ఖండించి సంహరింపుము" అని కోరెను. అంత వామనుడు రాగల కృష్ణావతారమందు నా చక్రముచే నీ శరీరము ఖండింపబడి మోక్షము నొందెదవు" అని పలికెను. భగవానుని కృష్ణావతార సమయమున నేను "సత్రాజిత్తు" అను రాజుగా జన్మించితిని. ఆ జన్మమున నేను అతులిత సూర్యోపాసకుడను. తత్ఫలితముగ ఆదిత్య భగవానుడు నాకు "శ్యమంతకము" అను మణిని ప్రసాదించెను. ఆ మణి దినమునకు ఎనిమిది బారువుల బంగారము నిచ్చును. అంతేకాక ఆ మణి ప్రభావమున ఆ రాజ్యమందు ఈతిబాధలు, అనారోగ్యము సహితము యుండవు. ఒకనాడు నేను ఆ మణిని ధరించి శ్రీకృష్ణుని దర్శనార్థము ఏగగా, ఆ ప్రభువు నన్ను ఆ మణిని రాజయిన శూరసేనునకు ఇమ్మనెను. నేను ప్రలోభమునకు వశుడనై నిరాకరించితిని.

ఒకనాడు నా సోదరుడు ప్రసేనుడు ఈ మణిని ధరించి వేటకేగి అచట ఒక సింహము చేతబడి అసువులు బాసెను. ఆ సింహమును సంహరించి జాంబవంతుడు ఆ మణిని గైకొనెను. నేను శ్రీకృష్ణుడే ఈ దుష్కార్యమాచరించెనని సర్వులకు నమ్మబలికితిని. అంత కృష్ణుడు అరణ్యమునకేగి ప్రసేనుని, సింహము యొక్క కళేబరములు కనుగొని, అక్కడి నుండి జాంబవంతుని వద్దకేగి, ఆతనితో పోరాడి, ఆ ఋక్షపతిని ఓడించి ఆతని పుత్రిక జాంబవతిని, ఆ మణిని గైకొనెను. జాంబవతిని పరిణయమాడి, సత్రాజిత్తుని పిలచి సర్వుల ఎదుట జరిగిన విషయములు వివరించి ఆ మణిని సత్రాజిత్తునకు తిరిగి ఇచ్చివైచెను. సత్రాజిత్ తాను కావించిన కార్యమునకు లజ్జితుడై తన పుత్రిక అయిన సత్యభామను శ్రీకృష్ణునకిచ్చి వివాహమొనరించెను. ఆ సమయమున సత్రాజిత్ శ్యమంతకమణిని శ్రీకృష్ణునకు ఇవ్వబోగా ఆ పరంధాముడు నిరాకరించి మణిని సత్రాజిత్ వద్దనే యుంచెను. అంత అక్రూర, కృతవర్మల ప్రోత్సాహమున శతధన్వుడు అను యాదవుడు సత్రాజిత్‌ను సంహరించి ఆ మణిని గ్రహించి అక్రూరునకిచ్చెను. తదుపరి అక్రూరుడు ద్వారక విడచి పలాయనుడయ్యెను. శ్రీకృష్ణుడు శతధన్వుని సంహరించి, అక్రూరుని వెనుకకు రావించి సభామధ్యమున ఎల్లరకు జరిగిన విషయములను విశదపరచి, ఆ మణిని తిరిగి అక్రూరునికే ప్రసాదించి ఆయన వద్దనే యుంచమనెను.

శ్రీకృష్ణుడు జాంబవంతునితో పోరాడు సమయమున ఒక చక్రాయుధమును ప్రయోగించెను. ఆ సమయమున జాంబవంతునకు తనకొసగబడిన వరము జ్ఞప్తికేతెంచెను. ఆ సుదర్శన చక్ర సంస్పర్శచే జాంబవంతుడు ముక్తినొందెను. పూర్వజన్మమందలి సత్రాజిత్తును నేనే!! పరమ పురుషోత్తముడయిన శ్రీకృష్ణభగవానునిపై నీలాపనిందలు వేయుటచే నేను మోక్షమును సంక్రమింపకుంటిని. సుదర్శన చక్రధారల ద్వారా నా మరణము సంభవించిన ఎడల నాకు మోక్షము సంప్రాప్తించునని తలచి నేను కల్కిభగవానునిపై యుద్ధమున కేగితిని. కానీ ఈ కల్కి భగవానుడు కృష్ణావతారమందు తన మామగారయిన జాంబవంతుని వధించుటచే శిరము వంచుకొని అధోముఖుడయ్యెను." అత్యంత విస్మయాస్పదము, అత్యద్భుతము, శ్రేష్ఠము అయిన ఈ ఆఖ్యానమును విని అక్కడయున్న సమస్త రాజనీకము, జనావళి ఆశ్చర్యాన్వితులయిరి. భగవానుని గుణములను ఆవిష్కరించిన ఈ ఆఖ్యానమును విని జనులు, మునివరులు సహితము ప్రసన్నులయిరి. శశిధ్వజుని ద్వారా తెలుపబడిన ఈ ఆఖ్యానము సుఖ, ధన, యశ, ఐశ్వర్యములనే కాక మోక్షమును సహితము ప్రసాదించును.

(శ్రీకల్కి పురాణమందు తృతీయాంశ యందలి శశిధ్వజునిచే చక్రమరణాఖ్యానము అను పదమూడవ అధ్యాయము సమాప్తము)

పదునాల్గవ అధ్యాయము

(విషకన్యా మోక్షకృత ధర్మవృత్తి కధనము)

సూతుడు తిరిగి చెప్పదొడంగెను "తదుపరి కల్కి తన అత్తమామలతో వివిధ ప్రకారములుగ సంభాషణలను నెరపి, వారిని స్వస్థులకావించి, వారినుండి వీడ్కోలు గొని ఇతర రాజుల సహితుడై అక్కడినుండి బయలుదేరి ఎత్తైన పర్వతములు మరియు దుర్గములచే పరివేష్ఠితమయినది, భయంకర విషాగ్నిని విరజిమ్ము సర్పములచే సంరక్షింపబడుచున్న "కాంచనీ నగరము" నకేగెను. శత్రుమర్దనుడయిన కల్కి సేనాసహితుడై తొలుత దుర్గములను కూల్చి, తదుపరి బాణవర్షముచే విష సర్పములనన్నింటినీ ఖండించి సంహరించెను. విచిత్రము. ఆ కాంచననగరము హరిచందన వృక్షభరితమై, మణిరత్నఖచిత సువర్ణశోభా సంపన్నమై, అనేక నాగకన్యల సమూహములచే ఆవరింపబడి మనుష్య సంచారము లేకయుండెను. అంత కల్కి మందహాస మొనర్చుచూ ఇతర రాజులతో "ఇయ్యది బహు చిత్రముగ యున్నది. సర్పములతో నిండిన ఈ సుందరనగరము మానవులకు మిక్కిలి భయము గొల్పునది. నాగకన్యా సంకులితమయిన ఈ నగరము లోనికి ప్రవేశించెదమా? లేక నిష్క్రమించెదమా? మీ అభిప్రాయము తెలుపవలసినది." అని పలికెను. కానీ సర్వులు మౌనము వహించిరి. ఈవిధముగ సంధిగ్దావస్థ యందున్న వారందరికీ అశరీరవాణి ఇట్లు పలికెను "ఈ నగరము లోనికి సేనా సహితులై ప్రవేశింపరాదు. వీరిని కాంచుటతోడనే కల్కి తప్ప మిగిలిన వారెల్లరూ తక్షణము మరణించెదరు." ఆ పలుకులు వినిన కల్కి మిగిలిన నృపతులను, సేననూ విడచి, గారుడము నధిరోహించి, శుకమును గైకొని, చంద్రహాసమును చేత ధరించి, ఒంటరిగా ఆ నగరము ప్రవేశించెను.

అరివీర భయంకరుడయిన కల్కి ఆ నగరమున అత్యంత ధీరోదాత్తుల హృదయములను సహితము కొల్లగొట్టు రూపయవ్వన సౌందర్యశీలి అయిన ఒక నాగకన్యను కాంచెను. లక్ష్మీపతిని చూడగనే ఆ ఇంతి చిరునగవు లొలికించుచూ ఇట్లనియె "ఈ సంసారము నందలి ఎందరో జనులు, పరాక్రమోపేతులు, రాజులు, నా నేత్ర సౌందర్యమునకు ముగ్ధులై మృత్యువాతబడిరి. అసహాయనైన నేను దేవ, మానవ, దానవ జాతులందు ఎవరి ప్రేమ కటాక్ష వీక్షణములకు నోచకుంటిని. నేడు మీ కమలదళ నేత్రముల నుండి జాలువారుచున్న అమృతరసమందు నేను తడిచి ముద్దగుచున్నాను. మహానుభావా! మీకు నమస్కారము. విషనేత్రను, దయనీయను అయిన నేనెక్కడ? అమృతనేత్రులయిన మీరెక్కడ? ఈ సంసారమందు అత్యంత భాగ్యహీననైన నాకు ఏ తపమొనరించుటచే మీ దర్శనభాగ్యమబ్బినదో తెలియకున్నది." అంత కల్కి "ఓ! సుందర నితంబినీ! నీవు ఎవరి కన్యవు? ఏ కారణముచే నీకు ఈ దురవస్థ ప్రాప్తించినది? నీకు విషనేత్రములు ప్రాప్తించిన కర్మను గూర్చి నాకు తెలుపవలసినది" అని ప్రశ్నించెను. అంత విషకన్య "ఓ! సుధర్మబుద్ధీ! నేను చిత్రగ్రీవుడు అను గంధర్వుని భార్యను. "సులోచన" నా నామధేయము. నేను నా భర్తయందు అత్యంత అనురాగము కలిగి యుండెడిదానను. నాకు నా రూప, యవ్వన, సౌందర్యముల పట్ల అహంభావముండెడిది. నేను ఒకనాడు నా పతితో కలసి గంధమాదన పర్వతమునకేగి అచటగల పుష్ప కుంజ, నికుంజములందు విహరించితిని. ఏకాంతము, యవ్వనము, పుష్పసౌరభ, తాకిడిచే మదనపీడితులమై, అచటగల ఒక శిలపై మేము రమించుట ఆరంభించితిమి. ఇంతలో అచటికి దు:ఖితుడు, విరూపుడు అయిన ఒక ముని ఏతెంచెను. మదోన్మత్తనయిన నేను ఆయనను చూచి హేళనగా నవ్వితిని. అపహాస్యభరితములు, అప్రియములు, అయిన నా పలుకులు విని ఆ మహర్షి నన్ను విషనేత్రవు కమ్మని శాపమిచ్చి, విషసర్పములతో నిండినది, సర్పముల కాలవాలమయిన ఈ కంచన నగరమందు పడవైచెను. అప్పటినుండి అభాగినినైన నేను విషము వర్షించుచూ ఈ ప్రదేశమంతటా తిరుగుచుంటిని. నేను కావించిన ఏదో పూర్వపుణ్యముచే నేడు మీ

నేత్రపథమందు ఏతెంచితిని. శాపవిముక్తనై, అమృతనేత్రనై, నేను నా పతిని చేరెదను. ఆశ్చర్యమేమనగా ఆ సజ్జనుని శాపము సహితము నా ఎడల వరమైనది. నేను ఋషి శాపమునుండి విముక్తనై నా పతిని చేరుటయే కాక మీ చరణకమల దర్శనము ప్రాప్తించినది." ఈ విధముగ పలికి ఆ అమృతనయన సూర్య సదృశమయిన విమానము నెక్కి స్వర్గలోకమున కేగెను.

అంత కల్కి "మహామతి" అను రాజును ఆ కాంచన నగరమునకు అధిపతిని గావించెను. ఈ మహామతికి "అమర్షుడు", అమర్షునికి బుద్ధిమంతుడయిన "సహస్రుడు", వానికి అత్యంత ప్రసిద్ధుడయిన "అసి" పుత్రులుగా జన్మించిరి. తదుపరి కల్కి మునిగణ పరివేష్ఠితుడై అయోధ్యకేగి అచట మరువును మహారాజుగ అభిషేకించెను. అచటినుండి మధురకేగి శశిధ్వజపుత్రుడయిన సూర్యకేతును మధురాధీశునిగా అభిషిక్తుని గావించెను. అచటినుండి వారణావతవమునకేగి దేవాపిని అచట రాజుగా నియుక్తుని గావించి అరిస్థలము, వృకస్థలము, మాకందము, హస్తినాపురము, వారణావతము అను ఐదు దేశములకు దేవాపిని రాజుగా అభిషేకించి తాను తిరిగి శంభల నగరమున కేగెను. అత్యంత భాతృప్రేమ కలిగిన కల్కి శౌభ్య రాజ్యమును కవికి, పౌండ్ర, పుళిందములు ప్రాజ్ఞునకు, సౌరాష్ట్ర, మగధ రాజ్యములను సుమంత్రునకు ప్రసాదించెను. తదుపరి కల్కి భగవానుడు కీకటము, మధ్యకర్ణాటకము, ఆంధ్రము, మేద్రము, కళింగము, అంగ, వంగ దేశములను మిగిలిన తన పరివారమునకు పంచెను. మిగిలిన రాజ్యములను విశాఖయూపునకు అప్పగించి తాను శంభలనగరమందే నివసించుట నారంభించెను. ద్వారకా రాజ్యమందలి "చోళ, వర్వద, కర్వ" మొదలగు ప్రదేశములను కృతవర్మాది పుత్రుల కొసంగెను. విష్ణురూపుడయిన కల్కి తన తండ్రికి ఎన్నో ధన రత్నరాశులను భక్తి పూర్వకముగ ప్రదానము కావించి, తన ప్రియపత్నులయిన పద్మ, రమలతో ఎంతో ఆనందము ననుభవించెను. ధర్మము నాలుగు పాదముల నలుచెరగులా వ్యాపించెను. త్రిలోకములయందు సత్యయుగము ఆరంభమయ్యెను. దేవతలు శాస్త్రానుసారము ఫలములునీయుట ప్రారంభించిరి. పృధివి సస్యశ్యామలమై ధాన్యములచే నిండెను. జనులు పరిపూర్ణ పుష్టి నొందిరి. జనులందు కపటత్వము, అబద్ధము, దొంగతనము, సంపూర్ణముగ అంతమయినది. మానసిక, శారీరక రోగములు మటుమాయమయినవి. బ్రాహ్మణుల వేదజ్ఞాతలయిరి. స్త్రీలు కళ్యాణకర కార్యములు ఆచరించుచూ, వ్రతములచే సదాచారిణులై, పూజా యజ్ఞములందు తత్పరులై, పతివ్రతలుగ శోభిల్లిరి. క్షత్రియులు యజ్ఞము లాచరించుచుండిరి. వైశ్యులు ధర్మపూర్వకమయిన వ్యాపారమొనరించుచూ విష్ణుపూజా నిమగ్నులైరి. శూద్రులు ద్విజుల (బ్రహ్మ, క్షత్రియ, వైశ్యులు) సేవ యొనర్చుచూ, వార్తాలాపములందు సహితము విష్ణుకథలు చర్చించుచూ పూజాదులందు నిమగ్నమయిరి.

(శ్రీకల్కి పురాణమందు తృతీయాంశ యందలి విషకన్యా మోక్షకృత ధర్మప్రవృత్తి కథనము అను పదునాల్గవ అధ్యాయము సమాప్తము)

పదిహేనవ అధ్యాయము

(మాయా స్థవము)

శౌనకుడు "ఓ! సూతమహర్షీ! నీవు సర్వ జ్ఞాతుల యందునూ శ్రేష్ఠుడవు. శశిధ్వజుడు మాయాస్తుతి కావించెనని నుడివితివి కదా! ఆ మహీపతి మాయాస్తుతి కావించి ఎచటికేగెను? ఆయన కావించిన మాయాస్తుతి ఏమి? మాయాస్తుతియే విష్ణుకథా? సర్వులను పవిత్రీకరణ మొనరించు ఆ మాయాస్తుతిని మాకు తెలుపవలసినది." అంత సూతుడు "మునులారా! వినవలసినది. ఈ ప్రశ్నను మార్కండేయమహర్షి శుకుని ప్రశ్నించెను. శుకుడు తెలిపిన ఆ పావన స్తోత్రమును మీకు

తెలిపెదను. ఇయ్యది సర్వ జనుల కామనలను పూర్ణమొనరించును. దు:ఖ, పాపములను నాశమొనర్చును. భల్లాట నగరము వీడి విష్ణుభక్తుడయిన శశిధ్వజుడు తననుతాను ఈ సంసారము నుండి ముక్తి యొనర్చుకొనుటకై ఈ పవిత్ర స్థోత్రమును గానము చేసెను– “ఎవరు దేవ, గంధర్వ, సిద్ధులకు వందనీయయో, ఎవరు త్రిమూర్తులకు సహితము మాతయో, ఎవరు పంచభూతములకు, పంచతన్మాత్రలకు లోపలయుండి నడిపించుచున్నదో, ఎవరు వేదముల ద్వారా తెలియబడునో, ఎవరు సూక్ష్మము, మరియు స్వాహారూపిణియో, ఎవరు విశుద్ధ స్వరూపిణియై, సత్వగుణరూపిణియై, హ్రీంకార బీజరూపిణియై అలరారుచున్నదో ఆ మాయకు నమస్కారము. ఎవరు సర్వలోకములకంటె ఉత్కృష్ఠము, మరియు ఉన్నతమయినదో, ఎవరు ద్వైతభావనను ఉత్పన్నపరుచుచున్నదో, వ్యాసాది ఋషులచే ప్రణామములందుకొని సర్వులచే శ్రేష్ఠముగా భావింపబడుచున్నదో, ఎవరిని విద్వాంసులు నిరంతరము స్థుతించుచుందురో, ఎవరు కాలరూప తరంగములందు డోలాయమానమగుచున్నదో, ఎవరి కడకంటి క్రీడాకటాక్ష వీక్షణములచే ప్రాణులు సంసార సముద్రమందు విసరివేయబడుదురో, ఆ భగవతిని నేను స్థుతించుచున్నాను. తల్లీ! నీవు జన్మమృత్యువులమధ్య దేవ, దానవ, మానవ, పశుపక్ష్యాదులుగ అనేక రూపములతో వెలుగొందెదవు. ఓ! పూర్ణరూపా! నీవు జీవులకు అద్వైతభావనతో మాత్రమే చేరగల శక్తివి. శరణుకోరతగిన మాతవు. సర్వులకు ఆధారభూతము మరియు పరబ్రహ్మ రూపిణివయిన భగవతి మాయకు ప్రణామము లర్పించుచున్నాను.”

“కేవలము ఎవరి శక్తిచే ఈ సంసారము ప్రకాశించుచున్నదో, ఎవరు లేనిచో బ్రహ్మ నిర్మితమయిన ఈ బ్రహ్మాండమంతయు అంధకారబంధురమగునో, కాలము, భాగ్యము, ఉపాధులు మొదలగునవి ఎవరి వలన గతినొందుచున్నవో, అట్టి విలక్షణ మాయా స్వరూపమునకు నమస్కరించుచున్నాను. ఎవరి చిదాభాసచే ఆకాశమునకు శబ్దము, వాయువునకు స్పర్శ, అగ్నికి రూపము, జలమునకు రుచి, (రసము), పృధివికి గంధము అబ్బుచున్నవో, ఎవరు ఈ బ్రహ్మాండమందు సమస్త రూపములను దాల్చిరో, ఆ మాయకు ప్రణామములర్పించుచున్నాను. బ్రహ్మ యొక్క సావిత్రి, శివుని భవానీ, విష్ణువు యొక్క లక్ష్మీ, ఇంద్రుని యొక్క శచీ స్వరూపము నీవే! త్రిలోకములయందూ నీవే ప్రకాశించుచున్నావు. జీవులయందలి బాల్యావస్థయందు బాలికగా, యువావస్థయందు ప్రౌఢగా, వృద్ధావస్థయందు వృద్ధురాలిగ కనిపించి మార్పుచెందు కాలస్వరూపము నీవే! మునులు యజ్ఞ, యాగముల ద్వారా నిన్ను పూజింతురు. నీవు జ్ఞానమునకు సహితము ఆవలయున్న పరాశక్తివి. నీ ఇచ్ఛానుసారము రూపము తీసికొని నీవు లోకములను పాలించెదవు. తల్లీ! నీవే సర్వులు పూజింపదగినదానవు, వరములిచ్చుదానవు, పవిత్రవు, ధన్యవు. చండీ, దుర్గా, కాళికా రూపములతో విభిన్న స్థానములందు, భిన్న రూపములతో వ్యక్తమయి జనులచే పూజలందుకొనుచున్నావు. దేవతలచే సహితము పూజింపబడు చరణకమలములు గల తల్లీ! నిన్ను ఎవరు తమ హృదయమందు ధ్యానించుచుందురో, వారికి నిరంతరము ధర్మమును తెలిపి, ధర్మపధమందు నడిపించి, సమస్త సమృద్ధులను ప్రసాదించెదవు.”

ఈ పరమ పవిత్ర మాయాస్థవమును శుకమహర్షి నుండి విని మార్కండేయాదులు దివ్యులయిరి. శశిధ్వజ మహారాజు ఈ స్థవమును జపించి మోక్షమునకు అర్హతనొందెను. తదుపరి శశిధ్వజుడు వనములకేగి అచట “కోకాముఖము” అను స్థానమునందు విష్ణువు కొరకై తీవ్రతపము ఆచరించి, ఆ ధ్యానమందే సుదర్శన చక్రధారలచే పాంచభౌతిక శరీరము నుండి విడిపింపబడి మోక్షము నందెను.

(శ్రీకల్కిపురాణమందు తృతీయాంశ యందలి మాయాస్థవము అను పదిహేనవ అధ్యాయము సమాప్తము)

పదహారవ అధ్యాయము

(విష్ణుయశ మోక్షము, రామ దర్శనము)

సూతుడు "ఓ! ఋషి, ముని గణములారా! మీకు నేను శశిధ్వజుని మోక్షము గూర్చి తెలిపితిని. ఇపుడు మీకు కల్కి భగవానుని అనుపమ కథను తెలిపెదను. కల్కి రాజయిన పిదప వేదము, ధర్మము, కృతయుగము, దేవతలు, లోకులు, జడచేతనములు, సర్వము పూర్ణముగ వృద్ధినొందినవి. పూజారులు దేవాలయములందు యాంత్రికముగ తిలకధారణ, పూజ మాని మోహమును వీడి, భక్తితో పూజాదికములు నిర్వర్తించుట మొదలిడిరి. కల్కి శంభల యందు పద్మ, రమలతో సుఖముగ జీవించుచున్న సమయమున ఆయన తండ్రి అయిన విష్ణుయశుడు ఆయన వద్దకేతెంచి, సర్వ దేవతలకు కళ్యాణమొనరించు యజ్ఞము నాచరింపమని తెలిపెను. అంత కల్కి వినమ్రుడై "తండ్రీ! ధర్మార్థ కామసిద్ధి కొరకై కర్మకాండ పద్ధతి ననుసరించి రాజసూయ, వాజపేయ, అశ్వమేధాది యజ్ఞములాచరించి, యజ్ఞపతి అయన విష్ణువునకు సమర్పించెదను" అని పలికి కృప, పరశురామ, వశిష్ఠ, వ్యాస, ధౌమ్య, కృతవణ, అశ్వత్థామ, మధుచ్ఛింద, మందపాలాది ఋషులను రావించెను. గంగా యమునా సంగమస్థానమందు ఎన్నో యాగాదులు నిర్వహించి అవభృత స్నానమొనరించెను. యజ్ఞములకు ఏతెంచిన వారందరికీ భక్ష్య, భోజ్య, చోష్య, లేహ్యములతో షడ్రుచులు కలిగిన పదార్థములను వడ్డించి, వారందరినీ తృప్తిపరచెను. ఆ భోజనాలయమందు సాక్షాత్ అగ్ని వంటవానిగ, వరుణుడు జలవితరునిగ, వాయువు వడ్డించువానిగ, వ్యవహరించిననిన, ఇక ఆ యజ్ఞపుశోభను ఎట్లు వర్ణింపగలము?

కమలనేత్రుడయిన కల్కి సర్వులకు భోజన ప్రదానము కావించి నృత్య, వాద్య, గీత, పితృయజ్ఞాది మహోత్సవముల ద్వారా వారందరినీ ప్రసన్నుల కావించెను. స్త్రీ, బాల, వృద్ధులకు యథోచిత ధనప్రదానము కావించెను. ఆ మహోత్సవమందు "హూహూ" అను గంధర్వుడు గానమాలపించెను. "రంభ" తదనుగుణముగ అద్భుత నాట్య ప్రదర్శన కావించెను. తదుపరి కల్కి యోగ్యులందరికీ అనేక దానములర్పించెను. పిదప తండ్రి అనుమతితో గంగాతటమందు కొంత తడవు నివసించెను. విష్ణుయశుడు పూర్వపు రాజుల పుణ్య చరితములను బుధులయిన బ్రాహ్మణుల వద్ద నుండి వినుచూ జీవితము గడపుచుండెను.

ఒకానొకనాడు ఆయన వద్దకు నారదమహర్షి, తుంబుర సహితుడై ఏతెంచెను. విష్ణుయశుడు వారిరువురికీ ప్రసన్నతా పూర్వకముగ అర్ఘ్యపాద్యాదులిచ్చి, ఆదరించి, ఆశీనులకావించి ఇట్లనియె "ఏమాశ్చర్యము? నా సౌభాగ్యమేమని తెలుపుదును? నా వందలాది జన్మలందాచరించిన పుణ్య ఫలితముగ పురాణపురుషులయిన మీరిరువురు ఏతెంచిరి. మీ దర్శనము మోక్షకారకము. మీ దర్శనముచే నేను అగ్నియందు అర్పించు ఆహుతులు కృతార్థమయినవి. నేడు దేవతలు, పితరులు ఇరువురు సంతృప్తి నొందెదరు. మీవంటి సజ్జనులు అరుదు. మీ పూజనముచే స్వయముగ విష్ణుభగవానుడు పూజితుడగును. మీ స్పర్శనముచే పాప సమూహములు ధ్వంసమగును. సత్పురుషుల హృదయమే ధర్మము. వారి వాణి సనాతన దేవతాస్వరూపము. వారి సత్కర్మలు సర్వులకు కర్మక్షయ మొనరించును. ఎందువలననగా సాధుపురుషులు స్వయముగా విష్ణువే! దుష్టవినాశనమునకై అవతారము స్వీకరించిన శ్రీకృష్ణుని శరీరము ఎట్లు పాంచభౌతికము కాదో, అట్లే లోకమునందు విష్ణుభక్తుల శరీరములు సహితము పాంచభౌతిక నిర్మితములు కావు. ఓ! పుణ్యశ్లోకులారా! మీరు ఈ సంసారసాగరమును విష్ణుభక్తి అను నావ ద్వారా దాటుచున్నారు. నేను ఏ కర్మము కావించి దు:ఖభాజనమయన ఈ సంసారమును దాటి పరమ కళ్యాణకరమయిన మోక్షమును సాధించెదను? దయచేసి తెలుపవలసినది." నారదమహర్షి "ఏమి ఆశ్చర్యము? సాక్షాత్ విష్ణుమూర్తి యొక్క అవతారమయిన కల్కికి జన్మనిచ్చిన తల్లిదండ్రులను సహితము మాయ

విడువలేదు కదా! ఈ మాయ అత్యంత బలవత్తరము, మరియు పరమ కళ్యాణకారిణి. సంపూర్ణ సంసారమునకు స్వామి అయిన నారాయణుని పుత్రునిగ పొంది ఈ విష్ణుయశుడు ఆయనను వదలి నన్ను ముక్తి గూర్చి ప్రశ్నించుచున్నాడు" అని పలికి కొంత తడవు తనలోతాను తర్కించెను.

అటుపిదప బ్రహ్మపుత్రుడయిన నారదుడు బ్రహ్మయశ పుత్రుడయిన విష్ణుయశునకు బ్రహ్మసంపత్తి (మోక్షము) గూర్చిన జ్ఞానమును ఒక ఏకాంత ప్రదేశమునకు గొనిపోయి ఇట్లు వచించెను "కల్కిపితా! ఒకసారి శరీరపతనమయిన పిదప వేరొక శరీరమును ధరించుటకు ఇచ్ఛగించు జీవమును గాంచి మాయ ఒక సంవాదము గావించెను. అద్దానిని మాయ నాకు వింధ్యాచలమందు తెలిపెను. అద్దానిని నీకు వివరించెదను.

మాయ: "జీవా! నేను మాయను. నేను వైదొలగిన పిమ్మట నీకు జీవించు ఇచ్ఛ ఎట్లు కలుగుచున్నది?"

జీవము: ఓ! మాయా! నేను జీవించుట లేదు. జీవమునకు ఆశ్రయభూతమయిన శరీరమందు "అహం" (నేను) అను భావము భేదబుద్ధిని కలుగజేయుచున్నది.

మాయ: జీవా! నా సంసర్గముచే శరీరమందు ఏ వికారములు కలుగునో, అట్లే ఆ శరీరమందున్న నీవు నాకు (మాయకు) ఆధీనమవకుండా ఏ విధములైన చేష్టితములనైననూ ఎట్లు చేయగలవు?

జీవము: ఓ! మాయా! నేను సహితము లేనిఎడల నీ ప్రకాశము, ప్రజ్ఞ, విషయలాలస తీరవు.

మాయ: జ్ఞానశూన్యులయిన మనుజులు మాయ చేతనే జీవించి కార్యము లాచరించెదరు. కరిమ్రింగిన వెలగపండు వలె వారు నిస్సారులయినప్పటికీ సారయుక్తులుగ ప్రతీతులగుదురు.

జీవము: ఓ! మాయా! నీవు సహితము నా సాహచర్యము వల్లనే అనేక నామరూపములు తీసికొని ఆనందించుచున్నావు. వ్యభిచారిణి అయిన స్త్రీ తన పతిని నిందించినటుల నన్నేల నీవు నిందించుచున్నావు? సూర్యుడుదయించిన పిదప అంధకారము ఎట్లు యుండలేదో అట్లే నేను లేని ఎడల నీకు సహితము ఉనికి లేదు. మేఘములు సూర్యుని ఆచ్ఛాదించినటుల నీవు కొంతసేపు నన్ను ఆచ్ఛాదింపవచ్చును. ఓ! జగన్మయీ! మాయా! నీవు నా లీలారూపమయిన బీజముల ధ్యాన్యాగారమునవు. నీవు విభిన్న రూపములు ధరించు శక్తి కలిగియుండుటచే ఈ సంసారము యొక్క సృష్ట్యంతముల మధ్య శోభిల్లెదవు.

అంత మాయ విషయ వ్యాపార రహితము, అభౌతికమయిన శరీరమును చూచి ఈ విధముగ శపించెను "ఓ! శరీరమా! నీవు వృక్షకాష్ఠము వలె చేష్టహీనవు. ఈ పృధివియందు నేను వైదొలగిన అనంతరము నీకు ఉనికి యుండదు." ఈ సంవాదమును నారదుడు విష్ణుయశునికి వినిపించి ఇట్లనియె "ఓ! విష్ణుయశా! విశ్వరూపుడు, పరమాత్ముడు అయిన నీ పుత్రుడు కల్కిచే ఈ మాయ ఉత్పన్నము కావింపబడినది. నీవు ఆ మాయాతత్వము నెరింగి నారాయణుని ధ్యానించుచూ పృధివి యందు జీవింపుము. నీవు ఆశ, మమతలను విడచి, విషయభోగ వాసనలను పూర్ణముగ త్యజించి, సంపూర్ణమగ శాంతుడవైనచో, నీకు జగత్తు అంతయు విష్ణువు యొక్క విరాడ్రూపమే అని తెలియును. ఈ జగత్తు యొక్క అణువణువుయందు విష్ణువే వ్యాపించి యుండెనని అర్ధమగును. ఈ భావముదయించిన పిదప జీవాత్మను పరమాత్మ యందు లయమొనర్చి సమస్త కామనలను విరమింపవలెను." ఈవిధముగ విష్ణుయశునికి జ్ఞానబోధ యొనర్చి, ఆ మునిద్వయము కపిలాశ్రమమున కేగిరి.

అంత విష్ణుయశుడు సమస్త సంసారమునకు స్వామి తన పుత్రుడయిన కల్కియేయని తెలిసికొని, ఒక శుభముహూర్తమున కల్కికి ప్రణామములొనర్చి, సతీసహితుడై వనముల కరిగెను. ఈవిధముగ ప్రయాణించి విష్ణుయశ దంపతి బదరికాశ్రమము చేరిరి. అచట ఘోరతపమాచరించి, జీవాత్మను పరమాత్మయందు వినీలమొనర్చి విష్ణుయశుడు తన పాంచభౌతిక శరీరమును విడచెను. తన భర్త యొక్క శరీరమును ఆలింగనమొనర్చి పతివ్రత అయిన సుమతి

సహగమనమాచరించి తానునూ శరీరమును విడచెను. స్వర్గమందు దేవతలు ఆమెను స్తుతించిరి. మునుల ముఖతా తన తల్లిదండ్రులు ముక్తినొందిరని వినిన కల్కి అశ్రుపూరిత నేత్రములతో వారిరువురికీ శుద్ధి సంస్కారములొనరించెను.

దేవతలచే సహితము ఆకాంక్షింపబడు శంభల నగరమందు కల్కి పద్మ, రమా సహితుడై, వైదికాచార పరాయణుడై, తన కర్తవ్యమును పాటించుచూ ధర్మముగ రాజ్యము నేలుచుండెను. కొంతకాలమయిన పిదప తీర్థములను సహితము పవిత్రమొనరించు పరశురాముడు తీర్థాటనా నిమిత్తమై మహేంద్రగిరి వదలి, వివిధ తీర్థక్షేత్రముల కేగుచూ శంభల నగరమున కేతెంచెను. ఆ మహానుభావుని కాంచి తన ఇరువురి భార్యల సహితుడై కల్కి ఆయనను అర్ఘ్య పాద్యాదులచే ఆహ్వానించి, షడ్రుచులు గల భోజనమిడి, ఆయనకు బహుమూల్య వస్త్రభూషణములిడి ప్రసన్నుని కావించెను. తదుపరి ఒక హంసతూలికా పర్యంకమందు ఆయనను పరుండబెట్టి ఆయనకు పాదసంవాహన కావించుచూ ఇట్లనియె "మహాత్మా! గురువర్యా! మీ దయచే మాకు ధర్మార్థకామములు సిద్ధించినవి. నా పత్ని, శశిధ్వజతనయ మీకొక నివేదన కావింప దలచినది. మీరంగీకరించిన ఆమె తెలుపును." పరశురాముని అనుమతిన తన పతి యొక్క వచనములకు హర్షచిత్తయై రమ ఇట్లనియె "స్వామీ! ఏ విధమయిన యమ, నియమ, వ్రతాచరణమాచరించుటచే సత్పుత్రప్రాప్తి కలుగును?"

(శ్రీకల్కి పురాణమందు తృతీయాంశ యందలి విష్ణుయశ మోక్షము అను పదహారవ అధ్యాయము సమాప్తము)

పదిహేడవ అధ్యాయము

(రుక్మిణీ వ్రతము)

పుత్రలాలసతో రమ పలికిన పలుకులు విని, కల్కి హృదయము నెరింగిన పరశురాముడు ఆమెచే రుక్మిణీవ్రతము నొనరింపజేసెను. తత్ఫలితముగ రమ పుత్రవతి, సౌభాగ్యవతి, చిరస్థాయిగ యవ్వనవతియై సకల భోగములు అనుభవించినది. ఇదంతయు సూతుని నుండి వినుచున్న శౌనకుడు "సూతమునీ! ఈ రుక్మిణీ వ్రతవిధానమేమి? ఫలమేమి? ఈ వ్రతమును ఇంతకుముందు ఎవరు ఆచరించిరి? తెలుపవలసినది" అని ప్రశ్నించెను. అంత సూతుడు ఇట్లు వాక్రుచ్చెను "పూర్వకాలమున వృషపర్వుని పుత్రిక అయిన శర్మిష్ఠ కొలనులో స్నానమాచరించుచుండగా చంద్రధారి అయిన శివుని కాంచెను. వెంటనే ఆమె బయటకేతెంచి ఎదురుగ యున్న బట్టను చుట్టబెట్టుకొనెను. ఇంతలో మిగిలిన వారందరూ బయటకేతెంచి తమ వస్త్రములు గైకొనిరి. శుక్రాచార్య తనయ అయిన దేవయాని తన వస్త్రమును శర్మిష్ఠ కట్టుకొనుట కాంచి ఆమెను తప్పుబట్టెను. అంత శర్మిష్ఠ క్రోధముబూని, తన చెలికత్తెల సహాయముతో దేవయానిని ఒక నుయ్యియందు త్రోయించి తనదారిన తాను వెడలెను. కొంత సమయమయిన పిదప నహుష పుత్రుడయిన యయాతి అచటికేతెంచి, ఆమె హస్తమును గ్రహించి, ఆ కూపమునుండి ఆమెను బయటకులాగి "ఓ! సుముఖీ! నీవెవరవు?" అని ప్రశ్నించెను. అంత శుక్రతనయ వస్త్రములు ధరించి లజ్జాభయములు ముప్పిరిగొన శర్మిష్ఠ వృత్తాంతమునంతయు ఆయనకు తెలియజేసెను. యయాతి అదంతయు విని, ఆమె అభిప్రాయము సహితము విని, ఆమెను వివాహమాడుటకు మనసున నిశ్చయించి, తన నగరమునకేగెను.

దేవయాని తన గృహమునకేగి తండ్రికి ఈ విషయమంతయు తెలియజేసెను. శుక్రుడు అగ్రహోదగ్రుడయ్యెను. వృషపర్వుడు మిక్కిలి భయకంపితుడై శుక్రాచార్యుని శరణువేడి "స్వామీ! మీకు నా ఎడల క్రోధము వలదు. నేను తప్పుచేసిన ఎడల నన్ను దండింపవలసినది. నా తనూజ దుష్కార్యము ఆచరించిన ఎడల ఆమెను శిక్షింపవలసినది."

అంత దేవయాని శర్మిష్ఠను తనకు దాసిని కావింపమని కోరెను. వృషపర్వుడు చేయునది లేక శర్మిష్ఠను దేవయానికి దాసిని గావించెను. తదుపరి శుక్రుడు యయాతిని పిలచి, తన పుత్రికను ఆతనికిచ్చి వివాహమొనరించి ఇట్లు పలికెను “ఒకవేళ నీవు రాకుమారి శర్మిష్ఠను చేపట్టిన ఎడల వెంటనే నీవు వృద్ధుడవగుదువు.” అంత యయాతి ఆ శాపభయమున సుందర రూపవతి అయిన శర్మిష్ఠ వంక కన్నెత్తి చూడకుండెను. శర్మిష్ఠ దీన, దు:ఖితయై, వ్యాకులచిత్తయై దేవయానికి దాసీత్వము చేయుచుండెను.

ఒకనాడు ఆమె ఒంటరిగ విపినమునకేగి తన స్థితికి రోదించుచుండెను. ఆ సమయమున ఆమె పవిత్రములు, సుందర సుగంధిత సామాగ్రి, పుష్పమాలలు, ధూపదీపములు, అనేకమంది అతివలతో వ్రతమాచరింపజేయుచున్న విశ్వామిత్రుని కాంచెను. అచట నాలుగు ప్రక్కలా అరటిబోదెలతో కట్టబడిన మండపము, ప్రక్కనే యజ్ఞవేది, మండపమందు సువర్ణజరీయున్న రంగురంగుల వస్త్రములు పరుచబడియున్నవి. మండపమధ్యమున ఎనిమిది దళములున్న కమలము, దానిపై రత్నములచే చేయబడిన వాసుదేవుని ప్రతిమ యున్నవి. అచట అనేక మంది అతివలు అనేక మంగళకరమయిన స్తోత్రములు, పురుషసూక్తము, పఠించుచూ పంచామృతములు, పంచగవ్యములు, శుద్ధజలములతో వాసుదేవునకు స్నానమాచరింపజేసి, కమలమందలి సింహాసనముపై అధిష్ఠింపజేసిరి. తదుపరి వాసుదేవ భగవానుని ఈ విధముగ ప్రార్థించిరి “ఓ! పరమేశ్వరా! మా దు:ఖములను దూరమొనరించు స్వామీ! సుగంధశీతలా! మనసుకు ఆనందము కలిగించు ప్రభూ! ఈ అర్ఘ్యపాద్యములను స్వీకరింప వలసినది.” అనిపలికి ఆ పదార్థములు సమర్పించిరి. ఓ! రుక్మిణీనాథా! మహాప్రభూ! మేము ఈ అర్ఘ్యమును, దూర్వాంకురములు, చందనము, సుగంధిత పదార్థములతో ప్రయత్నపూర్వకముగ తయారుచేసితిమి. మీరు ప్రసన్నులై దీనిని స్వీకరింపవలసినది. ఓ! లక్ష్మీనివాసా! అనేక తీర్థములనుండి జలములు సంఘటితమొనర్చి, వాటికి మనాకర్షితమయిన గంధములు కలిపి సుగంధభరితమొనర్చితిమి. మీరు లక్ష్మీసహితులై ఈ ఆచమనమును స్వీకరింపవలసినది. ఓ! దేవతల స్వామీ! అనేక సుందర, సుగంధ, సుమధుర పుష్పములతో చుట్టబడినది, మీ శ్రేష్ఠమయిన వక్షస్థలమునకు శోభను కల్పించునది అయిన ఈ మనోహరమయిన మాలను గ్రహింపవలసినది. ఓ! ఆవరణరహితా! హరీ! అవిచ్ఛిన్నమయిన తంతువులచే నేయబడిన ఈ పవిత్ర వస్త్రమును నీ ప్రియమయిన లక్ష్మీ సహితుడవై స్వీకరింపవలసినది. దేవా! ఈ యజ్ఞోపవీతము ప్రజాపతి ద్వారా తయారుచేయబడినది. నీవు నీపత్ని అయిన రుక్మిణీ సహితుడవై గ్రహింపవలసినది. అనేక మణి, మాణిక్య, ముత్య, రత్న, స్వర్ణఖచితమయిన ఈ ఆభూషణములను ఓ! దేవతలను సహితము శాశించు స్వామీ! నీవు రుక్మిణీ సహితుడవై స్వీకరింపవలసినది. ఓ! రుక్మిణీవల్లభా! పాలు, పెరుగు, బెల్లము, అన్నము, అపూపములు, లడ్డూలు, ఖండచక్కెరలను స్వీకరించి నన్ను సనాధను కావింపుము. పునుగు, కస్తూరి, కర్పూరాగరు సుగంధభరితానంద ప్రదానము కావించు ధూపము వైచితిమి. స్వామీ! నీ హృదయప్రియ అయిన రుక్మిణీ సహితుడవై గ్రహింపవలసినది. ఓ! సర్వవ్యాపకా! సంసారాసక్తులయిన మీ భక్తుల మోహాంధకారమును విచ్ఛిన్నమొనర్చు స్వామీ! సమస్త సంసారమును ఈ దీపమును గ్రహించి వీక్షింపుము. ఓ! శ్యామసుందరా! కమలనేత్రా! పీతాంబరధరా! చతుర్భుజా! దేవదేవా! అచ్యుతా! మీ శరణునొందిన మమ్ములను రుక్మిణీ సహితుడవై రక్షింపుము! రక్షింపుము!! రక్షింపుము!!!”

ఈవిధముగ ఆచరింపబడుచున్న వ్రతమును గాంచి, విశ్వామిత్రునకు ప్రణామములొనర్చి, అత్యంత దు:ఖిత అయిన శర్మిష్ఠ చేతులు జోడించి ఆ వనితలతో ఇట్లనియె “ఓ! దేవీస్వరూపిణులారా! నేను భాగ్యహీనను, పతివిహీనను, అభాగినైన రాకుమారిని. మీరు మీ వ్రతధర్మముచే నన్ను రక్షింప సమర్థులు. మీకు నమస్కరించుచున్నాను”. అంత ఆ అతివలందరూ ఆమె యందు దయార్ద్రహృదయులై, తమతమ వస్తుసామాగ్రి నుండి కొంచెము కొంచెము ఆమెకిచ్చి ఆమెచే సక్రమముగా రుక్మిణీ వ్రతము ఆచరింపజేసిరి. ఆ వ్రత మహాత్మ్యముచే ఆమె నిత్యయవ్వనవతియై, యయాతి

మహారాజును పతిగా పొంది "ద్రహ్యు, అను, పూరువు" అను పుత్రులను పొందెను. జనకసుత జానకి అశోకవాటిక యందు విభీషణపత్ని అయిన సరమ సహితయై ఈ వ్రతమాచరించి, తిరిగి తన భర్త అయిన రాముని చేరెను. బృహదశ్వుని కృపచే ద్రౌపదీదేవి ఈ వ్రతమాచరించి, చిరకాలము పతి సహితయై, దు:ఖరహితయై, చిరస్థాయిగ యవ్వనవతిగా నిలచెను.

పరశురాముని వచనమున రమాదేవి వైశాఖ శుక్ల ద్వాదశి నాడు ఈ వ్రతము ఆరంభించి నాలుగు వర్షములు ఈ వ్రతమును ఆచరించెను. తదుపరి చేతికి రక్షాబంధనము ధరించి అనేకమంది బ్రాహ్మణులకు భోజనమిడి తదుపరి భర్త సహితయై పాలతో కూడిన హవిష్యాన్నమును భుజించెను. సంపూర్ణ పృధివిని శాశించుచున్న తన భర్త కల్కితో అనేక భోగభాగ్యములనుభవించి "మేఘమాల", "బలాహక" అను ఇరువురు పుత్రులకు జన్మనిచ్చెను. ఆ పుత్రులిరువురు యజ్ఞ, దాన, తప, వ్రతముల ద్వారా దేవతలకు ఉపకారమొనర్చిరి. వారిరువురు ఉత్సాహవంతులై, పరాక్రమశాలురై, సౌభాగ్యశీలురై, కల్కి భగవానునికి అత్యంత ప్రియులైరి. ఈ విధముగ ఏ స్త్రీ విధివిధానముగ ఈ వ్రతమాచరించునో, ఆ అతివ పూర్ణకామయై శ్రీహరి చరణకమలములందు అత్యంత భక్తియుతయై బ్రహ్మవిద్యా విశారదులకు సహితము దుర్లభమయిన అనుపమ గతినొందును.

(శ్రీకల్కి పురాణమందు తృతీయాంశ యందలి రుక్మిణీవ్రతము అను పదిహేడవ అధ్యాయము సమాప్తము)

పద్ధెనిమిదవ అధ్యాయము

(కల్కి వర్ణనము)

సూతుడు "మునులారా! త్రిలోక ప్రసిద్ధమయిన రుక్మిణీవ్రతము గూర్చి మీకు తెలిపితిని. ఇపుడు మీకు కల్కిచే కావింపబడిన కార్యములు తెలిపెదను. కల్కి తన సోదర, బంధు బాంధవుల సహితుడై వేయి సంవత్సరములు గడిపెను. శంభల నగరమంతయు దివ్య సౌధములు, దుకాణములు, రాజవీధులు, రంగురంగుల ధ్వజ, పతాకములతో నిండి అమరావతి వలె శోభిల్లెను. శంభల నగరమందు ఆరువది ఎనిమిది తీర్ధములుత్పన్నమయ్యెను. నిష్కపటుడయిన కల్కి భగవానుని చరణకమలములను ఆశ్రయించిన భక్తులు మరణానంతరము ముక్తిని పొందిరి. అనేక వన, ఉపవనములతో కూడినది, అనేక ఫల పుష్పభరిత వృక్షములతో నిండినది అయిన శంభల నగరము పృధివిపై మోక్షప్రదాయకము అని నా అభిప్రాయము. అచటి జనులకు నేత్రానందము కలుగజేయుచూ కల్కి భగవానుడు పద్మ, రమా సహితుడై ఎన్నో భోగములనుభవించెను. ఇంద్రదత్తము, మనోవాంఛితముగ పోగల రధము నధిరోహించి కల్కి తన భార్యలను తోడ్కొని అనేక ద్వీప, నదీ, పర్వత, కుంజనికుంజములందు విహరించుచూ దివారాత్రములు మరచెను. పద్మాదేవి యొక్క సుగంధయుత ముఖపద్మము నందలి సుగంధ రసాస్వాదము కావించుచూ కాలము వెళ్ళబుచ్చెను.

ఒకనాడు ఆ మహాప్రభువు ఇంద్రనీలమణులతో ప్రకాశించు ఒక గుహయందు ప్రవేశించెను. అంత వందలాది కమలపుష్ప సౌందర్యరాశి అయిన పద్మ, చంద్రకళా సదృశ సౌందర్యమూర్తి అయిన రమ, తమననుసరించు వందలాది వనితలతో ఆ గుహ యందు ప్రవేశించిరి. అత్యంత మనోహరమూర్తి అయిన పద్మ తన పతితో రమించుటకై ఆ గుహ ప్రవేశించెను. కల్కిపై అత్యంత కామభావన కలిగిన రమ సహితము చెలుల సహితయై ఆ గుహలోనికి అరిగెను. కానీ ఆ గుహాంతర్భాగమున నీలిమేఘచ్ఛాయుడయిన కల్కి భగవానుడు అనేకమంది సుందర స్త్రీలతో పరివేష్ఠితుడై యుండుటగాంచి పద్మ అచేతనయై మూర్ఛితురాలైయ్యెను. వందలాది చెలులతో కూడిన రమ సహితము ఈ దృశ్యమును గాంచి

హతాశురాలైయ్యెను. అంత పద్మాదేవి తన కంటి కాటుకతో అచటగల నేలపై శుక సహితుడయిన కల్కి భగవానుని చిత్రించి, కస్తూరి మొదలగు ద్రవ్యములతో ఆ చిత్రమునకు రంగులుదిద్ది, తన మనసున కల్కి భగవానుని ఆలింగనమొనర్చి ప్రణామములొనర్చెను. మధురభాషిణి, కామపీడిత అయిన రమ తన హృదయమందు కల్కి భగవానుని స్థుతించి, ఆయనను తన హృదయకమలమందు స్థాపించి, ధ్యానించి, తన భూషణములు అన్నింటిచే ఆయనకు పూజనమొనర్చి, ఉదాసీనయై దు:ఖిత అయ్యెను. అయిననూ ఆమె కల్కిని పొందక, కోకిలస్వర అయిన రమ ఎలుగెత్తి రోదించుచూ "హరీ! ప్రసన్నుడవు కమ్ము!" అని పలుకసాగెను. పద్మాదేవి సహితము తన భూషణములన్నింటినీ విసరివైచి, కల్కి భగవానుని కొరకై రోదించుచూ భూమిపై పడెను. ఆమె శరీరము ధూళిదూసరమై కంఠమందలి కస్తూరి ఆ ప్రదేశమంతయు అలముకొనుటచే ఆమె కామదేవుని నశింపజేయుటకై శివత్వమును ప్రాప్తించిన నీలకంఠుని వోలె యున్నది.

అంత తన ప్రియతమల భక్తిని గ్రహించిన విష్ణురూపుడయిన కల్కి శుష్కించినచంద్రుని పోలిన తన పత్నులను సంతోషపరచుటకై వారివద్దకు ఏతెంచెను. వారిరువురు సహితము నిర్మలహృదయులై, పూర్ణకాములై మహితానందమునొంది, వనమందు ఆడ ఏనుగులు గజరాజును చేరినటుల కల్కిని చేరిరి. అంత ఇంద్రదత్త అదరమధిరోహించి కల్కి వారితో కుబేరుని వనమయిన చైత్రరధమునందు, మరియు మంథరాచల కంధరములందు క్రీడించెను. పద్మాదేవి యొక్క అధరామృత పానము సేవించుచూ, రమాదేవి యొక్క ఆలింగన సౌఖ్యముచే సుగంధ శరీరుడయిన కల్కి, అనేకమంది సుందర స్త్రీలచే పరివేష్ఠితుడై శరీరస్పృహ కోల్పోయెను. అత్యంత రూపయవ్వనశాలురైన యువతులు తమ వక్షస్థలముల మధ్య ఆ పురుషోత్తముని యుంచుకొని ఆలింగన పరవశులగుచూ, పులకిత శరీరలై రతిక్రీడలు సలిపిరి. తదుపరి రాసక్రీడచే కలిగిన అలసటచే జనించిన తాపముచే కల్కి సహితులై వారందరూ సరోవర జలములందు మునిగిరి. కొందరు అతివలు ఆయనకు అర్ఘ్యప్రదానము కావించిరి. తదుపరి వారందరూ జలక్రీడలాడిరి. రమ, పద్మాదులతో సహితుడై కల్కిభగవానుడు సర్వులతో ఆనందక్రీడలు సలుపుచూ శంభల యందు విజయము చేసెను. ఏ సజ్జనులు కల్కి భగవానుని చరితామృతమును తమ కర్ణములతో త్రావుచుందురో, వినుచుందురో, ఇతరులకు తెలుపుచుందురో, వారు మురాంతకుడయిన శ్రీకృష్ణ భగవానుని దాస్యము నపేక్షించుచూ మోక్షమును సహితమునొల్లరు.

(శ్రీకల్కి పురాణమందు తృతీయాంశ యందలి కల్కి వర్ణనమను పద్దెనిమిదవ అధ్యాయము సమాప్తము)

పంతొమ్మిదవ అధ్యాయము

(కల్కి నిర్ణయము)

సూతుడు "ఈవిధముగ కాలచక్రము తిరుగుచుండగా ఒకనాడు చతుర్ముఖ బ్రహ్మదేవుడు దేవ, గంధర్వ, కిన్నెర, కింపురుష పరివేష్ఠితుడై రధమధిరోహించి శంభల నగరమున కేతెంచి, సభామధ్యమున శరణాగతవత్సలుడు, కమలనేత్రుడయిన కల్కి భగవానుని దర్శించెను. ఆ సమయమున కల్కి నీలిమేఘశ్యాముడై, విశాలవక్షుడై, పుష్ఠి అయిన గుండ్రని భుజములు, విద్యుత్కాంతులీను రత్నఖచిత సువర్ణ ముకుటము, సూర్యకాంతులీను మకర కుండలాలంకృతాంగుడై, సుందర దరహాసముచే అలంకృతమయిన పూర్ణచంద్ర వదనుడై యుండెను. అంతేకాక ఆ సర్వలోకాధీశుడు కుముదినీ (తెల్ల కలువ) సుగంధభరితుడై, మిరుమిట్లు గొలుపుచున్న ఇంద్రధనువు వంటి ఆస్తరణము ధరించి అమితానంద రసముచే దేదీప్యమానముగ వెలుగుచుండెను. ఆయన అంగప్రత్యంగములన్నియు మణిమయ రత్న భూషణములచే దీప్తించుచున్నవి. అంత అచటికేతెంచిన దేవతాగణమంతయు ఆ కమలాక్షుని ఇట్లు కీర్తించిరి "ఓ! పరమేశ్వరా! దేవతా సార్వభౌమా!

సమస్త సంసారమునకు స్వామీ! అనంతా! మీరు సంసారమందలి కష్టములనెడు గడ్డివామును దహనమొనర్చు ప్రచండాగ్నిరూపులు. మీ శక్తి అనంతము. ఈ కనిపించుచున్న చరాచర జగత్తు అంతయు మీయందే ఉపస్థితమయినది. మీ చరణకమలములందు స్థితిగతమయిన నూపురములందలి రత్నప్రభచే శేషుడు సహితము పరాజితుడగును. మీకు విజయమగుగాక! త్రిలోకముల యందు ప్రకాశించు పరబ్రహ్మ స్వరూపమా! ఓ! శ్యామవర్ణా! వక్షస్థలమందు ధగధగలాడుచున్న కౌస్తుభమణి ధరించినవాడా! మేఘముల మధ్య వెలుగు తారాపతీ! మేమందరమూ పత్నీపుత్ర సహితులమై మిమ్ము శరణుజొచ్చుచున్నాము. ఓ! విష్ణుభగవానుడా! మమ్ము రక్షింపవలసినది. స్వామీ! మీకు మాయందు కృపయున్నఎడల సత్యధర్మములు పూర్ణముగ వ్యాప్తినొంది మీ శాశకత్వమందున్న ఈ పుడమిని వదలి ఇక వైకుంఠధామము చేరవలసినది."

అంత కల్కి భగవానుడు ఆ పలుకులు విని, వాని ప్రాముఖ్యతను గుర్తించి, యోగ్యమయిన భక్తులతో వైకుంఠమున కేగుటకు నిశ్చయించెను. అంత మహా పరాక్రమవంతులు, అత్యంత బలశాలురయిన తన నలుగురు పుత్రులను పిలచి వారికి రాజ్యాధికారము పంచెను. తదుపరి తన రాజ్యమందలి ప్రజలను రావించి, దేవతల ప్రార్ధనచే తాను తిరిగి వైకుంఠమున కేగుటకు నిశ్చయించితినని తెలిపెను. అంత ప్రజలందరూ ఆశ్చర్యచకితులై, ఆధోముఖులై, రోదించుచూ, కల్కి భగవానునితో ఇట్లనిరి "స్వామీ! సంపూర్ణ ధర్మజ్ఞాతలయిన మీరు మమ్ము వీడవలదు. ఓ! భక్తవత్సలా! మీరెక్కడికేగిననూ మేము సహితము అచటి కేతెంచెదము. స్వామీ! సాధారణముగ జనులకు తమ ధన, గృహ, పుత్రాదులు అత్యంత ప్రియమగును. కానీ ఓ! యజ్ఞపురుషా! మీరు ఇహపర లోకములందు దు:ఖములను దూరమొనర్చెదరు. అందువలన మా ప్రాణములు మిమ్మే అనుసరించును." అంత కల్కి తన మధుర భాషణముచే వారిని వారించి, తాను సహితము భారమయిన హృదయముతో తన పత్నులయిన పద్మ, రమా సహితుడై కల్కి పయనమయ్యెను. ఆవిధముగ ఆయన ఏగి, హిమాలయమందలి గంగాతటము చేరి దేవ, మునిజన పరివేష్టితుడై తిరిగి చతుర్భుజ రూపము ధరించెను. ఆ సమయమున మునిజనులు తొలుత గంగాస్తుతి కావించి అటుపిదప కల్కిభగవానుని చేరిరి. ఆ తరుణమున పూర్ణ జ్యోతిస్వరూపుడై, సాక్షీరూపుడై, వేలాది సూర్యసదృశ తేజోసంపన్నుడై, పురాతన పరమాత్మ అయిన విష్ణుభగవానుడు శోభిల్లెను. తన నాలుగు హస్తములందు శంఖ, చక్ర, గదా, పద్మములు ధరించి సర్వాభరణ భూషితుడై విష్ణుభగవానుడు విరాజమానుడయ్యెను. దేవదుందుభులు భూనభోంతరాళములు ప్రతిధ్వనింపగా దేవతలు అత్యంత సుగంధభరిత పుష్పవర్షము కురిపించిరి.

రూపరహితుడయిన పరమాత్మ తన వైకుంఠ ప్రస్థాన సమయమున ధరించిన విష్ణురూపమును గాంచి జడచేతనమయిన సమస్త లోకములు మోహితమయినవి. తమ పతి అయిన కల్కి యొక్క విస్మయాత్మక విష్ణురూపమును గాంచి విస్మయమొంది పద్మ, రమలు అగ్నియందు ప్రవేశించి, తమ పాంచభౌతిక రూపములు విసర్జించి, ఆ పరమాత్మని యందు లీనమయిరి. కల్కి భగవానుని ఆజ్ఞచే ధర్మము, కృతయుగము చిరకాలము శత్రురహితమై సుఖపూర్వకముగ పృధివి యందు నివసించిరి. కల్కి ఆజ్ఞను పాలించుచూ మరు, దేవాపిలు తమ తమ రాజ్యములను ధర్మయుక్తముగ పరిపాలించి ధర్మరక్షణ కావించిరి. కల్కి వైకుంఠమున కేగుచున్నాడని తెలిసిన విశాఖయూప మహీపతి తన రాజ్యమును పుత్రులకొసంగి వనముల కరిగెను. మిగిలిన రాజులందరూ కల్కి విరహముచే అత్యంత దు:ఖితులై ఆయనయందు జపధ్యానములు ఆచరించుచూ రాజ్యవిరక్తులైరి."

ఈవిధముగ సంసారమును పవిత్రమొనరించు కల్కి భగవానుని చరితమును మునులకు వచియించి శుకుడు నరనారాయణాశ్రమమున కేగెను. శాంతి కాముకులు శాంతికి నివాసులైన మార్కండేయాది మునులు కల్కి చరితములనాలకించి, ఆయనను నిరంతరము ధ్యానించుచూ, ఆయన యశస్సును ప్రశంశించిరి. కల్కి పరిపాలనా సమయమున ప్రపంచమందు అధర్మపరాయణులు, అల్పాయువులు, దరిద్రులు, పాఖండులు, నాస్తికులు లేరు. ఈ

సమయమున శారీరక, మానసిక రోగములు, చింతలు, తాపత్రయములు (ఆధ్యాత్మిక, ఆదిదైవిక, ఆదిభౌతిక) లేవు. సమస్త జీవకోట్లు ద్వేషభావము మరచి నిరంతర ఆనందమగ్నులైరి. ఈవిధముగ తెలుపబడిన కల్కిపురాణము భవ్యము, మరియు ధన, యశ, ఆయు: స్వర్గ ప్రదాయకము, కళ్యాణములకు పరమ నివాసము. ఈ పురాణము సంసారమందలి కష్ఠ, దు:ఖ, పాపములను నాశమొనర్చి, కలి దోషములను నష్ఠమొనర్చి, సుఖమును, వాంఛిత ఫలములను, మోక్షమును సహితము ప్రసాదించును. ఈ సంసారమందు మనోవాంఛిత సర్వకామనలను పూర్ణమొనరించు కల్కిపురాణమను భక్తిరూప సూర్యుడుదయించనంతవరకే కుశాస్త్రములు (విపరీతార్థ శాస్త్రములు) అనెడు దీపములు వెలుగుచుండును. అనగా ఈ కల్కిపురాణము అజ్ఞానాంధకారమును దూరమొనర్చును. నిర్మల పదజాలముచే విష్ణుభగవానుని గూర్చి వర్ణించినది, అతులిత భక్తి ప్రదాయకమయిన కల్కిపురాణమును ఇతర మునుల సహితుడై వినిన భృగువంశ సంజాతుడయిన శౌనకఋషి రోమహర్షణ పుత్రుడయిన సూతుని అపారజ్ఞాన సంపన్నునిగా తెలిసికొని, పున: ఈ విధముగ ప్రశ్నించెను.

(శ్రీకల్కి పురాణమందు తృతీయాంశ యందలి కల్కి నిర్ణయమను పంతొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

ఇరువదియవ అధ్యాయము

(గంగాస్థవము)

శౌనకుడు "సూతా! సర్వధర్మజ్ఞాతా! మునిగణములు గంగాస్థుతి ఒనరించి కల్కిభగవానుని చేరెనని తెలిపితిరి కదా! ఈ గంగాస్థుతి భక్తిపూర్వకముగ చదివెడి వారలకు, వినెడివారలకు, సహితము పాపములు శమింపజేసి, సర్వ కళ్యాణములను కటాక్షించి, మోక్షమును సహితము ప్రసాదించును. స్వామీ! మాకు ఆ గంగాస్థుతిని తెలుపవలసినది." సూతుడు "ఓ! ఋషులారా! మానవుల దు:ఖ మోహములను దూరమొనర్చునది, ఋషుల ద్వారా తెలుపబడినది, అయిన శ్రేష్ఠ గంగాస్థుతిని వినవలసినది – ఈ సురనది విష్ణు పాదోద్భవ, మరియు సంసారసాగరమునుండి తరింపజేయునది. ఇయ్యది సుమేరు పర్వత శిఖరాగ్రమున నివసించు దేవతలకు సహితము ప్రియమయినది, సమస్త మలినములను పారద్రోలునది; పరమ కళ్యాణకారిణి మరియు జన్మమృత్యు సంసారచక్రము వలన కలిగెడు భయమును దూరమొనర్చునది. భగీరథ మహీపతిని అనుసరించినది, ఐరావతపు గర్వమును ఖర్వమొనరించినది, శివుని జటాజూటము నందు శోభిల్లినది, హిమాలయముల స్వచ్ఛతకు పరాకాష్ఠ; త్రిమూర్తులు, దేవ, మానవ, సర్ప, జాతులచే స్థుతింపబడునది, పాపములను నాశమొనర్చి మోక్షమును ప్రసాదించు గంగ శోభిల్లుగాక! బ్రహ్మ కమండలమునుండి ఉత్పన్నమయినది, ముక్తిరూప బీజములకు వృక్షరూపము, వేదశాస్త్రములచే సంస్థుతమయినది, జ్ఞానులయిన బ్రాహ్మణ సమూహములకు ఆలవాలమయిన సుమేరు పర్వతచరియలను భేదించుకొని బయటకేతెంచి త్రిలోకములను పావనమొనర్చు భాగీరథి సుఖరూప పత్రములు, ధర్మరూప ఫలములు కలిగిన లతా స్వరూపిణి. పక్షి సమూహములకు ఆలవాలమయినది, సగర వంశజులకు ముక్తి నొసంగినది అయిన ఈ జహ్నుకన్యక స్వర్గలోకమందు మందాకిని అని పిలువబడును.

ఈ నిర్మల జలములను దర్శించినంత మాత్రమున ప్రణామ మొనరించినంత మాత్రమున, ఆమె గుణములను ప్రశంశించినంత మాత్రమున దోషములు నష్ఠమగును. శీతల హిమాలయరూప స్థనసంపద, విరిసిన జలరూప దరహాసము, శ్వేతహంస వంటి గమనము, చంచల తరంగముల వంటి హస్తములు, కలిగి నిరంతర ఆనందముతో ప్రవహించు సముద్రప్రియ గంగ శోభిల్లుచున్నది. ఒకచో మునిగణములచే స్థుతింపబడినది, ఒకచో విష్ణుభగవానునిచే పూజింపబడినది, కొన్నిచోట్ల కలకలారావములతో స్వరయుక్తమయినది, ఒకచో భయంకర జంతువులచే ఉద్విగ్నమయినది, ఒకచో

సూర్యకిరణములచే ప్రకాశితమయినది, ఒకచో ఎత్తైన గిరిశిఖరముల నుండి క్రిందకు దుమికి వ్యాకులమయినది, లోకుల పాపహరణమునకై తనయందు మునుగుట కుపకరించునది అయిన భీష్ముని మాత గంగాదేవికి విజయమగు గాక! ఈ లోకమందు కేవలము భాగీరథి గంగకు ప్రణామ మొనరించువారే కుశలురు. జాహ్నవీగంగ జపము చేయువారే తపోనిధులు. మందాకినిని నిరంతర స్మరణమొనర్చువారే పురుషశ్రేష్ఠులు. దేవనది అయిన గంగ యొక్క సేవయొనర్చు పుణ్యులే సమర్థులు, విజయశీలురు. ఓ! త్రిలోకపావనీ! నీ పవిత్ర జలములందు విలీనమయినది, నీ యందలి పక్షి, మత్స్యములచే భక్షింపబడునది, నీ చంచల తరంగములందు ప్రవహించునది, నీ తటముల మధ్య నివసితమయినది దేవ, నాగ, మనుష్యులచే స్తుతింపబడు నీ దేహమును నేను ఎపుడు దర్శించెదను?

ఓ! జననీ! నీ తటమందు నివసించుట, నీ నిర్మల జలములందు స్నానమాచరించుట, నిన్ను దర్శించుట, నీ నామస్మరణ కావించుట, నీ ఐశ్వర్యయుక్తమయిన కథలను ప్రశంశించుట, ఇవన్నియు మమ్ము పవిత్రుల కావించు కార్యములే! అత్యధిక పాపరాశులు పెంపొందించుకున్న నేను ప్రసన్నత, ప్రయత్నపూర్వకముగ ఎన్నడు నిన్ను ఆదరముతో స్తుతించి, పృధివి యందు శాంతియుతముగ సంచరించెదను?" ఋషుల ద్వారా తెలుపబడిన ఈ స్తోత్రము స్వర్గము, కీర్తి మరియు ఆయు: ప్రదాయకము, సర్వపాపహారకము, మరియు మానవుల ఆయువు, పరాక్రమములను వృద్ధి యొనర్చునది. ఈ స్తోత్రమును త్రిసంధ్యల యందునూ పఠించిన మానవులకు గంగ సామీప్యమగును. ఈ శౌనకాఖ్యానము పరమ పవిత్రము మరియు ధన, యశోప్రదము.

(శ్రీకల్కి పురాణమందు తృతీయాంశ యందలి గంగాస్థవమును ఇరువదియవ అధ్యాయము సమాప్తము)

ఇరువది ఒకటవ అధ్యాయము

(సంక్షేప కల్కి పురాణము)

సూతుడు ఈ కల్కిపురాణమందు తొలుత శుక, మార్కండేయ సంవాదము, అధర్మవంశ వర్ణనము, తదుపరి కలి అవతారము వర్ణింపబడినది. గోరూపము ధరించిన పృధివి బ్రహ్మలోకమున కేగుట, విష్ణుభగవానుడు విష్ణుయశుని ఇంట జననమొందుట, శంభల నగరమందు తన అంశలతో నలుగురు సోదరులుగ పుట్టుట, తన తండ్రితో సంవాదము, యజ్ఞోపవీత సంస్కారము, కల్కి యొక్క వేదాధ్యయనము, అస్త్రశస్త్రజ్ఞాన సముపార్జన, తదుపరి మహాదేవుడయిన శివుని దర్శనము, కల్కిచే కావింపబడిన శివస్థుతి, శివునిచే సన్మానింపబడి కల్కి వరములు బడయుట, విశాఖయూపుని వృత్తాంతము, కల్కి స్వరూప వర్ణనము, శుక కల్కిల సంవాదము, సింహళదేశ వర్ణన, పద్మకు శివుడు వరమొసంగుట, పద్మ స్వయంవరము, నృపసమూహములు స్త్రీలుగా మారుట, పద్మ సంతాపము, కల్కిచే పద్మను వివాహమాడుటకు ప్రయత్నము, శుక దౌత్యము, శుక పద్మల సంవాదము, పద్మచే విష్ణుపూజన, ఆపాదమస్తక విష్ణుధ్యానము, పద్మ శుకముచే భూషణము పంపుట, శుక కల్కి సంవాదము, కల్కి పద్మను పరిణయమాడుట కేగుట, జలక్రీడా సమయమున పరస్పర సమాగమము, కల్కి పద్మల వివాహము, కల్కి దర్శనముచే రాజులు తిరిగి తమ స్వస్వరూపములు పొందుట.

అనంతముని ఆగమనము, రాజులతో ఆయన సంవాదము, అనంతుని నపుంసక జన్మ, శివవరము, అనంతుని వైరాగ్యము, విష్ణుక్షేత్రమందు విష్ణుమాయా ప్రదర్శనము, అనంతముని జ్ఞాన వైరాగ్యములు, పద్మ సహితుడయిన కల్కి శంభల ప్రయాణము, విశ్వకర్మ ద్వారా శంభల నగర నిర్మాణము, పద్మతో నివసించుట, సోదర పుత్ర బంధు బాంధవ సహితుడై కల్కి బౌద్ధుల పరాజితుల కావించుట, బౌద్ధస్త్రీల యుద్ధాగమనము, వాలఖిల్యుల ఆత్మనివేదనము, పుత్రసహిత

కుతోధరి వధ, హరిద్వారమందు మునుల కల్కి దర్శనము, క్రమముగ సూర్య, సోమ వంశవర్ణన, రామచరితము, మరుదేవాపిల కల్కి దర్శనము, భయంకర సంగరమున కోకవికోకుల వధ, శయ్యాకర్ణాది రాజులతో కల్కి భల్లాట నగరమున కేగుట, శశిధ్వజునితో యుద్ధము, సుశాంతచే కావింపబడిన భక్తిపూర్వక విష్ణుస్తుతి, శశిధ్వజుడు కల్కి, కృతయుగ, ధర్మలను తన అంత:పురమునకు గొనిపోవుట, సుశాంతచే కావింపబడిన స్తుతి, కల్కి రమల వివాహము, శశిధ్వజుని పూర్వజన్మ వృత్తాంతము, శశిధ్వజుని మోక్షము, విషకన్యముక్తి, రాజుల రాజ్యాభిషేకము, మాయాస్తుతి, శంభల నగరమందు యజ్ఞానుష్ఠానము, నారదముని ఉపదేశముచే విష్ణుయశుని మోక్షము, రుక్మిణీవ్రత ప్రశంశ, కల్కి భగవానుడు రమించుట, పుత్ర పౌత్రాదుల ఉత్పత్తి, దేవగణములు శంభల నగరమునకు ఏతెంచుట, విష్ణురూపుడయిన కల్కి వైకుంఠ ప్రయాణము, పరమ కళ్యాణకర కథలను వచించి శుకుడు ప్రస్థానమగుట, గంగాస్తోత్రము.

పంచలక్షణయుక్తము (సర్గ, ప్రతిసర్గ, వంశము, మన్వంతరము, వంశానుచరితము) అయిన ఈ పురాణము సంసారమున ఆనంద ప్రదాయకము. ఇయ్యది ఆరువేల ఒకవంద శ్లోకములందు వచింపబడినది. సర్వ శాస్త్రార్థ తత్వసారము, వీనులకు విందైనది, అయిన ఈ పురాణము పాపులకు సహితము సిద్ధిప్రదానము కావించును. ప్రళయానంతరము సాక్షాత్ శ్రీహరి ముఖమునుండి వెలువడి సమస్త సంసారమునందు ప్రసారితమయిన ఈ పురాణము ధర్మార్థకామమోక్షములనెడు చతుర్విధ పురుషార్థములను ప్రసాదించును. ఈ భూలోకమందు వేదవ్యాసునిచే తెలుపబడిన ఈ పురాణమందు విష్ణురూప కల్కి భగవానుని అత్యధిక, విస్మయాత్మక ప్రభావము వివరింపబడినది. ఏ పుణ్యజీవులు సద్బ్రాహ్మణులకు ఆదరపూర్వకముగ గో, భూ, గజాశ్వ, వస్త్ర, భూషణాదులు దానమొనర్చి, వారికి పూజనమొనరించి తదుపరి ఈ భూమండలమందు ఏ పవిత్ర తీర్థ, క్షేత్ర, లేక ఆశ్రమమందు లేక ఏ సజ్జన సభయందు భక్తిపూర్వకముగ పరిపూర్ణ విష్ణుభావనచే ఈ పవిత్ర పురాణమును వినినా లేక తెలిపినా వారు నిశ్చయముగ మోక్షము నొందెదరు. దీనిని వినిన బ్రాహ్మణులు వేదవేదాంగ పారంగతను, క్షత్రియులు రాజ్యమును, వైశ్యులు ధనమును, శూద్రులు మహత్వమును పొందెదరు. ఈ పురాణ శ్రవణముచే పుత్రార్థులు పుత్రులను, ధనార్థులు ధనమును, విద్యార్థులు విద్యను పొందెదరు.

ఈ పురాణ శ్రవణమయిన పిదప సూతుడు తీర్థాటనమునకేగి నరనారాయణాశ్రమము సందర్శించెను. శౌనకాది మునులు నైమిశారణ్యమునకేగి విష్ణు ధ్యానమందు నిమగ్నులై మోక్షమునందిరి. సకల పురాణజ్ఞాత, నియమపాలన కర్త, వ్యాసుని అంతేవాసి, మునిశ్రేష్ఠుడు, రోమహర్షణ పుత్రుడయిన సూతునకు ప్రణామములర్పించుచున్నాను. సమస్త శాస్త్రములు పఠించి, శాస్త్రార్థములను పున: పున: పరిశీలించి చూడగా తెలియబడిన ప్రామాణిక అంశము నారాయణుడే ధ్యానయోగ్యుడు. అంతేకాదు. వేదము, పురాణములు, రామాయణ, మహాభారతాదులందు సహితము ఆదిమధ్యాంతముల యందు అన్నిచోట్లా హరి యొక్క గుణగాన సంకీర్తనమే కావింపబడినది!! నీలనీరద మేఘవర్ణ సంకాశుడు, వాయువేగ సమన్వితుడు, హస్తమందు చంద్రహాసము ధరించినవాడు, సర్వులను తానొక్కడే ఏకమాత్రముగ రక్షింపగల సమర్థుడు, కలి వంశమును, సేనను నాశమొనర్చువాడు, సత్యధర్మ స్థాపకుడు, రాజ స్వరూపుడయిన కల్కి సర్వులకు కళ్యాణమొనర్చుగాక!

(శ్రీకల్కి పురాణమందు తృతాయంశ యందలి సంక్షేప కల్కి పురాణమను ఇరువది ఒకటవ అధ్యాయము సమాప్తము)

శ్రీకల్కి పురాణము సంపూర్ణము

అనుబంధము

కల్కి కృత శివస్తోత్రము

గౌరీనాథం విశ్వనాథం శరణ్యం భూతావాసం వాసుకీ కంఠభూషణం
త్ర్యక్షం పంచాస్యాదిదేవం పురాణం వందే సాంద్రానంద సందోహదక్షమ్ ॥

యోగాధీశం కామనాశం కరాళం గంగాసంగక్లిన్న మూర్ధనమీశం
జటాజూటాటోపరిక్షిప్తభావం మహాకాలం చంద్రఫాలం నమామి ॥

శ్మశానస్థం భూత భేతాళసంగం ఖడ్గ శూలాదిభిశ్చ
వ్యాగ్రాత్యుగ్ర బాహవో లోకనాశో యశ్య క్రోధోద్భూత లోకోస్తమేతి ॥

యోభూతాది: పంచభూతై: సిసృక్షు: తన్మాత్రాత్మా కాలకర్మ స్వభావై:
ప్రహృత్యేదం ప్రాప్య జీవాత్మమీశో భ్రహ్మానందో రమతేతం నమామి ॥

స్థితౌవిష్ణు: సర్వజిష్ణు: సురాత్మా లోకాన్ సాధూన్ ధర్మసేతూన్ విభర్షి
భ్రహ్మాద్యాంశో యోభిమానీ గుణాత్మా శబ్దాధ్యంగైస్తం పరేశం నమామి ॥

యస్యాజ్ఞయా వాయవో వాంతిలోకే జ్వలతాగ్ని: సవితాయాతి తప్యన్
శీతాంసు: ఖే తారకై: సగ్రహైశ్చ ప్రవర్తతే తం పరేశం ప్రపద్యే ॥

యస్యాశ్వాసాత్ సర్వధాత్రీ ధరిత్రీ దేవో వర్షత్యంబుకాల: ప్రమాతా
మేరుర్మధ్యే భువనానాంచ భర్తా తమీశానం విశ్వరూపం నమామి ॥

నృపకృత నారాయణ స్తోత్రము

జయజయ నిజమాయయా కల్పితాశేష విశేషకల్పనా పరిణామ
జలాప్లుతలోక త్రయోపకారణ మాకలయ్య మనుమానిశమ్య పూరితం విజనా
విజనావిర్భూత మహామీనశరీర త్వం నిజకృత ధర్మసేతు సంరక్షణ కృతావతార: ॥

పునరపి దితిజబల పరిలంఘిత వాసవసూదనాదృత జితత్రిభువన పరాక్రమ హిరణ్యాక్షనిధన
పృథివ్యుర్ధ రణసంకల్పాభి నివేశన ధృతకీలావతార: పాహిన: ॥

పునరపి జలధిమధనాదృత దేవదానవగణ మందరాచలానయన వ్యాకులితానాం
సాహాయ్యోనా దృతచిత్త పర్వతోద్ధరణామృత ప్రాశన్ రచనావతార
కూర్మాకార ప్రసీద పరేశ త్వం దీననృపాణాం ॥

పునరపి త్రిభువనజయినో మహాబలపరాక్రమస్య హిరణ్యకశిపోరర్ధితానాం
దేవవరాణాం భయభీతానాం కళ్యాణాయ దితిసుత వధప్రేప్సుర్బ్రహ్మణో
వరదానాదవధ్యస్య నశస్త్రాస్త్ర రాత్రిదివా స్వర్గమర్త్య పాతాళతలే దేవగంధర్వకిన్నెర నరనాగైరితి
విచింత్య నరహరి రూపేణ నఖాగ్రభిన్నా రుందష్ఠదంతచ్ఛదం త్యక్తాసుం కృతవానసి ॥

పునరపి త్రిజగజ్జయినో బలే: సత్రే శుక్రానుజో వటువామనో దైత్యసమ్మోహనాయ
త్రిపద భూమియాంచాచ్ఛలేన విశ్వకాయస్థదుస్సృష్ఠ జలసంస్పర్శ వివృద్ధమానోభిలాషస్త్వం
భూతలే బలే దైవారికత్వమంగీకృతముచితం దానఫలమ్ ॥

పునరపి హైహయాది నృపాణామిత బలపరాక్రమాణాం నానా మదోల్లంఘిత మర్యాదావర్త్మానం
నిధనాయ భృగువంశజో జామదగ్న్య: పితృహోమధేనుహరణ ప్రవృద్ధ మన్యువశాత్
త్రిసప్తకృత్వో ని:క్షత్రియాం పృధివీం కృతవానసి పరశు రామావతార: ॥

పునరపి పులస్త్య వంశావతంసస్య విశ్రవస: పుత్రస్య నిశాచరస్య రావణస్య లోకత్రయ తాపనస్య నిధన మురరీకృత్య రవికులజాత దశరథాత్మజో విశ్వామిత్రాదస్త్రాణ్యుపలభ్య వనే సీతాహరణ వశాత్ ప్రవృద్ధమన్యునా అంబుధిం వానరైర్నిబధ్యసగణం దశకంధరం హతవానసి రామావాతార: ॥

పునరపి యదుకులజలధి కళానిధి: సకల సురగణ సేవిత పాదారవింద ద్వంద్వ: వివిధ దానవదైత్యదళన లోకత్రయ దురితతాపనో వసుదేవాత్మజో రామావతారో బలభద్రస్త్వమసి ॥

పునరపి విధికృతవేద ధర్మానుష్ఠాన విహిత నానాదర్శన సంఘ్రుణ: సంసాకర్మ త్యాగవిధినా బ్రహ్మాభాస విలాసచాతురీం ప్రకృతి విమాననామ సంపాదయన్ బుద్ధావతార స్త్వమసి ॥

అధునా కలికుల నాశావతారో బౌద్ధ పాషండ మ్లేచ్ఛాదీనాంచ
వేదధర్మసేతు పరిపాలనాయ కృతావతార: కల్కిరూపేణస్మాన్
స్త్రీత్వ నిరయాదుద్ ధృతవానసి తవానుకంపాం కిమిహ కథయామ: ॥

కృతే బ్రహ్మాదీనామ విదిత విలాసావతరణం
క్వన: కామా వామామాకులిత మృగతృష్ణార్తీ మనసాం
సుదుష్ప్రాప్యం యష్మచ్ఛరణ జలజాలోక నమిదం
కృపాపారావార: ప్రముదిత దృశాశ్వాసయ నిజాన్ ॥

మాయాస్థవము శశిధ్వజ ఉవాచ

ఓం హ్రీంకారాం సత్వసారాం విశుద్ధాం బ్రహ్మాదీనాం మాతరం వేదభోద్యామ్
తన్వీం స్వాహాం భూత తన్మాత్రకక్షాం వందేవంద్యాం దేవగంధర్వసిద్దై: ॥

లోకాతీతాం ద్వైతభూతాం సమీడే భూతైర్భవ్యాం వ్యాససామాసికాద్యై:
విద్యుత్‌గీతాం కాలకల్లోల్లోలాం లీలాంపాంగ క్లిప్త సంసార దుర్గాం ॥

పూర్ణాం ప్రాప్యామద్వైతలభ్యాం శరణ్యాం ఆద్యేశేషే మధ్యతో యా విభాతి
నానారూపైర్దేవ తిర్యక్ మనష్యై: తామాధారాం బ్రహ్మరూపాం నమామి ॥

యస్యాభాసా త్రిజగద్భాతి భూతైర్నభాత్యేతత్తద భావే విధాతు:
కాలోదైవం కర్మచోపాధయో యే తస్యభాసా తాం విశిష్టాం నమామి ॥

భూమౌగంధోరసతాప్సుప్రతిష్ఠా రూపం తేజస్యేవ వాయౌ స్పృశత్వమ్
ఖేశబ్దోవా యచ్చిదాభాస్తి నానాతామభ్యేతాం విశ్వరూపాం నమామి ॥

సావిత్రీత్వం బ్రహ్మరూపా భవానీ భూతేశస్య శ్రీపతే: శ్రీస్వరూపా
శచీశక్రస్యాపి నాకేశ్వరస్య పత్నీశ్రేష్ఠా భాసిమాయే! జగస్తు ॥

బాల్యేబాలా యువతీ యవ్వనేత్వం వార్ధక్యేయా స్థవిరా కాలకల్పా
నానాకారైర్యాగ యోగైరుపాస్య జ్ఞానాతీతా కామరూపా విభాసి ॥

వరేణ్యాత్వం వరదా లోకసిద్ధయా సాధ్వీధన్యా లోకమాన్యా సుకన్యా
చండీదుర్గా కాళికా కలికాఖ్యా నానాదేశే రూపవేషైర్విభాసి ॥

తవచరణసరోజం దేవి దేవాదివంద్యం
యది హృదయసరోజే భావయంతీహ భక్త్యా
శృతియుగకుహరే వా సంస్కృతం ధర్మసంపత్
జనయతి జగదాద్యే సర్వ సిద్ధించ తేషామ్ ॥

గంగా స్థవము

ఇయం సురతరంగిణీ భువనవారిధేస్తారిణీ స్థుతా హరి పదాంబుజాదుపగతా జగత్సంసద:
సుమేరుశిఖరామర ప్రియజలామలక్షాళనీ ప్రసన్నవదనా శుభా భవ భయస్య విద్రావిణీ ॥

భాగీరధమథానుగా సురకరీంద్ర దర్పాపహా మహేశముకుటప్రభాగిరిశిర: పతకాశితా
సురాసురనరోరగైరజ భవాచ్యుతై: సంస్థుతా విముక్తిఫలశాలినీ కలుషనాశినీ రాజతే ॥

పితామహ కమండలుప్రభవ ముక్తిబీజాలతా శృతిస్మృతిగణస్తుతా ద్విజకులాల బాలావృతా
సుమేరుశిఖరాభిదానిపతితా త్రిలోకావృతా సుధర్మఫలశాలినీ సుఖపలాశినీ రాజతే ॥

చరద్విగహమాలినీ సగరవంశ ముక్తిప్రదా మునీంద్రవరనందినీ దివిమాతాచ మందాకినీ
సదాదురితనాశినీ విమలవారి సందర్శన ప్రణామగుణకీర్తనాదిషు జగత్సుసంరాజతే ॥

మహాభిధస్తుతాంగనా హిమగిరీశ కూటస్థనీ సఫేన జలహాసినీ సితమరాళ సంచారిణీ
చలల్లహరసత్కరా వరసరోజమాలాధరా రసోల్లసితగామినీ జలధికామినీ రాజతే ॥

క్వచిన్ మునిగణై:స్తుతా క్వచిదనంత సంపూజితా క్వచిత్ కలకలస్వనా క్వచిదధీరయాదోగణా
క్వచిత్ వికరోజ్వలా క్వచిదుదగ్రపాతాకులా క్వచిజ్జన విగాహితా జయతి భీష్మమాతా సతీ ॥

సయేవకుశలీజన: ప్రణమతీహ భాగీరథీం సయేవ తపసాం నిధిర్జపతి జాహ్నవీమాదరాత్
సయేవ పురుషోత్తమ: స్మరతిసాధు మందాకినీం సయేవవిజయీప్రభు: సురతరంగిణీం సేవతే ॥

తవామల జలార్చితం ఖగశృగాలమీనక్షతం చలల్లహరి లోలితం రుచిరాతీర జంబాలితమ్
కదానిజవపుర్ముదా సురనరోరగై: సంస్థుతోప్యహం త్రిపధగామినీ ప్రియమతీవ పశ్యాంమహో

త్వత్తీరేవసతిం తవామలజలస్నానం తవప్రేక్షణం త్వన్నామస్మరణం తలోదయకథా సంలాపనం
పావనం గంగే! మేతవసేవనైక నిపుణోప్యానందితశ్చాదృత: స్తుత్వాత్వోద్గత పాతకో భువికదా
శాంతశ్చర్యిష్యామ్యహం ॥

ఇత్యేతదృషిభి: ప్రోక్తం గంగాస్థవమనుత్తమమ్ స్వర్గ్యం యశస్యమాయుష్యం పఠనాత్ శ్రవణాదపి
సర్వపాపహరం పుంసాం బలమాయుర్వర్ధనమ్ ప్రాత:మధ్యాహ్నసాయంత్రే గంగా సాన్నిధ్యత భవేత్ ॥